# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 217 | హైదరాబాద్ | గురువారం 19-02-2026 | పేజీలు : 12 | వెల : 1.00





ట్రంప్ కు ఇరాన్ సుప్రీం వార్నింగ్

## నా దుడ్లతోనే మ్యాచ్ చూస్తిని.. నీవేమైనా ఇచ్చావా జగన్?: నారా లోకేశ్




- కొలంబోలో జరిగిన భారత్-పాక్ క్రికెట్ మ్యాచ్ కు హాజరైన మంత్రి
- ప్రభుత్వ సొమ్ముతో కొలంబో వెళ్లారన్న ప్రచారాన్ని ఖండించిన లోకేశ్
- పుష్ప స్టైల్లో ఎక్స్ వేదికగా వైసీపీకి మంత్రి కౌంటర్





## 2034 నాటికి నెట్ జీరో నగరంగా హైదరాబాద్

- రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీకి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాం
- పట్టణాభివృద్ధిలో రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలుపుతాం..
- విద్యుత్ ఉత్పాదక వనరులే అసలైన కరెన్సీ..
- క్లైమేట్ ఎమర్జెన్సీగా ప్రస్తుత పరిస్థితి
- ముంబై క్లైమెట్ వీక్ కాన్ఫరెన్స్‌లో సీఎం రెడ్డి వ్యాఖ్యలు

## 'రైతు భరోసా'.. మరింత ఆలస్యం..!

- పరిషత్ ఎన్నికలపై తేలాకే నిర్ణయం
- ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలపై
- ఎటూ తేల్చుకోలేకపోతున్న కాంగ్రెస్ సర్కారు
- పెట్టుబడి సాయం అందజేతపై సందిగ్ధత
- ఫిబ్రవరి 25 నుంచి ఏప్రిల్ 16 వరకు
- ఇంటర్, పది పరీక్షలు
- మే నెలలో ఎన్నికల నిర్వహణకు ప్రాథమికంగా నిర్ణయం
- ఈ నెల 23న భేటీలో స్పష్టత వచ్చే అవకాశం








## భారత్‌తో గూగుల్ భవిష్యత్ భాగస్వామ్యం గురించి స్పష్టమైన సంకేతాలు ఇచ్చిన సుందర్ పిచాయ్

- భారత్ లో జరుగుతున్న ఏఐ సమ్మిట్ కోసం విచ్చేసిన గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్
- అంతకు ముందు జాతీయ మీడియాతో కాలిఫోర్నియా నుంచి వర్చువల్ గా మాట్లాడిన సుందర్
- భారత్ ఏఐ ప్రయాణంలో గూగుల్ భాగస్వామి కావాలనుకుంటోందని స్పష్టీకరణ

## పాకిస్థాన్‌కు 'జల' గండం
### రావి నది నీటిని నిలిపివేయనున్న భారత్

- తుది దశకు చేరిన షాపుర్‌కండి బ్యారేజీ నిర్మాణం
- మార్చి 31 నాటికి ప్రాజెక్టు పూర్తి
- కశ్మీర్, పంజాబ్ రైతులకు సాగునీటి సరఫరా
- సింధు జలాల ఒప్పందం నేపథ్యంలో భారత్ కీలక నిర్ణయం







## సేవలు అందుబాటులోకి వచ్చాయి..
### సహనంతో ఉన్నందుకు ధన్యవాదాలు: యూట్యూబ్

- సమస్యను పరిష్కరించినట్లు తెలిపిన యూట్యూబ్
- ఫిర్యాదులు రావడంతో సమస్యను పరిష్కరించామన్న యూట్యూబ్
- 3,21,958 ఫిర్యాదులు చూపించిన అవటేజ్ ట్రాకింగ్ సైట్ డౌన్‌డిటెక్టర్

## క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు : నారా లోకేశ్

- క్రైస్తవ సోదర సోదరీమణులకు మంత్రి నారా లోకేశ్ లెంట్ శుభాకాంక్షలు
- 40 రోజుల ఉపవాస ప్రార్థనల పవిత్ర కాలాన్ని పురస్కరించుకుని సందేశం
- యేసు త్యాగాన్ని స్మరించుకునే ఈ కాలం విశ్వాసం, కరుణ నింపాలని ఆకాంక్ష
- సామాజిక మాధ్యమాల్లో లోకేశ్ సందేశానికి మంచి స్పందన







విశాఖ తీరంలో నౌకాదళ విన్యాసాలు..

## ఐఎన్ఎస్ సుమేధపై రాష్ట్రపతి, సీఎం ప్రయాణం

- ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ వేడుకలకు హాజరైన ద్రౌపది ముర్ము
- వేడుకల్లో కదం తొక్కిన 71 యుద్ధ నౌకలు
- ప్రత్యేక ఆకర్షణగా 19 విదేశీ నౌకలు



భారతశక్తి

# యెల్లో మెటల్ ధరల పతనానికి రష్యా మాస్టర్ స్ట్రోక్..

రష్యా తీసుకున్న ఒక కీలక నిర్ణయం కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరలపై పెను ప్రభావం పడే అవకాశం ఉందన్న వార్తలు ఇప్పుడు మదుపర్లలో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. బంగారం ధరలు సామాన్యులకు షాకిస్తున్నాయి. గతేడాది కాలంగా గోల్డ్ ధరలు అంతకంతకూ పెరుగుతూ రికార్డులు క్రియేట్ చేస్తుంది. అటు వెండి సైతం బంగారంతో మించి పైపైకి దూసుకెళ్తుంది. అయితే నిన్నటి వరకు ఆకాశమే హద్దుగా దూసుకుపోయిన పసిడి ధరలు ఇప్పుడు దిగివచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. గత కొంతకాలంగా భారత్‌లో ఒక సావరిన్ (ఎనిమిది గ్రాముల) బంగారం ధర రూ.1,15,000 మార్కును దాటి.. సామాన్యులకు ఎనిమిదవ వింతలా మారుతుందేమోనన్న ఆందోళన కలిగించింది. అయితే తాజాగా అంతర్జాతీయ మార్కెట్‌లో చోటుచేసుకున్న అనూహ్య పరిణామాలు బంగారం ధరల పతనానికి నాంది పలికాయి. జనవరి 29 నుండి బంగారం ధరల్లో స్థిరమైన తగ్గుదల కనిపిస్తోంది. త్వరలోనే ఇది రూ.1 లక్ష కంటే కిందికి పడిపోయే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు భారత మార్కెట్‌లో బంగారం ధరలు అనూహ్యంగా రూ. 1 లక్ష దిగువకు పడిపోయే అవకాశం ఉందన్న అంచనాలు వెలువడుతున్నాయి. రష్యా తన బంగారు నిల్వలను భారీగా విక్రయించాలని లేదా మార్కెట్‌లోకి వదలాలని తీసుకున్న నిర్ణయం వల్ల సరఫరా పెరిగి ధరలు తగ్గవచ్చని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రస్తుతం రికార్డు స్థాయి ధరలతో ఉన్న పసిడి, ఈ పరిణామంతో సామాన్యులకు కొంత ఊరటనిచ్చే దిశగా సాగుతోంది. కామెక్స్ గోల్డ్ ధరలు త్వరలో ఔన్సుకి 3,000 డాలర్ల మార్కును తాకే అవకాశం ఉందని విశ్లేషణలు వినిపిస్తున్నాయి. రష్యా కదలికల వల్ల డాలర్ ఇండెక్స్‌లో వచ్చే మార్పులు , భౌగోళిక రాజకీయ పరిస్థితులు పసిడి ధరను ప్రభావితం చేయనున్నాయి. సరఫరా, డిమాండ్ మధ్య ఉన్న సమతుల్యత దెబ్బతినడం వల్ల ధరల్లో తీవ్రమైన హెచ్చుతగ్గులు చోటుచేసుకునే అవకాశం ఉంది. భారతదేశం ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద బంగారం వినియోగదారు కావడంతో, అంతర్జాతీయ మార్కెట్ మార్పులు నేరుగా ఇక్కడి ధరలపై ప్రభావం చూపుతాయి. రష్యా నుండి వచ్చే సమాచారం నిజమైతే, దేశీయంగా 10 గ్రాముల బంగారం ధర గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. అయితే, ఇదే సమయంలో రూపాయి విలువ పతనం వంటి ఇతర అంశాలు కూడా ధరలను నియంత్రించవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. బంగారం ధరలు తగ్గవచ్చనే అంచనాల నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు. ఒకవైపు ధరల పతనం ఆకర్షణీయంగా కనిపించినా, రష్యా వంటి పెద్ద ఆర్థిక శక్తుల నిర్ణయాలు మార్కెట్‌ను త్వరగా మార్చగలవు. అందుకే దీర్ఘకాలిక పెట్టుబడుల విషయంలో వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకోవడం ఉత్తమమని వారు అభిప్రాయపడుతున్నారు. బంగారం ధరలు అకస్మాత్తుగా తగ్గడానికి ప్రధాన కారణం రష్యా తీసుకున్న ఒక వ్యూహాత్మక నిర్ణయం. బ్లూమ్‌బెర్గ్ నివేదిక ప్రకారం.. అంతర్జాతీయ వాణిజ్యంలో రష్యా తిరిగి అమెరికా డాలర్‌ను ఉపయోగించాలని నిర్ణయించుకుంది. గతంలో డాలర్‌ను బలహీనపరిచేందుకు రష్యా, చైనా వంటి దేశాలు భారీగా బంగారాన్ని నిల్వ చేశాయి. అయితే ఇప్పుడు రష్యా తిరిగి డాలర్ వైపు మొగ్గు చూపడంతో గ్లోబల్ మార్కెట్‌లో డాలర్ విలువ అనూహ్యంగా పెరుగుతోంది. సాధారణంగా డాలర్ విలువ పెరిగినప్పుడు, అంతర్జాతీయ ఇన్వెస్టర్లు సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం నుండి తప్పుకుని డాలర్ వైపు మళ్లుతారు. దీనివల్ల బంగారంపై డిమాండ్ తగ్గి ధరలు పడిపోతాయి.ట్రంప్ విధించిన ఆర్థిక ఆంక్షలను ధిక్కరించేందుకు ప్రపంచవ్యాప్తంగా కొన్ని దేశాలు ఒక కూటమిగా ఏర్పడి డాలర్‌ను కాదని బంగారాన్ని నిల్వ చేశాయి. కానీ రష్యా ఇప్పుడు తన వైఖరిని మార్చుకుని తిరిగి డాలర్ ఆధారిత ట్రేడింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వడం ప్రపంచ వాణిజ్య ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చివేసింది. ఇది ప్రపంచవ్యాప్తంగా బంగారం నిల్వలను మార్కెట్లోకి తెచ్చేలా ప్రేరేపిస్తోంది.ప్రస్తుతం హైదరాబాద్, చెన్నై వంటి ప్రధాన నగరాల్లో 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,15,000 వద్ద ట్రేడ్ అవుతోంది. కానీ నిపుణుల అంచనా ప్రకారం.. యుద్ధ వాతావరణం, రాజకీయ అస్థిరత తగ్గడం వల్ల బంగారంపై ఒత్తిడి తగ్గింది. అంతర్జాతీయంగా డాలర్ పుంజుకోవడం వల్ల భారత్‌లో పసిడి ధర లక్ష రూపాయల లోపుకు చేరుకోవడం ఖాయమని తెలుస్తోంది.బంగారం ధరలు తగ్గుతున్నప్పటికీ, కొనుగోలుదారులు ఒకేసారి భారీగా పెట్టుబడి పెట్టకుండా ధరలు పూర్తిగా స్థిరపడే వరకు వేచి చూడటం మంచిదని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. ఏది ఏమైనా, పెళ్లిళ్ల సీజన్ సమీపిస్తున్న వేళ ధరలు తగ్గుతుండటం భారతీయ కుటుంబాలకు పెద్ద ఊరటనిచ్చే విషయమే. రష్యా నిర్ణయం ప్రపంచవ్యాప్తంగా ఎలాంటి ఆర్థిక మార్పులకు దారితీస్తుందో రానున్న రోజుల్లో చూడాలి.గతేడాది బంగారం ధరలు ఏకంగా 70% మేర పెరిగి రికార్డు స్థాయి రూ. 1.80 లక్షలను తాకాయి. అయితే, అంతర్జాతీయంగా ఔన్సు బంగారం ధర ప్రస్తుతం ఉన్న 5,000 డాలర్ల నుండి 3,000 డాలర్లకు పడిపోతే, దేశీయ మార్కెట్‌లో 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ. 90,000 నుంచి రూ. 1,00,000 మధ్య స్థిరపడొచ్చని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# రాజోలులో రగులుతున్న జ్వాల

కాకినాడ ఫిబ్రవరి 18

అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రాజోలు అనగానే ఓ ప్రత్యేకత ఉంటుంది. జనసేన పార్టీ నుంచి వరుసగా రెండు సార్లు ఎమ్మెల్యే గెలిచిన నియోజకవర్గం అది. అదికూడా జనసేన పార్టీకి మొట్టమొదటి ఎమ్మెల్యేను గెలిపించి శుభారంభం ఇచ్చిన నియోజకవర్గం. ఈ నియోజకవర్గం అందుకే అంత ప్రత్యేకం. ఇదే విషయాన్ని ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కూడా చాలా సందర్భాల్లో ప్రస్తావించారు. రాజోలు ఒక



చిరుదివ్వె లాంటిదని కూడా ఆయన ఎంతో సంతృప్తిని వ్యక్తం చేశారు. అయితే ఈ నియోజకవర్గంలో మాత్రం జనసేన ఎమ్మెల్యే పనితీరుపై ఆ పార్టీలోనే అసంతృప్తి జ్వాలలు రేగుతోన్నాయా అన్న ప్రశ్నకు అవుననే సమాధానం ఆపార్టీ నాయకుల నుంచే వినిపిస్తోంది. ఇదిలా ఉంటే ఇదే నియోజకవర్గంలో టీడీపీ తన ఉనికిని కాపాడుకునేందుకు కూడా భారీ స్థాయిలో ప్రయత్నిస్తోంది. మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు కుమార్తె గొల్లపల్లి అమూల్యను టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్‌గా నియమించింది. దీంతో రాజోలులో టీడీపీలో కొత్త జోష్ నెలకొంది. కూటమి ప్రభుత్వంలో ఏ కార్యక్రమానికైనా టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులకు సమాచారం ఇవ్వాల్సిన పరిస్థితి ఉంటుంది. అయితే రాజోలు నియోజకవర్గంలో మాత్రం టీడీపీ ఇంచార్జ్‌గా ఉన్న అమూల్యకు చాలా ప్రభుత్వ కార్యక్రమాలకు అసలు సమాచారం ఇవ్వడం లేదన్నది ఆమె తన అనుచరుల వద్ద వాపోతున్నారట. ఇదే విషయాన్ని పార్టీ అధిష్టానానికి కూడా తెలిపినట్లు తెలుస్తోంది. నియోకవర్గాల్లో పలు నామినేటెడ్ పోస్టుల విషయంలోనూ కూడా కనీస సమాచారం ఇవ్వకుండా తనకు నచ్చిన వారినే నియమించుకుంటున్నారని, వారి పార్టీ వరకు పరవాలేదు కానీ టీడీపీ నుంచి నియమించిన వారి విషయంలో కూడా తన వ్యతిరేకులకు కట్టబెట్టి తనకు వ్యతిరేక వర్గాన్ని పెంచి పోషిస్తున్నారని అమూల్య వాదనగా తెలుస్తోంది. ఉదాహరణకు ఇటీవలే ఇచ్చిన అంతర్వేది ఆలయ కమిటీ ఛైర్మన్ విషయంలోనూ ఇదే జరిగిందన్నది అమూల్య వర్గీయుల వాదనగా వినిపిస్తోంది. అంతర్వేది లక్ష్మి నరసింహస్వామి ఆలయ కమిటీ ఛైర్మన్ పదవిని టీడీపీ నేతకే ఇచ్చామని ఎమ్మెల్యే దేవవరప్రసాదరావు చెబుతున్నా ఈ సమాచారం తనకు చెప్పలేదని, తాను ప్రతిపాదించిన పేరు వేరే నాయకుడిది కాగా వారికి అనుకూలమైన వారికే పదవి కట్టబెట్టారన్నది అమూల్య మాటగా చెబుతున్నారు ఆమె అనుచరులు. ఇదే కాకుండా నియోజకవర్గంలో నియమించిన పలు నామినేటెడ్ పోస్టుల్లో టీడీపీకి ఇవ్వాల్సిన పదవుల్లో కూడా తన జోక్యం లేకుండా చేస్తున్నారని, నియోజకవర్గంలో అసలు ఒక ఇంచార్జ్ ఉన్నారన్న విషయాన్ని కూడా ఎమ్మెల్యే పట్టించుకోవడంలేదని అమూల్య బాధపడుతున్నట్టు తెలుస్తోంది.ప్రస్తుత పరిస్థితుల్లో జనసేన పార్టీ ప్రాతినిధ్యం వహిస్తోన్న నియోజకవర్గాల్లో టీడీపీ అధిష్టానం కూడా జోక్యం చేసుకుంటున్న సందర్భాలు చాలా తక్కువనే చెబుతున్నారు విశ్లేషకులు. ఇదే విషయం రాజోలు నియోజకవర్గంలో కూడా వర్తిస్తుందంటున్నారు. అందులోనూ జనసేన అధినేతకు రాజోలు నియోజకవర్గం అంటే మరింత ప్రత్యేకం కాగా ఇక్కడ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తోన్న దేవ వరప్రసాదరావు మాజీ ఐఏఎస్ అధికారి కావడం, ఆయనకు అధినేతతో అత్యంత సాన్నిహిత్యం ఉండడం ఆయన మాటే వేదం అవుతుందంటున్నారు. ఈ పరిస్థితుల్లో అంతర్గతంగా జనసేన, టీడీపీ నేతల మధ్య అసంతృప్తి పరిస్థితులున్నా కూడా అవేమీ ఇరు పార్టీ నాయకత్వాలు పట్టించుకునే పరిస్థితి ఉండదని, లైట్ తీసుకుంటున్నాయంటున్నారు.ఇదిలా ఉంటే జనసేన పార్టీలోనే ఎమ్మెల్యేపై అసంతృప్తి జ్వాలలు కనిపిస్తున్నాయి. నియోజకవర్గంలో ఇప్పటికే రెండు వర్గాలుగా అంతర్గత యుద్ధాలే జరుగుతున్నాయి.. అవి ఎంతలా అంటే సోషల్ మీడియా వేదికగా కూడా ఒకరిపై మరొకరు దుమ్మెత్తిపోసుకునేంత స్థాయిలో అంతర్గత విభేధాలు భగ్గుమంటుండగా కొందరైతే బాహాటంగా ఎమ్మెల్యే పనితీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు. దీనికి తోడు ఇటీవల కాలంలో వైసీపీకకు చెందిన కొందరు జనసేన పార్టీలో దూరి ఎమ్మెల్యే అనుచరులుగా చక్రం తిప్పడం ముందు నుంచి పార్టీ జెండా మోసిన నాయకులు, కార్యకర్తలకు అసలు మింగుడు పడని అంశంగా మారింది. దీంతో ఎమ్మెల్యే తీరుపై కూడా కొందరు అధిష్టానానికి ఇప్పటికే ఫిర్యాదులు చేసినట్లు తెలుస్తోంది. జనసేన పార్టీలో అంతర్గత పోరు విషయం ఇలా ఉంటే ఇక టీడీపీలో కూడా రెండు వర్గాలుగా మాటల యుద్ధం సాగుతోంది. ఇంచార్జ్ అమూల్యపై బాహాటంగానే విమర్శలు గుప్పిస్తున్నారు ఆ పార్టీలోనే కొందరు నేతలు. అమూల్య ఒంటెద్దు పోకడలతో కొందరిని మాత్రమే వెంటేసుకుని వెళ్తున్నారని ఆరోపిస్తున్నారు. మొత్తం మీద రాజోలు నియోజకవర్గంలో అటు జనసేన, ఇటు టీడీపీలో అంతర్గత కోల్డ్ వార్ అయితే జరుగుతోందంటున్నారు.

# కొడాలి, వల్లభనేని విషయంలో కిం కర్తవ్యం

విజయవాడ, ఫిబ్రవరి 18,

రాజకీయాల్లో కొన్ని నియోజకవర్గాలది ప్రత్యేక స్థానం. ముఖ్యంగా ఉమ్మడి కృష్ణాజిల్లాలోని గుడివాడ, గన్నవరం నియోజకవర్గాలు ఎప్పుడు హాట్ గానే ఉంటాయి. దీనికి కారణం



అక్కడ వరుసగా కొడాలి నాని, వల్లభనేని వంశీ మోహన్ గెలుస్తూ రావడమే. ఇద్దరూ టిడిపి నుంచి తమ ప్రస్థానాన్ని ప్రారంభించిన వారి. అయితే ఉన్నఫలంగా వారిద్దరూ టిడిపి నాయకత్వంతో పాటు చంద్రబాబు తీవ్రంగా వ్యతిరేకించి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.. ఇద్దరూ ఫైర్ బ్రాండ్లే. చంద్రబాబుతో పాటు లోకేష్ పై వ్యక్తిగత విమర్శలు చేస్తూ రాష్ట్రంలోనే గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే ఇప్పుడు కూటమి అధికారంలోకి రావడంతో ఒకరు జైలుకు వెళ్లి అనారోగ్యానికి గురయ్యారు. మరొకరు వెళ్లకుండానే ఆరోగ్యపరమైన సమస్యలను ఎదుర్కొన్నారు. అయితే ఆ ఇద్దరూ యాక్టివ్ కాకపోవడంతో ఏం చేయాలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి పాలు పోవడం లేదు.కొడాలి నాని 2004 నుంచి 2019 వరకు వరుసగా నాలుగు సార్లు గుడివాడ నుంచి గెలిచారు. రెండుసార్లు టిడిపి నుంచి ప్రాతినిధ్యం వహించారు. మరో రెండు సార్లు వైసీపీ తరఫున గెలిచారు. జగన్మోహన్ రెడ్డి ఆయనకు మంత్రిగా అవకాశం ఇచ్చారు. అయితే వ్యక్తిగత దూకుడుతో వివాదాస్పద ముద్ర తెచ్చుకున్నారు కొడాలి నాని. 2024 ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత నియోజకవర్గానికి దూరమయ్యారు. అలా అనారోగ్యం బారిన పడ్డారు. అయితే ఇంతవరకు గుడివాడ నియోజకవర్గంలో యాక్టివ్ కాలేదు. అలాగని ప్రత్యామ్నాయ నేతను జగన్మోహన్ రెడ్డి నియమించలేదు. కొడాలి నాని విషయంలో వేరే ఆలోచన చేస్తే చెడ్డ పేరు రావడం ఖాయం. అందుకే కొడాలి నాని కోసం జగన్ సైతం ఎదురుచూస్తున్నట్లు అర్థమవుతోంది.మరోవైపు అనూహ్యంగా ఎమ్మెల్యేగా గెలిచారు వల్లభనేని వంశీ మోహన్. 2009 ఎన్నికల్లో విజయవాడ పార్లమెంట్ స్థానం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 2014లో మాత్రం గన్నవరం నుంచి పోటీ చేసి గెలిచారు అసెంబ్లీకి. ఐదేళ్లపాటు చంద్రబాబు నాయకత్వం పట్ల విధేయత గా ఉండేవారు. 2019లో రెండోసారి టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. కానీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించారు. అది మొదలు చంద్రబాబుతో పాటు లోకేష్ ను టార్గెట్ చేసుకున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కేసుల్లో చిక్కుకున్నారు. చాలా రోజులపాటు జైల్లో రిమాండ్ ఖైదీగా ఉండిపోయారు. ఈ క్రమంలో ఆయన అనారోగ్యానికి గురయ్యారు. ఇప్పటికీ వంశి నియోజకవర్గంలో యాక్టివ్ కాలేదు. అలాగని ప్రత్యామ్నాయ నేతకు ఇన్చార్జి బాధ్యతలు అప్పగించలేదు జగన్మోహన్ రెడ్డి.అయితే ఈ రెండు చోట్ల టిడిపి కూటమి పట్టు బిగిస్తోంది. రెండు చోట్ల టిడిపికి బలమైన ఎమ్మెల్యేలు ఉన్నారు. దూకుడు ప్రదర్శిస్తున్నారు. వీరి పనితీరు బాగున్నట్లు కూడా నివేదికలు వస్తున్నాయి. వచ్చే ఎన్నికల్లో మరోసారి వీరిద్దరే పోటీ చేయనున్నారు. అందుకే ఈ రెండు నియోజకవర్గాల విషయంలో జగన్మోహన్ రెడ్డి మల్ల గుల్లాలు పడుతున్నారు. వారిని తప్పిస్తే చెడ్డ పేరు వస్తుంది. అలాగని వారు యాక్టివ్ కావడం లేదు. ఈ విషయంలో ఏం చేయాలో జగన్మోహన్ రెడ్డికి పాలు పోవడం లేదని వైసీపీలో ప్రచారం నడుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో..

# 26న మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికలు

ఏలూరు, ఫిబ్రవరి 18

ఆంధ్రప్రదేశ్ లోని నెల్లూరు, ఏలూరు నగరపాలక సంస్థల్లో ఖాళీగా ఉన్న మేయర్, డిప్యూటీ మేయర్ పదవుల భర్తీకి ముహూర్తం ఖరారైంది. ఈ నెల 26వ తేదీన ఈ కీలక స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటించింది. ఈ మేరకు ఏపీ ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని ఈ మేరకు కీలక ఆదేశాలు జారీ చేశారు.ఎన్నికల నిర్వహణలో భాగంగా పారదర్శకతను పాటించాలని, సంబంధిత పాలకవర్గ సభ్యులకు, ఎక్స్ అఫీషియో సభ్యులకు ఈ నెల 20వ తేదీలోగా సమాచారం అందజేయాలని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ ప్రక్రియకు సంబంధించి నెల్లూరు, ఏలూరు జిల్లాల కలెక్టర్లకు, ఆయా నగరపాలక సంస్థల కమిషనర్లకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఇప్పటికే స్పష్టమైన మార్గదర్శకాలను పంపిందినిర్ణీత షెడ్యూల్ ప్రకారం, ఈ నెల 26వ తేదీ ఉదయం 11 గంటలకు కౌన్సిల్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఒకవేళ అనివార్య కారణాల వల్ల లేదా ఏవైనా ఇతర ఇబ్బందుల వల్ల ఆ రోజు సమావేశం నిర్వహించలేని పరిస్థితి తలెత్తితే, మరుసటి రోజు అంటే 27వ తేదీన తప్పనిసరిగా సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికలు నిర్వహించాలని ఆదేశాల్లో పేర్కొన్నారుఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల ఖరారుకు సంబంధించి ఒక కీలక నిర్ణయం తీసుకుంది. స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్ల అమలును సుసాధ్యం చేసేలా, బీసీల జనాభాపై లోతైన అధ్యయనం చేయడానికి ఒక డెడికేటెడ్ కమిషన్‌ను ప్రభుత్వం నియమించనుంది. దీనికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులు నేడు లేదా రేపు వెలువడే అవకాశం ఉంది. ఈ మేరకు ఏకసభ్య కమిషన్‌ను నియమించే ప్రతిపాదనకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పటికే ఆమోదముద్ర వేశారు.రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రాను ఈ డెడికేటెడ్ కమిషన్‌గా నియమించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. రిజర్వేషన్ల ఖరారుకు అవసరమైన అధ్యయనాన్ని పూర్తి చేయడానికి ప్రభుత్వం ఈ కమిషన్‌కు 30 నుంచి 45 రోజుల గడువును ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా బీసీల వెనుకబాటుతనాన్ని ఈ కమిషన్ క్షుణ్ణంగా పరిశీలించనుంది.

# వేగంగా కాశీబుగ్గ ఫ్లైఓవర్ పనులు

శ్రీకాకుళం, ఫిబ్రవరి 18

శ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గలో ఫ్లైఓవర్ నిర్మాణ పనులలో వేగం పెరిగింది. కాశీబుగ్గ పైవంతెన పనులను ఏప్రిల్ నెలకల్లా పూర్తిచేస్తామని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. మంగళవారం రోజున ఫ్లైఓవర్ నిర్మాణ పనులను రామ్మోహన్ నాయుడు పరిశీలించారు. అనంతరం పలాస ఆర్వోబీ పనులు, కేంద్రీయ విద్యాలయం పనుల పురోగతిని రామ్మోహన్ నాయుడు పరిశీలించారు. ఈ వివరాలను ఎక్స్ వేదికగా పంచుకున్నారు.ఏపీలో కొత్త ఫ్లైఓవర్ త్వరలోనే అందుబాటులోకి రానుంది. కాశీబుగ్గ ఫ్లైఓవర్ నిర్మాణాన్ని ఏప్రిల్ నాటికి పూర్తి చేస్తామని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. కాశీబుగ్గ ఫ్లైఓవర్ ఏప్రిల్ నాటికి పూర్తవుతాయని వెల్లడించారు. పలాస రైల్వే పైవంతెన, కేంద్రీయ విద్యాలయం పనులు జరుగుతున్న తీరును రామ్మోహన్ నాయుడు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి రామ్మోహన్ నాయుడు.. కాశీబుగ్గ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు ఏళ్లతరబడి సాగుతూ వచ్చాయన్నారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టి పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. కేంద్రీయ విద్యాలయంలోనూ వచ్చే ఏడాది నుంచి తాత్కాలికంగా తరగతులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు రామ్మోహన్ నాయుడు వెల్లడించారు.పలాస ప్రజల ఎన్నో ఏళ్ల కల అయిన పలాస ఆర్వోబీ ప్రాజెక్టు వేగంగా రూపుదిద్దుకోవడం ఆనందంగా ఉందని.. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే దీనికి అత్యున్నత ప్రాధాన్యం ఇచ్చామన్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పనులను కూడా తిరిగి ప్రారంభించామని.. భారతీయ రైల్వే, జిల్లా యంత్రాంగం సమన్వయంతో నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని రామ్మోహన్ నాయుడు వివరించారు. ప్రజలకు త్వరగా అందుబాటులోకి రావడానికి పనులను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. పలసా ఆర్వోబీ నిర్మాణం పూర్తి అయితే పలాస పట్టణంలో ట్రాఫిక్ రద్దీ తగ్గి ప్రయాణికులకు సౌకర్యవంతమైన రాకపోకలకు వీలు కలుగుతుందని వివరించారు. పలాసలో ఏర్పాటు చేయనున్న కేంద్రీయ విద్యాలయం ద్వారా సాయుధ దళాల సిబ్బంది, కేంద్ర సంస్థల ఉద్యోగుల పిల్లలకు నాణ్యమైన విద్యా అవకాశాలు లభిస్తాయని వివరించారు.మరోవైపు కాశీబుగ్గ లెవల్ క్రాసింగ్ గేటు వద్ద ట్రాఫిక్ సమస్యలు ఎప్పటి నుంచో వేధిస్తున్నాయి. ప్రతి పది అరగంటకూ గేట్లు పడుతూ ఉండటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. దీంతో ఇక్కడ ఫ్లైఓవర్ నిర్మించాలని నిర్ణయించారు. 2009లో ఫ్లైఓవర్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. అయితే వివిధ కారణాలతో నిర్మాణ పనులకు అంతరాయం కలుగుతూ వచ్చింది. భూసేకరణ, నిర్వాసితులకు పరిహారం వంటి అంశాల కారణంగా నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. ఈ పరిస్థితులలో టీడీపీ కూటమి సర్కారు ప్రత్యేక దృష్టి సారించడంతో నిర్మాణ పనులలో వేగం పెరిగింది. తాజాగా ఏప్రిల్ నాటికి పూర్తి చేస్తామని మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రకటించారు

# నెయ్యి టెండర్లలలో కొత్త పద్ధతికి శ్రీకారం

తిరుమల, ఫిబ్రవరి 18,

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో వినియోగించే ఆవు నెయ్యి కొనుగోలు ప్రక్రియలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. లడ్డూ నాణ్యత, స్వచ్ఛత విషయంలో భక్తుల నమ్మకాన్ని నిలబెట్టేలా, పారదర్శకతకు పెద్దపీట వేస్తూ కొత్త విధానాన్ని అమలులోకి తెచ్చింది. చైర్మన్ బీఆర్ నాయుడు నేతృత్వంలోని నూతన టీటీడీ బోర్డు ఈ మేరకు కీలక నిర్ణయాలు తీసుకుంది.గతంలో, అంటే 2024కు ముందు, శ్రీవారి లడ్డూ ప్రసాదం నాణ్యత, రుచిపై భక్తుల నుంచి కొన్ని విమర్శలు, అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో స్పందించిన టీటీడీ, నెయ్యి కొనుగోలు విధానాన్ని సమూలంగా మార్చాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా పలు కఠిన నిబంధనలను ప్రవేశపెట్టింది. నెయ్యి నాణ్యత రవాణా సమయంలో దెబ్బతినకుండా ఉండేందుకు, సేకరణ భౌగోళిక పరిధిని గతంలో ఉన్న 1500 కిలోమీటర్ల నుంచి 800 కిలోమీటర్లకు తగ్గించారు. నెయ్యిని సరఫరా చేసే ట్యాంకర్లకు తప్పనిసరిగా జీపీఎస్ లాక్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసి, రవాణాను నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు తీసుకున్నారు.నాణ్యత పరీక్షల విషయంలోనూ రాజీపడకుండా కఠిన ప్రమాణాలను నిర్దేశించారు. డైరీల తయారీ సామర్థ్యాన్ని అంచనా వేయడానికి ఓఖీఓ స్కోర్ బోర్డ్ విధానాన్ని, ఈూఖీ 2.1.8 నిబంధనలతో పాటు మిల్క్ ఫ్యాట్ ప్యూరిటీ పరీక్షలు (ఎూ 17678:2019), సెన్సరీ పారామిటర్స్ (ఎూ అనీటవ: 7770:1975) వంటివి తప్పనిసరి చేశారు.

ఈ సంస్కరణల్లో భాగంగా, 2024-25 సంవత్సరానికి గాను గుత్తాధిపత్యానికి తావివ్వకుండా మొత్తం 65 లక్షల కిలోల నెయ్యి సేకరణకు 7 విడతలుగా టెండర్లను నిర్వహించారు.

ఈ పారదర్శక ప్రక్రియలో 7 ప్రముఖ డైరీ సంస్థలు పాల్గొనగా, వాటికి దక్కిన టెండర్ల వివరాలు ఇలా ఉన్నాయి:


1. నందిని (ఐఓఈ) - 4 టెండర్లు దక్కించుకుంది
2. మదర్ డైరీ - 2 టెండర్లు దక్కించుకుంది
3. ఇందాపూర్ డైరీ - 2 టెండర్లు దక్కించుకుంది
4. సంగం డైరీ - 1 టెండర్ దక్కించుకుంది
5. ప్రీమియర్ అగ్రి డైరీ - టెండర్ దక్కించుకోలేదు
6. కొల్హాపూర్ డైరీ (గోకుల్) - టెండర్ దక్కించుకోలేదు
7. గోవింద్ మిల్క్ - టెండర్ దక్కించుకోలేదుఈ మార్పుల ద్వారా భక్తులకు అత్యంత స్వచ్ఛమైన, నాణ్యమైన లడ్డూ ప్రసాదాన్ని అందించడమే తమ ప్రథమ కర్తవ్యమని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ద్వారా ఓ అధికారిక పత్రికా ప్రకటనను విడుదల చేశారు.



# ఏపీలో మరో 9 ఎయిర్ పోర్టులు

అమరావతి, ఫిబ్రవరి 18, (న్యూస్ పల్స్)

ఏపీ ప్రజలకు శుభవార్త. రాష్ట్రంలో మరిన్ని జిల్లాలకు విమాన కనెక్టివిటీ భవిష్యత్తులో ఏర్పడనుంది. దీని వల్ల రాష్ట్రంలోని ఏ మూలకైనా సులువుగా చేసుకోవచ్చు. అలాగే సరుకు రావాణా కూడా వేగంగా జరుగుతుంది. ఈ మేరకు తొమ్మిది ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది.ఏపీలోని కూటమి సర్కార్ ప్రజా రవాణా, సరకు రవాణాను రాష్ట్రంలో మెరుగుపర్చేందుకు ప్రయత్నిస్తోంది. ప్రయాణాన్ని వేగవంతం చేయడం, సరుకు రవాణాలో వేగం పెంచేందుకు



ప్రణాళికలు రచిస్తోంది. అందులో భాగంగా రాష్ట్రంలో కొత్త ఎయిర్‌పోర్ట్‌ల నిర్మాణానికి శ్రీకారం చుడుతోంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఆరు ఎయిర్‌పోర్ట్‌లు ఉండగా.. ఈ ఏడాదిలో మరో ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వస్తుంది. దీంతో మొత్తం ఏడు ఎయిర్‌పోర్ట్‌లు ఉండనున్నాయి. అయితే రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలకు విమాన కనెక్టివిటీని తెచ్చేందుకు మరో 9 ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి కేంద్ర సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేసింది. ఈ మేరకు ప్లాన్లు రూపొందిస్తోంది. ఇందుకోసం రూ.6,417 కోట్లతో ప్రతిపాదనలను సిద్ధం చేసింది.ఏపీలో మరో 9 కొత్త ఎయిర్‌పోర్ట్‌లకు ప్రణాళికలు రూపొందించారు. వీటి కోసం రూ.6,417 కోట్ల ఖర్చు అవుతుందని అంచనా వేశారు. కేంద్ర ప్రభుత్వంతో భాగస్వామ్యమై వీటిని నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించారు. ప్రస్తుతం విశాఖపట్నం, విజయవాడ, రాజమండ్రి, తిరుపతి, కర్నూలు, కడపలో విమానాశ్రయాలు అందుబాటులో ఉండగా.. మరికొద్ది నెలల్లో భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభించనున్నారు. రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో వీటిని నిర్మించేందుకు ప్లాన్ రూపొందించింది. ఇవి అందుబాటులోకి వస్తే రాష్ట్రంలోని ఎక్కడినుంచి ఎక్కడికైనా వెంటనే చేసుకోవచ్చు. దీని వల్ల సరుకు రవాణా పెరిగే స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

ఎక్కడెక్కడంటే..?

-నెల్లూరు జిల్లా దగదర్తి దగ్గర ఎయిర్‌పోర్ట్ నిర్మించనున్నారు. ఇందుకోసం రూ.916 కోట్లు అవసరమవుతుందని అంచనా వేశారు. ఇప్పటికే భూసేకరణ పనులు కూడా మొదలయ్యాయి. త్వరలోనే టెండర్లను పిలిచి పనులు ప్రారంభించనున్నారు.

-చిత్తూరు జిల్లా కుప్పంలో ఎయిర్‌పోర్ట్ కోసం 444 ఎకరాల భూమిని సేకరించనున్నాయి. ఈ విమానాశ్రయం నిర్మాణానికి రూ.1,142 కోట్లు అవసరమవుతాయని-రాజధాని అమరావతి, శ్రీకాకుళంలో ఎయిర్‌పోర్ట్‌ల నిర్మాణానికి ప్లాన్ వేశారు. అమరావతి ఎయిర్‌పోర్ట్‌కు రూ.వెయ్యి కోట్లు, శ్రీకాకుళంలో విమానాశ్రయ నిర్మాణానికి రూ.650 కోట్ల వ్యయం అవ్వనుంది.

-కాకినాడ జిల్లా తుని-అన్నవరం మధ్య, పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లి గూడెం, పల్నాడు జిల్లాలోని నాగార్జున సాగర్, ప్రకాశం జిల్లా ఒంగోలు, అనంతపురం జిల్లాల్లో ఎయిర్‌పోర్టుల నిర్మాణం కోసం డీపీఆర్ రెడీ చేస్తున్నారు.

కొత్త పరిశ్రమలు వచ్చే అవకాశం

ఎయిర్‌పోర్టులు అందుబాటులోకి వస్తే స్థానికంగా కొత్త పరిశ్రమలు ఏర్పాటు అవుతాయి. దీంతో వల్ల చెన్నై, బెంగళూరుకు ఇక్కడ నుంచి వేగంగా సరుకు రవాణా జరుగుతుంది. దీని వల్ల లాజిస్టిక్స్ బిజినెస్ పెరుగుతోంది. కొత్త ఉద్యోగులు కూడా దీని ద్వారా ఏర్పడతాయి. స్థానిక యువతకు దీని వల్ల లాభం జరుగుతుందని ప్రభుత్వం చెబుతోంది.

# సివిల్ సర్వెంట్స్... ఖద్దరు చొక్కా బాగ్యం లేదా

హైదరాబాద్, ఫిబ్రవరి 18, (

సివిల్ సర్వీసెస్.. దేశంలోనే అత్యున్నత స్థాయి బాధ్యత. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా వీరు వ్యవస్థను శాసిస్తారు, ఫైళ్ల మీద సంతకాలతో వేలమంది జీవితాలను మారుస్తారు. కానీ, అదే అధికారులు ఖాకీ లేదా తెల్ల చొక్కా వదిలేసి ఖద్దరు చొక్కా కట్టుకోగానే సీన్ రివర్స్ అవుతోంది. తాజాగా మాజీ ఐపీఎస్ అధికారి వీవీ లక్ష్మినారాయణ ప్రత్యక్ష రాజకీయాలకు స్వస్తి పలికి, ప్రైవేటు సంస్థలో చేరడం తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశమైంది. అటు జయప్రకాశ్ నారాయణ నుంచి ఇటు లక్ష్మినారాయణ వరకు.. వీరి ప్రయాణాలు ఒకే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. సిస్టమ్‌ను బయట ఉండి మార్చడం వేరు, సిస్టమ్‌లో భాగంగా మారి రాజకీయ రొంపిలో నెగ్గుకురావడం వేరు అని రుజువు చేస్తున్నాయి.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఒక వెలుగు వెలిగిన ఐఏఎస్ అధికారి డాక్టర్ జయప్రకాశ్ నారాయణ. 'లోక్ సత్తా' అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా పాలనా సంస్కరణల కోసం పోరాడి, ఆ తర్వాత దానిని రాజకీయ పార్టీగా మార్చారు. జేపీ రాజకీయాల్లో 'నైతికత' గురించి మాట్లాడారు. కానీ భారతీయ ఓటరు నాడి కేవలం సిద్ధాంతాల మీద మాత్రమే పనిచేయదు. కుల, మత సమీకరణలు, ధన ప్రభావం ఉన్న రాజకీయ క్షేత్రంలో జేపీ మేధోమథనం సామాన్య ఓటరుకు చేరువ కాలేకపోయింది. కూకట్‌పల్లి నుంచి ఎమ్మెల్యేగా గెలిచినప్పటికీ, అసెంబ్లీలో ఆయన ఒంటరి అయ్యారు. చివరకు రాజకీయాల్లో తన గళం వినిపించే అవకాశం లేదని గ్రహించి, ప్రస్తుతం ఆయన కేవలం సామాజిక విశ్లేషకుడిగానే మిగిలిపోయారు.సీబీఐ మాజీ జేడీగా లక్ష్మినారాయణ పేరు చెబితే అవినీతిపరుల వెన్నులో వణుకు పుట్టేది. ఆ క్రేజ్‌తోనే ఆయన రాజకీయాల్లోకి వచ్చారు. 2019 ఎన్నికల్లో విశాఖ నుంచి ఎంపీగా పోటీ చేసి ఓడిపోయినప్పటికీ, గణనీయమైన ఓట్లు సాధించారు. కానీ అక్కడితోనే ఆయన గ్రాఫ్ ఆగిపోయింది. ముందుగా జనసేనలో చేరడం, ఆ తర్వాత రాజీనామా చేయడం, మళ్ళీ సొంతంగా జై భారత్ నేషనల్ పార్టీ పెట్టడం.. లాంటివన్నీ ప్రజల్లో అయోమయాన్ని సృష్టించాయి. పోలీసు అధికారిగా కఠినంగా ఉండటం అలవాటైన లక్ష్మినారాయణకు, రాజకీయాల్లో ఉండే అనునిత్యం రాజీపడే తత్వం సెట్ కాలేదు. రాజకీయాల్లో మార్పు తీసుకురావడం కంటే, ప్రైవేటు రంగంలో సేవ చేయడం ఉత్తమమని భావించి ఆయన 'ఈవీ ట్రాన్స్' సంస్థలో బాధ్యతలు చేపట్టారు. ఇది ఆయన రాజకీయ ప్రస్థానానికి దాదాపు ముగింపు పలికినట్టే అని విశ్లేషకులు భావిస్తున్నారు.రాజకీయాల్లోకి వచ్చే ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల వైఫల్యానికి ఎన్నో కారణాలున్నాయి. అధికారులుగా ఉన్నప్పుడు వారి మాట శాసనం. అందరూ వారి కింద పని చేస్తారు. కానీ రాజకీయాల్లో 'ప్రజల వద్దకు వెళ్లి అడుక్కోవాలి'. ఈ మనస్తత్వ మార్పు అందరికీ సాధ్యం కాదు. సివిల్ సర్వెంట్లు ప్రతిదీ చట్టబద్ధంగా, సిద్ధాంతపరంగా ఉండాలని కోరుకుంటారు. కానీ రాజకీయం అనేది 'గెలుపే లక్ష్యం'గా సాగే చదరంగం. ఇక్కడ ఎథిక్స్ కంటే స్ట్రాటజీలకే ప్రాధాన్యత ఎక్కువ. రాజకీయ పార్టీ నడపాలంటే క్షేత్రస్థాయిలో కార్యకర్తలు ఉండాలి. అధికారులు కేవలం మీడియాలో కనిపించి ఓట్లు రాబట్టలేరు. జేపీ, జేడీ ఇద్దరూ ఈ విషయంలోనే వెనుకబడ్డారు.సివిల్ సర్వెంట్లు రాజకీయాల్లోకి రావడం ప్రజాస్వామ్యానికి మంచిదే అయినా, క్షేత్రస్థాయి వాస్తవాలను గ్రహించకపోతే పరాజయం తప్పదని ఈ ఇద్దరి ఉదాహరణలు నిరూపిస్తున్నాయి. జేపీ మేధస్సు, జేడీ నిజాయితీ రాజకీయ వ్యవస్థకు అవసరమే, కానీ ఆ వ్యవస్థలో ఇమడలేక వారు వెనక్కి వెళ్లడం దురదృష్టకరం. వ్యవస్థను మార్చాలనే తపనతో వచ్చి, చివరకు వ్యవస్థ గాలికి కొట్టుకుపోవడం లేదా పక్కకు తప్పుకోవడం ఒక చేదు నిజం.

# రెండో వారంలో ఐదు రాష్ట్రాల ఎన్నికలు నోటిఫికేషన్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18,

ఈ ఏడాదిలో జరగబోయే ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలపై ఈసీ కసరత్తు ప్రారంభించింది. బెంగాల్, తమిళనాడు, కేరళ, అసోం, పుదుచ్చేరీల్లో ఇప్పటికే ఓటర్ల జాబితా ప్రక్షాళన చేపట్టింది. ఈ ప్రక్రియ తుది అంకానికి చేరుకుంది. ఎస్ఐఆర్‌పై ఓ పక్క విపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయి. దీంతో ఎన్నికల తేదీలను మార్చి రెండో వారంలో ప్రకటించి, చివరి వారంలో నోటిఫికేషన్ విడుదల చేస్తుందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈసీ అధికారులు.. ఐదు రాష్ట్రాల్లో ఎన్నికల ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు.పశ్చిమ బెంగాల్, తమిళనాడు సహా ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కీలక అప్డేట్ వచ్చింది. వచ్చే ఏప్రిల్‌లో బెంగాల్, తమిళనాడు శాసనసభకు ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉన్నట్లు కేంద్ర ఎన్నికల కమిషన్ వర్గాలు తెలిపాయి. వీటితో పాటు కేరళ, అసోం, పుదుచ్చేరి అసెంబ్లీలకు పోలింగ్ జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు మార్చి రెండో వారంలో షెడ్యూల్‌ను ఈసీ విడుదల చేసే అవకాశం ఉన్నట్లు తెలిపాయి. ఇక, ఈ రాష్ట్రాల్లో ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించేందుకు ఇప్పటికే ఈసీ అధికారులు పర్యటనలు ప్రారంభించారు. ప్రస్తుతం ఈసీ బృందం అసోంలో పర్యటిస్తుంది.తమిళనాడు, కేరళ, పశ్చిమ్ బెంగాల్ అసెంబ్లీలకు మే నెలలోనూ.. పుదుచ్చేరి శాసనసభకు జూన్ 15తో గడువు ముగియనుంది. ఇక, ఎన్నికల జరగనున్న రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ చివర దశకు చేరుకుంది. ఫిబ్రవరి 10 అసోం, ఫిబ్రవరి 14న పుదుచ్చేరిలో ఓటర్ల జాబితా ప్రచురించిన సంగతి తెలిసిందే. తమిళనాడులో మంగళవారం తుది ఓటర్ల జాబితా విడుదల చేయనున్నారు. ఫిబ్రవరి 21న కేరళ, 28న పశ్చిమ బెంగాల్లో తుది జాబితాలు విడుదలవుతాయి. కానీ, ఎస్ఐఆర్‌పై తమిళనాడు, బెంగాల్‌లో రగడ కొనసాగుతోంది.తమిళనాడులో డిసెంబరు 19న విడుదల చేసిన ముసాయిదాలో 97 లక్షల మంది పేర్లను తొలగించారు. బెంగాల్‌లోనూ 58 లక్షల మంది పేర్లు డిలీట్ చేశారు. ఇప్పటికే దీనిపై తమిళనాడు, బెంగాల్ ముఖ్యమంత్రులు ఎంకే స్టాలిన్, మమతా బెనర్జీలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై దీదీ యుద్ధం ప్రకటించారు. సుప్రీంకోర్టులోనూ పిటిషన్ దాఖలు చేసి, స్వయంగా మమతా బెనర్జీ వాదనలు వినిపించడం గమనార్హం.బెంగాల్‌లో వరుసగా మూడుసార్లు అధికారం చేపట్టిన మమతా బెనర్జీ.. నాలుగోసారి హ్యాట్రిక్ కొట్టేందుకు సిద్ధమయ్యారు. అటు, బీజేపీ సైతం అధికారం కోసం విశ్వప్రయత్నాలు చేస్తోంది. గత ఎన్నికల్లో తామే అధికారంలోకి వస్తామని భారీ అంచనాలు పెట్టుకుంది. ఎగ్జిట్ పోల్స్‌లో ఆ పార్టీకే అనుకూలమని వచ్చినా.. ఫలితాలు మాత్రం కమలానికి షాకిచ్చాయి. 2011, 2016కు మించి భారీ మెజార్టీతో మమతా బెనర్జీ గెలిచారు. ఈసారి ఏ అవకాశం వదులుకోరాదని కమలనాథులు గట్టిగానే కృషిచేస్తునా

# శ్రీలక్ష్మి..కథ ఇంకా ఉంది

విజయవాడ, ఫిబ్రవరి 18,

సీనియర్ ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హోదాలో ఉండాల్సిన ఆమె చేజేతులా తన కెరీర్ ను నాశనం చేసుకున్నారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి అక్రమస్తులు , గాలి జనార్దన్ రెడ్డికి సంబంధించిన ఓబులాపురం మైనింగ్ కేసుల్లో చిక్కుకున్నారు. తాజాగా సుప్రీంకోర్టులో ఆమెకు భారీ షాక్ తగిలింది. ఆ రెండు కేసుల నుంచి తన పేరును తొలగించాలని ఆమె దాఖలు చేసిన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టి వేసింది. ఇప్పటికే తెలంగాణ హైకోర్టులో ఈ పిటిషన్లు దాఖలు చేయగా తిరస్కరణకు గురయ్యాయి. ఇప్పుడు సుప్రీంకోర్టులో సైతం అదే పరిస్థితి ఎదురు కావడంతో.. ఆమెకు జైలు శిక్ష తప్పదు అని ప్రచారం నడుస్తోంది.ఓబులాపురం మైనింగ్ తో పాటు జగన్ అక్రమాస్తుల కేసుల్లో చిక్కుకున్నారు శ్రీలక్ష్మి. అయితే కేవలం ప్రభుత్వ ఆదేశాల ప్రకారమే అప్పట్లో తాను విధులు నిర్వహించానని.. ఇందులో ఎటువంటి వ్యక్తి గత ప్రయోజనం లేదని ఆమె పేర్కొన్నారు. అయితే సిబిఐ తరపు న్యాయవాదులు గట్టి వాదనలు వినిపించారు. అప్పట్లో ఓబులాపురం మైనింగ్ లీజుల కేటాయింపులో.. క్విడ్ ప్రోకో వ్యవహారాల్లో శ్రీలక్ష్మి కీలక పాత్ర పోషించారని కోర్టుకు వివరించారు. ఇరుపక్షాల వాదనలు విన్న అత్యున్నత న్యాయస్థానం.. కేసు ఈ దశలో ఉన్నప్పుడు ఆమె పేరు తొలగింపు అసాధ్యమని తేల్చి చెప్పింది. సిబిఐ చూపిన అభియోగాలకు సంబంధించి ప్రాథమిక ఆధారాలు ఉన్నందున. ట్రయల్ కోర్టులో



విచారణ ఎదుర్కోవాల్సిందేనని తేల్చి చెప్పింది. దీంతో ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మికి చిక్కులు తప్పేలా లేవు.ఓబులాపురం మైనింగ్ కేసుకు సంబంధించి సిబిఐ ప్రత్యేక కోర్టులో విచారణ కొనసాగింది. ఇప్పటికే ఈ కేసులో నిందితులందరికీ జైలు శిక్ష ఖరారు అయ్యింది. ఒక్క శ్రీ లక్ష్మి గతంలో హైకోర్టు నుంచి డిశ్చార్జ్ ఉత్తర్వులు తెచ్చుకున్నందున ఆమెపై విచారణ జరగలేదు. అయితే తాజాగా ఆమె సుప్రీంకోర్టులో పిటిషన్ ను కొట్టివేయడంతో ఆమెకు సైతం శిక్ష తప్పదని ప్రచారం నడుస్తోంది. వాస్తవానికి చాలా రోజులపాటు ఆమె రిమాండ్ ఖైదీగా ఉండిపోయారు. జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక తెలంగాణ నుంచి ఏపీకి వచ్చారు. ఆమెకు అప్పట్లో జగన్ సర్కార్ ప్రాధాన్యమిచ్చింది. టిడిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత మాత్రం ఆమెకు పోస్టింగ్ దక్కలేదు

# రెండుగా పాకిస్తాన్

లాహోరం, ఫిబ్రవరి 18,ఛ

మన పొరుగు దేశం పాకిస్తాన్ మళ్లీ రెండు ముక్కలు కాబోతోందా అంటే అవుననే అంటున్నారు పరిశీలకులు. దశాబ్దాలుగా పాకిస్తాన్ నుంచి విభజన పోరాటం చేస్తున్న బలూచిస్తాన్.. పాకిస్తాన్ నుంచి విడిపోవడం దాదాపు ఖాయం అయినట్లు తెలుస్తోంది. ఇటీవల పాకిస్తాన్ మంత్రి చట్టసభలో మనము.. వాళ్లు అని చెప్పడం 1971 బంగ్లాదేశ్ విడిపోయినప్పుడు వాడిన పదాలను గుర్తు చేస్తోంది. ఈ పరిణామాలు బలూచ్ స్వాతంత్ర్య ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తున్నాయి.బలూచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) 1 నిమిషం 10 సెకన్ల వీడియోలో పాకిస్తాన్ సైనికులు జీమిల్, షమ్షుబ్రేజ్‌లను చూపించింది. వీరిని 7 రోజుల్లో విడుదల చేయకపోతే చంపేస్తామని హెచ్చరించారు. 5 వేల అత్యాధునిక డ్రోన్లతో ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్‌పై దాడులు చేస్తున్నారు. ఇప్పటివరకు 1,184 మంది పాక్ సైనికులు మరణించారు.బలూచిస్తాన్ సీఎం అక్తర్ మెంగల్ 15 రోజుల క్రితం రాజీనామా చేసి, 'ఇక పాకిస్తాన్‌లో ఉండదు' అని ప్రకటించారు. 1947లో ఖాన్ ఆఫ్ కలాట్‌తో ఒప్పందం ఉల్లంఘించి, 1950లో బలూచిస్తాన్‌ను బలవంతంగా కలిపారు. 1958లో నవాబ్ నవరోజ్ ఖాన్ తిరుగుబాటు చేసి అరెస్టు చేయబడ్డాడు. 2006లో నవాబ్ అక్బర్ బుగ్తి హత్యకు దారి తీసింది. ఇలా పాకిస్తాన్ బలూచిస్తాన్‌ను మోసం చేసింది. దీంతో బలూచ్ ప్రజలు పాకిస్తాన్‌ను విశ్వసించడం లేదు.

2002లో చైనా?పాక్ ఆర్థిక మార్గం (సీపీఈసీ) ప్రకటించడం బలూచ్‌లలో కోపాన్ని మేల్కొలిపింది. ఇప్పుడు బీఎల్ఏ ఆపరేషన్ హెరాఫ్ 2.0లో భారత సరిహద్దు యాంటీ?డ్రోన్ టెక్నాలజీతో దాడి చేస్తోంది. భవిష్యత్‌లో పాకిస్తాన్‌కు తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉంది.బలూచ్ నాయకులు 'పాకిస్తాన్ ఆక్రమణ' అని పిలుస్తున్నారు. మెంగల్ 'ప్రభుత్వ అధికారం ఏ ఇంచ్ లేకుండా పోయింది' అన్నారు. ఈ ఘటనలు 1971 బంగ్లాదేశ్ సారాంశాన్ని పునరావృతం చేస్తూ, పాక్‌కు కీలక సవాలుగా మారాయి.

# అపహాస్యం చేసిన పార్టీలు.. అనైతిక పొత్తులు

హైదరాబాద్, ఫిబ్రవరి 18, (

రాజకీయాలు అంటేనే కంపు, మురికి కూపం అన్నట్లుగా పరిస్థితులు మారిపోయాయి. ఒకప్పుడు పార్టీలకు సిద్ధాంతాలు ఉండేవి. నేలు, కార్యకర్తలు విలువలకు కట్టుబడి పనిచేసేవారు. కానీ ప్రస్తుత ధనస్వామ్యంలో అధికారమే పరమావధిగా మారింది. పార్టీలు నిరుద్యోగుల ఆశ్రయ కేంద్రాలుగా మారాయి. దీంతో పదవులు దక్కించుకోవడానికి ఇష్టానుసారం పార్టీలు మారుతున్నారు. ఇక పార్టీలు కూడా సిద్ధాంతాలకు తిలోదకాలు ఇచ్చి.. పొత్తులు పెట్టుకుంటున్నాయి. తాజాగా తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో పార్టీల వ్యవహారం చూస్తే.. ఊసరవెల్లి కూడా సిగ్గుపడుతుంది. అధికారం కోసం బీఆర్ఎస్?బీజేపీ, కాంగ్రెస్?ఎంఐఎం, బీజేపీ?కాంగ్రెస్, బీఆర్ఎస్?కాంగ్రెస్?ఎంఐఎం, బీఆర్ఎస్?సీపీఐ, కాంగ్రెస్ ? సీపీఐ ఇలా ఇష్టానుసారంగా పొత్తులు పెట్టుకున్నాయి. ప్రజల తీర్పును అపహాస్యం చేశాయి.ఎన్నికల తర్వాత అనేక మున్సిపాలిటీల్లో ప్రత్యర్థి పార్టీలు కలిసి మేయర్, ఛైర్మన్ పదవుల కోసం పొత్తుల రాజకీయాలకు తెరతీశాయి. కాంగ్రెస్?బీఆర్ఎస్, బీఆర్ఎస్?బీజేపీ కలయికలు, కొన్ని చోట్ల మూడు పార్టీల కూటమి కూడా కనిపించాయి. ఇలాంటి దగ్గరి ఒప్పందాలు పార్టీ కార్యకర్తల్లో కూడా విభేదాలు సృష్టించాయి.ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనది. ఈమేరకు తెలంగాణ పట్టణ ఓటర్లు ఎన్నికల్లో స్పష్టమైన మెజారిటీ ఇచ్చారు. కానీ, మ్యాజిక్ ఫిగర్ రాలేదన్న భావనతో అక్రమ పొత్తులకు తెరతీశాయి. పీఠం దక్కించుకోవడమే లక్ష్యంగా ప్రజల తీర్పును అగౌరవపరుస్తూ అధికారం చేజిక్కించుకుంటున్నాయి.అక్రమంగా పొత్తులు పెట్టుకున్నాక ఇక ఎన్నికలు ఎందుకు.. ప్రజాస్వామ్యానికి విలువ ఎక్కడ ఉంటుంది. ప్రత్యక్ష స్థానిక సంస్థల అధిపతులకు ప్రత్యక్ష ఎన్నికలే ఉండాలి. సర్పంచులు, మున్సిపల్ ఛైర్మన్లు, మేయర్లు, మండల పరిషత్ అధ్యక్షులు, జిల్లాపరిషత్ అధ్యక్షుల వరకు ప్రత్యక్ష ఎన్నికలే జరగాలి. అప్పుడే ప్రజాస్వామ్యానికి విలువ ఉంటుంది. లేదంటే పరిస్థితి ఇంతకన్నా దారుణంగా మారుతుంది. భవిష్యత్ అంధకారం అవుతుంది. దీనిని ఎలా సరిదిద్దాలి అనేది ఆలోచించుకోవాలి. సరిదిద్దే మార్గాలు అన్వేషించాలి. ప్రజాస్వామ్యాన్ని తిరిగి గాడిన పెట్టే బాధ్యత ఓటర్లపైనే ఉంది. 75 ఏళ్ల చరిత్రలే అసాధ్యం అనుకున్నవి సుసాధ్యం అయ్యాయి. చిత్తశుద్ధితో పనిచేస్తే ప్రజాస్వామ్యం నిలబడుతుంది.పాలనా సంస్కరణలు తీసుకురావాలని చాలా మంది ప్రజాస్వామికవాదులు కోరుకుంటున్నారు. ముఖ్యమంత్రి, ప్రధాన మంత్రి పదవికి కూడా ప్రత్యక్ష ఎన్నికలు జరగాలని డిమాండ్ చేస్తున్నారు. అవి ఇప్పట్లో జరగకపోవచ్చు. కానీ స్థానిక సంస్థలు ప్రజాస్వామ్యానికి పట్టుకొమ్మలు. అందుకే స్థానిక సంస్థల్లో ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించాలి. పార్టీ సిద్ధాంతాలు లేవన్న విషయం తాజా మున్సిపల్ ఎన్నికల పొత్తుల ద్వారా అర్థమైంది..కరెక్ట్ ఎన్నికలు జరిగితే ఈ ధనస్వామ్య సిస్టం మారుతుంది. ఎక్స్ అఫీషియోలకు ఓటు ఎందుకు. స్థానిక సంస్థల్లో రోల్ ఉండడం తప్పు కాదు. కానీ ఓటు ఎందుకు అన్నది సమాధానం లేని ప్రశ్న. నేరుగా ఎన్నికలు నిర్వహించేలా రాజ్యాంగ సవరణ చేయాలి.మొత్తంగా మున్సిపల్ ఎన్నికల్లో అన్ని పార్టీలు కలిసి ప్రజా తీర్పును అపహాస్యం చేశాయి. అధికారం కోసం అడ్డదారులు తొక్కాయి. స్థానిక సంస్థల్లో బలంగా ఉంటే భవిష్యత్‌లో మళ్లీ గెలుస్తామన్న నమ్మకంతో పార్టీలు ఓటరు తీర్పును తుంగలో తొక్కేశారు.

# బెజవాడ కార్పొరేషన్ పై ఆశకిరణ్ గురి

విజయవాడ, ఫిబ్రవరి 18

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వంగవీటి కుటుంబానికి కాస్త ప్రత్యేక స్థానం ఉంటుంది. దివంగత వంగవీటి రంగా రాజకీయ వారసత్వం పై ఎప్పుడు ఏదో ఒక చర్చ మనం చూస్తూనే ఉంటాం. వంగవీటి రంగా కుమారుడు వంగవీటి రాధా రాజకీయాల్లో ఉన్నప్పటికీ, ఆయన పెద్దగా యాక్టివ్ గా లేరు.. అనే ఆవేదన రంగ అభిమానుల్లో కనపడుతూ ఉంటుంది. ఇక ఇప్పుడు రంగా కుటుంబం నుంచి ఆయన కుమార్తె ఆశ కిరణ్ రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. ఏ పార్టీలో చేరకపోయినప్పటికీ, ప్రజల్లో ఉంటానంటూ ఆమె చేసిన ప్రకటనలపై రాష్ట్రవ్యాప్తంగా చర్చ జరిగింది. ఆమెకు తెలుగుదేశం( పార్టీ లేదా జనసేన పార్టీలు ఆహ్వానం పలుకుతున్నాయని వార్తలు కూడా వచ్చాయి.అయితే ఇప్పుడు మరో వార్త బెజవాడ రాజకీయాల్లో సంచలనంగా మారింది. వంగవీటి ఆశ కిరణ్, విజయవాడ మేయర్ అయ్యే అవకాశాలు ఉండొచ్చు ప్రచారం మొదలైంది. గత కార్పొరేషన్ ఎన్నికల్లో మహిళను అప్పటి వైసిపి ప్రభుత్వం మేయర్ గా ఎంపిక చేసింది. ఇప్పుడు అదే సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ, కూటమి కూడా మహిళా నాయకురాలిని మేయర్ గా ఎంపిక చేసే అవకాశం ఉండవచ్చు. త్వరలోనే ఆమె జనసేన లేదా టిడిపిలో జాయిన్ అయ్యే అవకాశం ఉండవచ్చని.. ఈ ఏడాది చివర్లో జరగబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో ఆమె కార్పొరేటర్ గా నిలబడే అవకాశాలు ఉండవచ్చును అంటూ హడావుడి మొదలైందికాపు సామాజిక వర్గ ఓటు బ్యాంకు చీలకుండా, కూటమి ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటుంది. జనసేన రూపంలో మెజారిటీ కాపు సామాజిక వర్గం కూటమి వైపు ఉండగా.. వంగవీటి కుటుంబం ద్వారా కొంత కాపు సామాజిక వర్గాన్ని తమ వైపుకు తిప్పుకోవాలని వైయస్ జగన్ భావిస్తున్నారు. అందుకే ఇప్పుడు వంగవీటి ఆశా కిరణ్ ద్వారా.. కాపు సామాజిక వర్గంలో చీలిక తీసుకురాకుండా ఉండే దిశగా అడుగులు పడుతున్నాయి. త్వరలోనే వంగవీటి రాధకు ఎమ్మెల్సీ లేదా రాజ్యసభ ఇచ్చే అవకాశం కూడా ఉంది. ఇక ఇదే సమయంలో వంగవీటి రంగా కుమార్తెకు కూడా విజయవాడ మేయర్ పదవిని ఖరారు చేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు ఉండకపోవచ్చు. దీనిపై ఇప్పటికే కూటమి పెద్దలు నిర్ణయం తీసుకున్నట్లుగా కూడా సమాచారం.

# 23 తర్వాత పరిషత్ ఎన్నికల నోటిఫికేషన్

హైదరాబాద్, ఫిబ్రవరి 18

తెలంగాణలో పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు పూర్తి కావడంతో ఇప్పుడు అందరి దృష్టి పరిషత్ ఎన్నికలపై పడింది. ఈ క్రమంలోనే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల కోసం తెలంగాణ సర్కార్ సమాయత్తం అవుతోంది. దీంతోపాటు జీహెచ్ఎంసీ ఎన్నికలు, రాష్ట్ర బడ్జెట్‌కు సంబంధించి చర్చించేందుకు ఈనెల 23న తెలంగాణ కేబినెట్ భేటీ జరగనుంది. ఈ మంత్రివర్గ సమావేశం తర్వాత.. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలపై ఒక క్లారిటీ రానుందని తెలుస్తోంది.రాష్ట్రంలో మరో ఎన్నికలకు రంగం సిద్ధం అవుతోంది. సర్పంచ్, మున్సిపాలిటీ ఎన్నికలు పూర్తి కావడంతో రేవంత్ రెడ్డి సర్కార్.. స్థానిక సంస్థల ఎన్నికలపై ఫోకస్ పెట్టింది. త్వరలోనే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించేందుకు కసరత్తులు చేస్తోంది. ఇందులో భాగంగానే ఈనెల 23వ తేదీన తెలంగాణ మంత్రి వర్గ సమావేశం నిర్వహించనున్నారు. ఈ కేబినెట్ భేటీలోనే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలతోపాటు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఎన్నికల నిర్వహణపై చర్చించనున్నట్లు తెలుస్తోంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈనెల 23వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు తెలంగాణ మంత్రిమండలి సమావేశం కానుంది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై.. సీఎం, మంత్రులు చర్చించి కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు సమాచారం. మరీ ముఖ్యంగా తెలంగాణ బడ్జెట్ సమావేశాల నిర్వహణపై కీలక చర్చలు జరపనున్నారు. అదే సమయంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపై చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పరిషత్ ఎన్నికల గడువు పూర్తి కావడం.. ఇటీవలె సర్పంచ్, మున్సిపల్ ఎన్నికలు ముగియడంతో.. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించే యోచనలో రేవంత్ సర్కార్ ఉంది.అదే సమయంలో త్వరలోనే జీహెచ్ఎంసీ పాలకవర్గం గడువు కూడ ముగియనుండటంతో ఆ ఎన్నికలపైనా కేబినెట్ భేటీలో చర్చలు జరపనున్నారు. ఇక ఇటీవలె జీహెచ్ఎంసీని 3 కార్పొరేషన్లుగా విభజించగా.. ఎన్నికలు ఎలా నిర్వహించాలి, ఎలాంటి సమస్యలు ఎదురవుతాయి, వాటిని ఎలా అధిగమించాలి అనే దానిపై చర్చించనున్నారు.మరోవైపు.. ఈ మంత్రి వర్గ సమావేశానికి ముందే తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక సంఘటన చోటు చేసుకోనుంది. ఈ నెల 19వ తేదీన ఉదయం 10 గంటలకు దేశ రాజధాని ఢిల్లీలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయమైన ఏఐసీసీ వేదికగా కీలక భేటీ జరగనుంది. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా రాష్ట్ర మంత్రివర్గం మొత్తం ఢిల్లీకి వెళ్లనుంది.కేబినెట్ భేటీకి ముందు హస్తం పార్టీ అధిష్ఠానంతో జరగనున్న ఈ భేటీ ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ప్రాధాన్యతను సంతరించుకుంది. ఆ సమావేశంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారు.. ఆ తర్వాత జరిగే కేబినెట్ భేటీలో ఏం చర్చిస్తారు అనేది ఇప్పుడు తెలంగాణలో ఆసక్తిగా మారింది.

# అధికారమే పరమావధి విలువలు, సిద్ధాంతాలు జాన్తానై

హైదరాబాద్, ఫిబ్రవరి 18,

రాజకీయం అంటేనే అవకాశవాదం అని నేటి నేతలు మరోసారి నిరూపించారు. సిద్ధాంతాలు, విలువలు, పార్టీ జెండాలు.. ఇవన్నీ కేవలం ఎన్నికల ప్రచారానికే పరిమితమని, అధికారం చేతికి చిక్కే అవకాశం వస్తే శత్రువునైనా కౌగిలించుకోవడానికి సిద్ధమని తెలంగాణ మున్సిపల్ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. నిన్నటి వరకు ఒకరిపై ఒకరు నిప్పులు కురిపించుకున్న నేతలు, నేడు పదవుల పంపకాల కోసం 'భాయీ-భాయీ' అంటూ చేతులు కలపడం చూస్తుంటే సామాన్య ప్రజలు విస్తుపోతున్నారు.రాష్ట్రవ్యాప్తంగా సుమారు 36 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాలేదు. దీంతో పార్టీలు తమ రాజకీయ వైరాన్ని పక్కనపెట్టి చేతులు కలిపాయి. ఆదిలాబాద్ లో బిజెపి ఎక్కువ స్థానాలు గెలిచినప్పటికీ, కాంగ్రెస్, బిఆర్ఎస్, ఎంఐఎంలు ఏకమై బిజెపిని అధికారానికి దూరం చేశాయి. కాంగ్రెస్ రెబల్ అభ్యర్థిని ఛైర్‌పర్సన్‌గా నిలబెట్టి గెలిపించింది. భైంసా ఎంఐఎం కంచుకోట. ఇక్కడ బిజెపి రెబల్ అభ్యర్థికి కాంగ్రెస్, స్వతంత్రులు మద్దతు ఇవ్వడం గమనార్హం. నర్సాపూర్, ఆమనగల్లులో కాంగ్రెస్, బిజెపిలు పరస్పరం సహకరించుకున్నాయి. కాంగ్రెస్‌కు ఛైర్మన్ పదవి దక్కితే, బిజెపి వైస్ ఛైర్మన్ పదవిని తీసుకుంది. మెదక్ లో బిజెపి గైర్హాజరు కావడం ద్వారా కాంగ్రెస్ ఎమ్మెల్యే ఓటుతో అక్కడ కాంగ్రెస్ పీఠాన్ని దక్కించుకుంది. ఇస్నాపూర్ లో బిజెపి ఎంపీ రఘునందన్ రావు తన ఓటును బిఆర్ఎస్ అభ్యర్థికి వేయడం ద్వారా అక్కడ బిఆర్ఎస్ గెలుపొందింది.మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికల్లో కనిపిస్తున్న దృశ్యాలు రాజకీయ దిగజారుడుతనానికి పరాకాష్టగా నిలుస్తున్నాయి. రాష్ట్ర స్థాయిలో ఉప్పు-నిప్పులా ఉండే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కొన్ని మున్సిపాలిటీల్లో ఒకే తాటిపైకి వచ్చాయి. "బిజెపి-బిఆర్ఎస్ ఒక్కటే" అని కాంగ్రెస్ విమర్శిస్తుంటుంది, "కాంగ్రెస్-బిఆర్ఎస్ లోపాయికారీ ఒప్పందం'' చేసుకున్నాయని బీజేపీ ఆరోపిస్తుంటుంది. కానీ, తీరా పదవుల విషయానికొచ్చేసరికి ఈ ఆరోపణలన్నీ గాలికి కొట్టుకుపోయాయి. కేవలం అధికారం దక్కించుకోవడమే పరమావధిగా, ప్రజల తీర్పును అపహాస్యం చేస్తూ ఈ 'మిలాఖత్' రాజకీయాలు సాగుతున్నాయి.ప్రతి పార్టీకి ఒక సిద్ధాంతం ఉంటుంది. ప్రజల ముందుకు వెళ్లేటప్పుడు తాము ఫలానా పార్టీకి వ్యతిరేకమని, వారి పాలన అస్తవ్యస్తమని గొంతు చించుకుని ప్రచారం చేస్తారు. కానీ, ఫలితాల తర్వాత మ్యాజిక్ ఫిగర్ రాకపోతే, వెంటనే తమ బద్ధశత్రువుతోనే జతకడతారు. ఇది ఓటర్లను మోసం చేయడమే. ప్రజలు ఒక పార్టీ సిద్ధాంతాన్ని నమ్మి ఓటేస్తే, గెలిచిన ప్రతినిధులు మాత్రం తమ స్వప్రయోజనాల కోసం వ్యతిరేక పార్టీతో చేతులు కలపడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు.ముఖ్యంగా మున్సిపల్ ఛైర్మన్ గిరి దక్కించుకోవడం వెనుక కేవలం రాజకీయ అధికారం మాత్రమే కాదు, ఆర్థిక ప్రయోజనాలు కూడా ముడిపడి ఉంటాయనేది బహిరంగ రహస్యం. భూములకు అనుమతులు, టెండర్లు, నిధుల మంజూరు వంటి అంశాల్లో చక్రం తిప్పవచ్చనే ఆశతోనే, నేతలు తమ ఆత్మగౌరవాన్ని కూడా పక్కన పెట్టి పొత్తులకు సిద్ధపడుతున్నారు.ఈ వింత పోకడల వల్ల అత్యంత నష్టపోయేది క్షేత్రస్థాయిలో ఉండే కార్యకర్తలే. ఎన్నికల సమయంలో తమ పార్టీ గెలవాలని, ప్రత్యర్థి పార్టీ నాయకులతో గొడవలకు దిగి, కేసులు వేయించుకుని, శత్రుత్వం పెంచుకునేది కార్యకర్తలు. తమ నాయకుడు గెలవగానే తమ కష్టాలు తీరుతాయని ఆశిస్తారు. కానీ, గెలిచిన తర్వాత అదే నాయకుడు ప్రత్యర్థి పార్టీ నేతతో కలిసి విందులు ఆరగిస్తూ, పదవులు పంచుకుంటూ ఉంటే.. ఆ కార్యకర్తలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక తల పట్టుకుంటున్నారు.తెలంగాణలో చోటు చేసుకుంటున్న ఈ 'అడ్డగోలు' పొత్తులు ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తున్నాయి. రాజకీయ పార్టీలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం సిద్ధాంతాలను వదిలేస్తే, వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పోతుంది. పదవుల కోసం పడి చచ్చే నేతలు.. తాము ఎవరి కోసం ఈ పదవులు చేపట్టామో, ఎవరి ఓట్లతో గెలిచామో ఒక్కసారి ఆత్మవిమర్శ చేసుకోవాలి. పార్టీల మధ్య ఈ అపవిత్ర కలయికలు దేశ రాజకీయాలకే చేటు. ఇప్పటికైనా నేతలు తమ వైఖరి మార్చుకోకపోతే, భవిష్యత్తులో ప్రజలే వారిని రాజకీయ తెర నుంచి తప్పించడం ఖాయం.

# పుర పోరు ముగిసింది...ఫలితాల సెగ మాత్రం

హైదరాబాద్, ఫిబ్రవరి 18,

తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక ఘట్టం ముగిసింది. రాష్ట్రంలోని ఎనిమిది మున్సిపల్ కార్పొరేషన్లకు జరిగిన మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికలు అధికార కాంగ్రెస్ పార్టీకి తిరుగులేని ఆధిక్యాన్ని కట్టబెట్టాయి. నగర ఓటరు నాడి ఎటువైపు ఉందో స్పష్టం చేస్తూ.. ఎనిమిదిలో ఆరు కార్పొరేషన్లను కాంగ్రెస్ కైవసం చేసుకోగా, బీజేపీ, సీపీఐ తలో స్థానాన్ని దక్కించుకున్నాయి. ఒకప్పుడు నగరాలపై ఏకఛత్రాధిపత్యం వహించిన భారత్ రాష్ట్ర సమితి ఈ ఎన్నికల్లో ఒక్క కార్పొరేషన్‌ను కూడా గెలుచుకోలేకపోవడం గమనార్హం.

8 కార్పొరేషన్ల మేయర్, డిప్యూటీ మేయర్లు:

నిజామాబాద్: మేయర్ ? దండుగు సత్యనారాయణ (కాంగ్రెస్). డిప్యూటీ మేయర్ ? రహీముద్దీన్ (కాంగ్రెస్)

మంచిర్యాల: మేయర్ ? కారుకురి వెంకటేశ్వర్లు (కాంగ్రెస్), డిప్యూటీ మేయర్- పి. మహేష్

మహబూబ్‌నగర్: మేయర్- కె. నిర్మల (కాంగ్రెస్), డిప్యూటీ మేయర్ - నరసింహులు (కాంగ్రెస్)

రామగుండం: మేయర్ ? ఎం. జ్యోతి (కాంగ్రెస్), డిప్యూటీ మేయర్ - శ్రీనివాస్ (కాంగ్రెస్)

నల్గొండ: మేయర్ ? ఎం. రవీందర్ రెడ్డి (కాంగ్రెస్), డిప్యూటీ మేయర్ - అబ్దుల్ నబీ (కాంగ్రెస్)

కొత్తగూడెం : మేయర్ ? మేకా వెంకటేశ్వర్లు (సీపీఐ), డిప్యూటీ మేయర్ - బి. రామ్మోహన్ (కాంగ్రెస్)

కరీంనగర్: మేయర్ కొలగాని శ్రీనివాస్ (బీజేపీ), డిప్యూటీ మేయర్ - సునీల్ రావు (బీజేపీ)

సూర్యాపేట : మేయర్ ? ఎస్. ప్రకాష్ (కాంగ్రెస్), డిప్యూటీ మేయర్ ? జి. లక్ష్మి (కాంగ్రెస్)

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే జరిగిన ఈ మున్సిపల్ ఎన్నికలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. నిజామాబాద్ వంటి చోట్ల బీజేపీకి మెజారిటీ ఉన్నా, ఎక్స్-అఫీషియో ఓట్లు, స్వతంత్రుల మద్దతును కూడగట్టడంలో కాంగ్రెస్ సఫలమైంది. గృహజ్యోతి, ఉచిత బస్సు ప్రయాణం వంటి గ్యారెంటీ పథకాల ప్రభావం పట్టణ ఓటర్లపై స్పష్టంగా కనిపించింది. అంతర్గత విభేదాలు పక్కన పెట్టి మంత్రులు, ఎమ్మెల్యేలు తమ తమ జిల్లాల్లో పార్టీని గెలిపించడంపై దృష్టి పెట్టారు.కరీంనగర్ లో బీజేపీ తన ఉనికిని చాటుకుంది. మున్సిపల్ కార్పొరేషన్‌ను కైవసం చేసుకుంది. మేయర్‌గా కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్‌గా సునీల్ రావు ఎన్నిక కావడంతో కాషాయ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. కేంద్ర మంత్రి బండి సంజయ్ తన సొంత గడ్డపై పట్టు నిలుపుకోవడం పార్టీకి జాతీయ స్థాయిలోనూ బలాన్నిచ్చింది. ఇక్కడ చివరి నిమిషంలో బీఆర్ఎస్ తటస్థంగా ఉండిపోవడంతో బీజేపీకి విజయం దక్కింది. మరోవైపు, కాంగ్రెస్ మద్దతుతో కొత్తగూడెం మేయర్ పీఠం సీపీఐ పరం కావడం విశేషం. కార్మిక క్షేత్రంలో ఎర్రజెండా ప్రాబల్యం తగ్గలేదని ఇది నిరూపించింది.ఈ ఎన్నికల్లో ఒక్క కార్పొరేషన్‌ను కూడా దక్కించుకోలేకపోవడం బీఆర్ఎస్‌కు చావుదెబ్బ. కీలక నేతలు కాంగ్రెస్‌లోకి ఫిరాయించడం వల్ల క్షేత్రస్థాయిలో పార్టీ బలహీనపడింది. పట్టణ ప్రాంతాల్లో పదేళ్ల అభివృద్ధిని ప్రజలకు వివరించడంలో పార్టీ విఫలమైంది. అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత క్యాడర్‌లో నెలకొన్న నైరాశ్యం ఓటింగ్ శాతంపై ప్రభావం చూపింది.ఈ ఫలితాలు కేవలం మున్సిపల్ ఎన్నికలకే పరిమితం కావు. రాబోయే ఎన్నికలకు ఇవి దిక్సూచిగా మారనున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సాధించిన ఈ విజయం రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని మరింత బలపరిచింది. పట్టణాల్లో తామే ప్రత్యామ్నాయమని బీజేపీ చాటిచెప్పింది. బీఆర్ఎస్ పార్టీ ఉనికిని కాపాడుకోవడానికి



ఇప్పుడు పునరాలోచన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.తెలంగాణలో 'పుర' పోరు ముగిసినా, దీని ఫలితాల సెగ మాత్రం చిరకాలం ఉండనుంది. మేయర్ పీఠాలను దక్కించుకున్న నేతలు ఇప్పుడు నగరాభివృద్ధిపై దృష్టి సారించాల్సి ఉంది. ఓటర్లు ఇచ్చిన ఈ తీర్పును గౌరవిస్తూ, పాలనలో పారదర్శకత చూపితేనే ఈ విజయం సార్థకమవుతుంది.

========================

## మైలార్ దేవ్ పల్లి లో రెచ్చిపోయిన గంజాయి గ్యాంగ్. శాస్త్రి పురం లో అర్ధరాత్రి గంజాయి గ్యాంగ్ అరాచకం.

రంగారెడ్డి ఫిబ్రవరి 18

మైలార్ దేవ్ పల్లి శాస్త్రిపురంలో మంగళవారం ఆర్ధరాత్రి గంజాయి మూక హల్ చల్ చేసింది. విచక్షణారహితంగా ఐదు మంది పై దాడి చేసింది. అడ్డువచ్చిన వారిపై పిడు గుద్దుల వర్షం కురిపించింది. తరువాత అక్కడ పార్కింగ్ చేసిన వాహనాలను ధ్వంసం చేసింది. క్షతగాత్రులను హుటాహుటిన ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అందులో ఒకరి పరిస్థితి విషమంగా వుంది. ఘటనతో స్థానికులు ఒక్కసారిగా భయభ్రాంతులకు గురి అయ్యారు. పోలీసులకు సమాచారం అందించారు. స్పాట్ కు పోలీసులు చేరుకునే లోపు గంజాయి బ్యాచ్ పరారయింది. పారిపోతున్న గంజాయి బ్యాచ్ ను స్థానికులు స్?థానికువెంబడించారు. ఒకరిని పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు.

## రచయిత బొగ్గుల శ్రీనివాస్ ఒంటిపై గాయాలు పోస్టుమార్టం నివేదికలో నిర్ధారణ

హైదరాబాద్ ఫిబ్రవరి 18

పవన్ కళ్యాణ్ హఠావో పాలిటిక్స్ బచావో రచయిత మృతి కేసులో బొగ్గుల శ్రీనివాస్ కీలక అంశం బయటపడింది. ఈ నెల 14వ తేదీన ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పాలేరు రిజర్వాయర్లో కారు మునిగిన ఘటనలో శ్రీనివాస్ మృతి చెందిన విషయం తెలిసిందే శ్రీనివాస్ ఒంటిపై గాయాలు ఉన్నాయని, అతనిది సహజ మరణం కాదనిఅతని కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేసారు. కారు నీటిలో మునిగిన తర్వాత డ్రైవర్ పారిపోయాడు. పోస్టుమార్టం అనంతరం శ్రీనివాస్ ఒంటిపై గాయాలు ఉన్నట్లు గుర్తించామని పోలీసులు వెల్లడించినట్లు సమాచారం.

## చిన్నారి అత్యాచారం కేసు నిందితుడు ఆత్మహత్య

మదనపల్లి ఫిబ్రవరి 18

సంచలనం సృష్టించిన మదనపల్లి బాలిక అత్యాచారం కేసులో నిందితుడు కులవర్ధన్ ఆత్మహత్య చేసుకున్నాడు. కురబాలకోట (మం) కనసానివారిపల్లి చెరువులో కులవర్ధన్ మృత దేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ముదివేడు పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు.

## శంషాబాద్ ధర్మగిరి టెంపుల్ గంజాయి కలకలం గంజాయిని దేవుడికి ప్రసాదంగా పెట్టిన యువకులు

రంగారెడ్డి ఫిబ్రవరి 18

బడంగ్ పేట్ కు చెందిన చరణ్ తో పాటు అతని స్నేహితులు శివరాత్రి సందర్భంగా శివుడికి గంజాయిని ప్రసాదంగా పెట్టారు. గంజాయిని ప్రసాదంగా పెట్టే వీడియోను తీసి ఇన్స్టాగ్రామ్ లో పోస్ట్ చేసారు. అందరూ కొబ్బరికాయ కొట్టేలాగా కాకుండా వేము ప్రత్యేకంగా గంజాయి పెడుతున్నామంటూ వీడియో తీసారు.

ఇన్స్టాగ్రామ్ లో రీల్ హల్ చల్ కావడంతో నెటిజెన్లు హైదరాబాద్ కమిషనర్ సజ్జనార్ కు ఫిర్యాదు చేసారు. దాంతో టాస్క్ ఫోర్స్ పోలీసులు రంగంలోకి దిగారు. యువకులు బడంగ్పేట్ కు చెందిన వారిగా గుర్తించారు. యువకుల కోసం గాలిస్తున్నారు. ఇలాంటి రీల్స్ పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామంటూ సీపీ సజ్జనార్ హెచ్చరించారు.

## జీవన్గి కుస్తీ-పోటీలో ఫైనల్లో పైల్వాన్ బహుమతులు అందజేసిన ఆలయ కమిటీ పూజారులు

జహీరాబాద్ ఫిబ్రవరి 18,

బషీరాబాద్ మండలంలో కర్ణాటక సరిహద్దులో ఉన్న జీవన్గి గ్రామంలో వెలిసిన అతి పూర్వకమైన శ్రీ మహాదేవ లింగేశ్వర జాతర ఉత్సవాల సందర్భంగా 40 సంవత్సరాల నుండి ఒక ఆనవాయితీగా వస్తున్న అవే ఈ కుస్తీ పోటీలు మంగళవారం కాగ్న నది ఒడ్డున వెలసిన శ్రీ మహాదేవ లింగేశ్వర దేవాలయం దగ్గర ఇసుక దిమ్మెలలో కుస్తీ పోటీలు ప్రారంభమైంది ఇక్కడ చిన్నపిల్లల నుండి సుమారుగా పది సంవత్సరాల వారు పూజ టెంకాయ నుంచి ప్రారంభమై, ఇక నగదు రూపంలో నుండి కుస్తీల నగదు రూపాయలు పెరుక్కుంటూ పోతుంది, ఫైనల్ కి వచ్చేవరకు 4000 రూపాయల వరకు దేవస్థానం కమిటీ వారు అందజేయడం జరిగింది పక్క రాష్ట్రం నుండి కర్ణాటక, మహారాష్ట్ర గుల్బర్గా, బీదర్, వంటి జిల్లాల నుండి సుమారుగా 150 మంది యువకులు కుస్తీ పోటీలో పాల్గొనడానికి వచ్చారు, వికారాబాద్ జిల్లా నుండి, మరియు తాండూర్ నియోజకవర్గంలో వివిధ గ్రామాల నుంచి కరణ్ కోట్, బషీరాబాద్, దామర్ చెడ్, గంగ్వార్, క్యాద్గిర, మైల్వార్, బషీరాబాద్, చంద్రవంచ, మంతటి, రెడ్డి ఘనపూర్, కొర్విచెడ్, మంతటి, రెడ్డి ఘనపూర్, దామర్చెడ్, అల్లాపూర్ ఇందర్ చెడ్, పలు గ్రామాల నుంచి భారీగా యువకులు 200 పైగా కుస్తీ పోటీలో పాల్గొనడం జరిగింది, ఆలయ కమిటీ వారు తాండూర్ డి.ఎస్.పి, సీఐ, ఎస్సైలు, కుస్తీ పోటీలను చూడడం జరిగింది

## మిడిల్ క్లాస్ సొంత ఇంటి కలనెరవేరే

హైదరాబాద్, ఫిబ్రవరి 18,

హైదరాబాద్ నగరంలో సొంతిల్లు కట్టుకోవాలనుకునే మధ్యతరగతి ప్రజలకు తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ప్రజల సొంతింటి కలను నిజం చేసేందుకు హైదరాబాద్ ఔటర్ రింగు రోడ్డు, రీజినల్ రింగు రోడ్డు మధ్య మిడిల్ క్లాస్ ప్రజలకు తక్కువ ధరకే ఇళ్లు నిర్మించి ఇస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కూకట్పల్లి హౌసింగ్ బోర్డు తరహాలో ఈ ఇళ్ల నిర్మాణం ఉంటుందని అన్నారు. హైదరాబాద్ నగరంలో లేదా శివారు ప్రాంతంలో ఇల్లు కట్టుకోవాలని మధ్య తరగతి ప్రజలు కలలు కంటుంటారు. అయితే ప్రస్తుతం ఇళ్ల ధరలు ఆకాశానికి చేరుకున్నాయి. శివారు ప్రాంతాల్లోనూ ఇళ్ల ధరలు లక్షల్లో పలుకుతున్నాయి. దాదాపు రూ.60-70 లక్షలు వెచ్చించనిదే ఇల్లు దొరకని పరిస్థితి. ఈ నేపథ్యంలో మిడిల్ క్లాస్ ప్రజల సొంతింటి కలను నిజం చేసేందుకు రేవంత్ సర్కార్ సిద్ధమైంది. ఈ మేరకు గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డు - ఔటర్ రింగు రోడ్డు పరిధిలో మధ్య తరగతి ప్రజల కోసం తక్కువ ధరకే ఇళ్లను నిర్మించి ఇస్తామని పొంగులేటి వెల్లడించారు. హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) పరిధిలో హౌసింగ్ పాలసీపై మంగళవారం అధికారులతో సమీక్ష నిర్వహించిన పొంగులేటి గతంలో కేపీహెచ్బీలో నిర్మించిన మాదిరిగానే ఇళ్లను నిర్మించి ఇస్తామన్నారు. ఇందుకోసం నాలుగు ప్రాంతాల్లో స్థలాలను గుర్తించి పది రోజుల్లో నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. కాగా, కనీసం వంద ఎకరాల్లో ఈ టౌన్షిప్ను అందుబాటులో తేవాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని గతంలోనే మంత్రి పొంగులేటి తెలిపారు. ఇక రాష్ట్రంలోని పట్టణాలు, నగరాల్లో నివసించే పేద, అల్ప ఆదాయ, మధ్యతరగతి వర్గాల వారికి అందుబాటులో తక్కువ ధరలకే ఇళ్లను అందించేందుకు సర్కార్ రెడీ అయింది. ఈ మేరకు ఎఫర్డబుల్ హౌసింగ్ పాలసీని తెలంగాణ ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. ఈ నెలాఖరులోగా అందుకు సంబంధించిన మార్గదర్శకాల ముసాయిదాను రేవంత్ ప్రభుత్వం రూపొందించనుంది. ఈ మేరకు పాలసీ రూపకల్పనకు 'రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్' ద్వారా సీబీఆర్ఇ కన్సల్టెన్సీ సంస్థను ఎంపిక చేసింది. మొత్తం మూడు దశల్లో మధ్యతరగతి ప్రజలకు ఇళ్ల సముదాయాలను నిర్మించనున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని మురికివాడల్లోనే పలు అంతస్తుల్లో భవనాలను నిర్మించి పేద ప్రజలకు అందించాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. హైదరాబాద్ ఫోర్త్ సిటీలోనూ పెద్దఎత్తున గృహ సముదాయాల నిర్మాణాన్ని చేపట్టనున్నారు. వరంగల్, కరీంనగర్, నల్గొండ వంటి టైర్ -2 పట్టణాల్లోనూ ఇళ్ల టవర్లను ఏర్పాటుచేసేలా రేవంత్ ప్రభుత్వం మార్గదర్శకాలను రూపొందిస్తోంది.

## మున్సిపల్ ఎన్నికల్లో పై బీజేపీ ఆత్మవిమర్శ

హైదరాబాద్, ఫిబ్రవరి 18,

తెలంగాణలో 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల ఫిబ్రవరి 11న ఎన్నికలు జరిగాయి. 13న కౌంటింగ్ నిర్వహించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించింది. 2,569 వార్డుల్లో 1,530 స్థానాలు గెలిచి పట్టణ రాజకీయాల్లో బలం చాటుకుంది. కార్పొరేషన్లలో 140 సీట్లతో అగ్రస్థానంలో నిలిచింది. ఇక బీఆర్ఎస్ 781 వార్డులు, కార్పొరేషన్లలో 53 మాత్రమే గెలిచి ద్వితీయ స్థానంలో ఉంది. జాతీయ పార్టీ, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ 245 వార్డులు, కార్పొరేషన్లలో 66 డివిజన్లు గెలిచింది. అయితే గతంతో పోలిస్తే బీజేపీ సీట్లు గణనీయంగా తగ్గాయి. ఎంపీలు, ఎమ్మెల్యే సీట్లు పెరిగినా.. ఆ తర్వాత జరిగిన పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ బలం తగ్గడం ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఇక మున్సిపల్ ఎన్నికల్లో 26 మున్సిపాలిటీల్లో ఎలాంటి పార్టీకీ మెజారిటీ లేకపోవడంతో స్వతంత్రులు, వామపక్షులు కీలకం. కాంగ్రెస్ ఎక్కువ స్థానాలు సాధించేందుకు కొఆప్షన్ వ్యూహాలు రూపొందిస్తోంది. కాంగ్రెస్ పంచాయతీ విజయాల తర్వాత పట్టణాల్లో కూడా బలపడింది. బీఆర్ఎస్ పట్టణ ప్రజల అసంతృప్తికి గురై చతికిలబడింది. బీజేపీకి ఎమ్మెల్యేలు, ఎంపీల ప్రాంతాల్లో (ఆదిలాబాద్, కామారెడ్డి) మెరుగైన ఫలితాలు వచ్చినా, మొత్తంగా తగ్గుదల. భైంసాలో రెబెల్స్ విజయం పార్టీ అంతర్గత సమస్యలను తెలియజేస్తోంది. పట్టణ ఓటర్లు స్థానిక సమస్యలు పరిష్కరించే అభ్యర్థులకు ప్రాధాన్యం ఇచ్చారు. కేంద్రం పంచాయతీలకు, మున్సిపాలిటీలకు నేరుగా నిధులు ఇస్తున్నా.. బీజేపీని ఆదరించలేదు. బీజేపీని జాతీయ పార్టీగా, దేశ రక్షణ పార్టీగానే తెలంగాణ ప్రజలు చూస్తున్నారు. స్థానిక సమస్యలు పరిష్కరించే పార్టీగా భావించడం లేదు. ఈ విషయంపై బీజేపీ దృష్టి పెట్టాలి. బీజేపీ బలం తగ్గడం తెలంగాణతోపాటు, దేశ విషయాలపై ప్రజల అభిప్రాయాన్ని సూచిస్తుంది.

## వికారాబాద్ కు రైల్వే లైన్

హైదరాబాద్, ఫిబ్రవరి 18,

కేంద్రంలో ఎన్ని ప్రభుత్వాలు మారుతున్న తెలుగు రాష్ట్రాల్లో రైల్వే లైన్ల విస్తరణ ఆశించిన స్థాయిలో జరగడం లేదు. నిదుల కేటాయింపులో వివక్ష చూపుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. అయితే బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైల్వే కన్నా రోడ్ల విస్తరణపై దృష్టిపెట్టింది. ఇందులో భాగంగా అనేక రహదార్లను జాతీయ రహదారులుగా మార్చింది. తాజాగా కొత్త రైల్వేలైన్ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దక్షిణ తెలంగాణ ప్రాంతాల అభివృద్ధికి కీలకమైన వికారాబాద్?కృష్ణా రైల్వే ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర నివేదిక రైల్వే బోర్డుకు చేరింది. రూ.2,750 కోట్ల వ్యయంతో 130.28 కిమీ దూరం విస్తరించిన ఈ మార్గం ఆమోదం పొందితే పరిగి, కొడంగల్, మక్తల్, నారాయణపేటలకు రైలు కనెక్టివిటీ వస్తుంది. తొలుత 120 కిమీగా డీపీఆర్ రూపొదించారు. తాజాగా 130.28 కిమీలకు పెంచారు. ఈ లైన్ భూసేకరణ ఖర్చు రాష్ట్రమే భరిస్తుంది. కేంద్రం ఆర్థిక లాభాలపై అభ్యంతరాలు ఉన్నప్పటికీ, ప్రాంతీయ అభివృద్ధి కోసం ముందుకు వచ్చింది. టేకల్కోడ్ లైమ్స్టోన్ నిక్షేపాలు, సిమెంట్, జౌళి పరిశ్రమలకు ఈ రైల్వేలైన్ దోహదపడుతుంది. కొత్త రైల్వే లైన్ నిర్మాణానిక సీఎం రేవంత్రెడ్డి ప్రత్యేక కృషి చేశారు. కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ను కలిసిన సీఎం ప్రాజెక్టు ప్రాధాన్యతను వివరించారు. ధాన్యం, పత్తి, మిర్చి రవాణా, ఎరువుల సరఫరా, గ్రానైట్ ఎగుమతులకు మార్గం సులభతరమవుతుందని, కొత్త పెట్టుబడులు వస్తాయని తెలిపారు. కొత్త రైల్వేలైన్తో పరిగి, కొడంగల్, దౌల్తాబాద్, మక్తల్, నారాయణపేటలో వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు ఊపందుకుంటాయి. గోవా, హుబ్లీ మార్గాలు దగ్గరవుతాయి. దక్షిణ తెలంగాణ ఆర్థిక దిశను ఇది మలుపు తిప్పుతుందని అంచనా.

## అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం.!

రంగారెడ్డి ఫిబ్రవరి 18,

రంగారెడ్డి జిల్లా రాయికల్ టోల్ ప్లాజా దగ్గర అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గుర్తు తెలియని వాహనం ఇన్నోవా క్రిష్ట వాహనాన్ని ఢీకొట్టడంతో అందులో ఉన్న ఐదు మందికి తీవ్ర గాయాలయ్యాయి. తుర్కయంజాల్ కు చెందిన ఇద్దరు పుల్లగుర్రం పురుషోత్తం రెడ్డి, గంగిరెడ్డి మధుసూదన్ రెడ్డి అక్కడికక్కడే మృతి చెందారు. వీరంతా అరుణాచలం నుండి యాత్ర ముగించుకొని హైదరాబాదు వెళుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది ..

## ఓటమి ఎరుగని ధీరుడు,హిందూ సామ్రాజ్య స్థాపకుడు ఛత్రపతి శివాజీ మహారాజ్. నేడు ఆయన జయంతి

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

ఓటమి ఎరుగని ధీరుడు, హిందూ సామ్రాజ్య స్థాపకుడు ఛత్రపతి శివాజీ మహారాజ్.. ఆయన క్రీ.శ. ఫిబ్రవరి 19, 1630వ సంవత్సరం వైశాఖమాసపు శుక్లపక్ష తదియనాడు పూణే జిల్లాలోని జున్నార్ పట్టణం దగ్గర గల శివనేరి కోటలో శహాజీ, జిజాబాయి పుణ్యదంపతులకు జన్మించాడు. వీరు మహారాష్ట్రలోని వ్యవసాయ కున్బీ కులానికి చెందినవారు. జిజాబాయికి శంభాజీ తర్వాత పుట్టిన కొడుకులు అందరూ మృతి చెందగా ఆమె పూజించే దేవత అయిన శివై (పార్వతి) పేరు శివాజీకు పెట్టింది. శివాజీ తండ్రి షాహాజీ నిజాంషాహీల ప్రతినిధిగా పనిచేస్తూ మొఘల్ రాజులకు వ్యతిరేకంగా అనేక యుద్ధాల్లో పాల్గొన్నాడు. షాజహాన్ దండయాత్ర చేసిన సమయంలో కీలకపాత్ర పోషించాడు. తన సహచరుడిని నిజాంషాహీ ప్రభువు హత్యచేయించడంతో తిరుగుబాటు బావుటాను ఎగురవేసి స్వతంత్ర మరాఠా సామ్రాజ్య స్థాపనకు నాంది పలికాడు. రాజ్య విస్తరణ కోసం చేసిన యుద్దాలలో పరాజయాన్ని చవిచూశాడు. తండ్రి వద్ద యుద్ధవిద్యలు, రాజనీతి మెలుకువలు నేర్చుకున్న శివాజీ తండ్రి పరాజయాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి అనేక నూతన యుద్ధతంత్రాలను రూపొందించాడు. సకలవిద్యలను అవపోసన పట్టిన ఆయన మరాఠాసామ్రాజ్య స్థాపనే లక్ష్యంగా తన వ్యూహాలను రచించాడు. 17 సంవత్సరాల వయస్సులోనే సూల్తానులలో యుద్ధాలకు తలపడిన శివాజీ బిజాపూర్ సామ్రాజ్యానికి చెందిన తోర్నా కోటను సొంతం చేసుకున్నాడు. యుద్ధ భయంకరుడుగా పేరుపొందిన అఫ్జల్ఖాన్ శివాజీ మెరుపు దాడులు, గెరిల్లా యుద్ధ పద్దతులు తెలుసుకుని ఆయనను రెచ్చకొట్టేలా శివాజీకి ఇష్టదైవమైన భావానీదేవి ఆలయాన్ని కూల్చివేశాడు. అఫ్జల్ కుట్రలు తెలుసుకున్న శివాజీ ప్రతాప్ఘడ్ కోట లోసమావేశానికి అంగీకరిస్తాడు, ముందు జాగ్రత్తగా ఉక్కుకవచాన్ని ధరించి పిడిబాకును దాచుకుని చర్చలకు సిద్ధమవుతాడు. శివాజీ ని అంతమొందించడమే లక్ష్యంగా పెట్టుకున్న అఫ్జల్ కత్తితో శివాజీపై దాడి చేస్తాడు, ఉక్కుకవచం కారణంగా రక్షించబడిన శివాజీ వెంటనే పిడిబాకులో దాడిచేస్తాడు, సైనికాధికారి చేతిలో అఫ్జల్ ఖాన్ మరణించగా మెరుపుదాడుల్లో సైనాన్ని మట్టికరిపిస్తాడు. ప్రతాప్ ఘడ్ యుద్ధంతో శివాజీ కీర్తిప్రతిష్టలు భారతదేశమంతటా వ్యాపిస్తాయి. ఎందరో హిందూ రాజులు ఆయన కు సంఘీభావం తెలియజేస్తారు. అఫ్జల్ఖాన్ మరణాన్ని సహించలేని బిజాపూర్ సుల్తాన్ పదివేలమంది అతిబలవంతులైన సైనికులను శివాజీని అంతమొందించడానికి పంపిస్తాడు. ఐదు వేలమంది మరాఠాయోధులతో హరహరమహా దేవ అంటూ విజృంభించిన శివాజీ వారిని ఊచకోతకోశాడు. శివాజీ పరాక్రమాలను తెలుసుకున్న మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు ముందుజాగ్రత్తగా అపారమైన సైనికశక్తిని, సిద్ది జోహార్ అనే సైనికాధ్యక్షుడిని కొల్హాపూర్లో మోహరిస్తాడు. సమీపంలోని పన్హాలా కోటలో వందలమంది అనుచరులతో ఉన్న శివాజీ విషయం తెలుసుకుని కోటనుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తాడు. ఈ యుద్ధంలో అతిఎక్కువమంది సైనికులను కోల్పోయిన శివాజీ సంధికి అంగీకరిస్తాడు. ఈ సంధిలో భాగంగా శివాజీ సామ్రాజ్యం స్వతంత్ర్య రాజ్యంగా గుర్తింపు, సిద్ది జోహార్ విజయానికి బహుమతిగా పన్హాలా కోట దక్కింది. సుల్తానులతో శివాజీ చేసిన ఆఖరు పోరు పవన్ ఖండ్ యుద్ధం. శివాజీతో యుద్ధంలో ఎలాగైనా విజయం సాధించాలన్న లక్ష్యంతో ఔరంగజేబు తన మేనమామ షాయిస్తాఖాన్ వెంట లక్షకు పైగా సైన్యాన్ని, ఆయుధాలను ఇచ్చి దక్కన్ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోవాలని ఆదేశిస్తాడు. అయితే మొగల్సేనల ముందు మరాఠి సేనలు నిలువలేక పోతారు. ఓటమిని అంగీకరించిన శివాజీ పూణే వదిలి వెళ్లిపోతాడు. శివాజీ నిర్మించిన లాలామహల్ లో షాయిస్తాఖాన్ నివాసం ఏర్పాటుచేసుకుని, శివాజీ దాడి నుంచి ముందస్తుజాగ్రత్తగా పూణే నగరమంతా కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాట్లు చేసుకుంటాడు. మారువేషంలో వచ్చిన శివాజీ షాయిస్తాఖాన్ గదిలోకి చేరి కత్తితో దాడి చేస్తాడు. గాయపడిన ఖాన్ సైనికుల సహాయంలో ప్రాణాలు దక్కించుని ఔరంగజేబు వద్దకు చేరుతాడు. తిరిగి తన కోటను స్వాధీనం చేసుకున్న శివాజీ సూరత్ నగరం పై దాడి చేసి అపారమైన ధనాన్ని, ఆయుధాలను దోచుకుని తన సైన్యాన్ని బలోపేతం చేసుకునిక్రమంగా మొఘలుల, బీజాపూర్ సుల్తానుల కోటలను ఒక్కొక్కటిగా స్వాధీనం చేసుకుంటాడు. మొఘల్ సర్దార్గా ఉండడానికి అంగీకరించి 23కోటలను, నాలుగు లక్షల రూపాయలను చెల్లిస్తాడు. ఔరంగజేబు తన పుట్టినరోజు సందర్భంగా శివాజీని , అతని ఆరేళ్ల కొడుకు శంభాజీని ఆహ్వానించి నిండుసభలో అవమానపరుస్తాడు. మరాఠీల తిరుగుబాటుకు బయపడి శివాజీని హతమర్చకుండా అతిథిగృహంలోనే బందీచేస్తాడు. చాకచాక్యంతో అక్కడినుంచి తప్పించున్న శివాజీ రహస్యంగా తన కార్యకలాపాలు నిర్వహిస్తూ 1674 నాటికీ లక్షమంది సుశిక్షితులైన సైన్యాన్ని, ఆయుధాలను, అశ్వాలను, గుఢాచారి వ్యవస్థను, నౌకావ్యవస్థను ఏర్పాటుచేసుకుంటాడు. శ్రీశైలం వచ్చి అక్కడ భవానీదేవిని ధ్యానిస్తాడు. ఆయన భక్తికి మెచ్చిన దేవి ప్రత్యేక్షమై ఖడ్గాన్ని ప్రసాదిస్తుంది. (ఇప్పటికీ ఆ ఖడ్గం మ్యూజియంలో ఉంది.) మరాఠ సామ్రాజ్యాన్ని విస్తరించాలన్న ఆకాంక్ష, దేవి ఆశీస్సులు ఉన్న ఖడ్గంతో శివాజీ ఎన్నో కోటలను సులువుగా స్వాధీనం చేసుకున్నాడు. కొండ కోట ను స్వాధీనం చేసుకోవడానికి అత్యంత గొప్ప సైనికాధికారిగా పేరు తెచ్చుకున్న తానాజీని పురమాయిస్తాడు శివాజీ. కోట నిర్మాణాన్ని క్షుణ్ణంగాపరిశిలించిన తానాజీ యశ్వంతి అనే ఉడుముకు తాడు కట్టి కొండపైకి విసిరి, ఆ తాడు హాయంతో కోట లోకి ప్రవేశించి కోటను స్వాధీనం చేసుకుంటాడు. అయితే ఈ పోరులో తానాజీ మరణిస్తాడు. కోటను గెలిచాం కాని సింహాన్ని కోల్పోయామని ఆవేదన చెందిన శివాజీ ఆ కోటను సింహఘడ్ గా మార్చాడు. మరాఠాసామ్రాజ్యాన్ని వ్యాపించచేసిన శివాజీకి రాయఘడ్ కోటలో వేదపఠనాల మధ్య క్షత్రియరాజులందరికీ అధిపతిగా కీర్తిస్తూ ఛత్రపతి బిరుదును ప్రదానం చేస్తారు. ఎన్నో కోటలపై దండయాత్రలు చేసిన శివాజీ ఏ మతానికి చెందిన పవిత్రస్థలాలను ధ్వంసం చేయలేదు.

మొగలులకు, సుల్తాన్లకు వ్యతిరేకంగా పోరాటం చేసిన ఆయన కొలువులో అనేకమంది ముస్లింలు ఉండేవారు. సైన్యంలో మూడొంతులు ముస్లింలే. శివాజీకి సర్వసైన్యాధ్యక్షులుగాదౌలత్ఖాన్, సిద్ధిక, నావికాదళానికి ఇబ్రహీం ఖాన్, మందుగుండు విభాగానికి అధ్యక్షుడుగా సిద్ది ఇబ్రహీం బాధ్యతలు నిర్వహించేవారు. పరస్త్రీలను మాతృ సమానురాలుగా చూసిన గొప్ప వ్యక్తి శివాజి. గెరిల్లా విధానంలో పోరాటం, కొత్త ఆయుధాలను కనుగొవడం శివాజీ అవలంభించిన యుద్ధవై?పుణఅయాలే. 27 సంవత్సరాల పాటు సుదీర్ఘకాలం అనేక యుద్ధాలు చేస్తూ మూడువందల కోటలను తన ఆధీనంలో ఉంచుకుని, లక్షమంది సైన్యాన్ని తయారు చేసిన శివాజీ కొండలపై సాంకేతిక విలువలతో శత్రుదుర్భేధ్యమైన కోటలను నిర్మించడంలో ప్రపంచఖ్యాతిని సొంతం చేసుకున్నాడు. నాసిక నుంచి మద్రాసు వరకు 1200 కిలోమీటర్ల మధ్య 300 కోటలు నిర్మించాడు. తన సామ్రాజ్యంలో అన్ని మతాల వారిని సమానంగా చూసిన ఆయన అనేక దేవాలయాలతో పాటు మసీదులను కూడా నిర్మించాడు. మతసామరస్యానికి ప్రతీకగా సాగిన శివాజీ పరిపాలన ను ఉదాహరించవచ్చు. ఏప్రిల్ 3, 1680న శివాజీ మరణం తరువాత ఆయన కుమారుడు శంభాజీ రాజ్యాపాలన బాధ్యతలు చేపట్టి తండ్రికి తగ్గ తనయుడిగా మొగల్లను ఎదుర్కొన్నారు. జనరంజకంగా పరిపాలన సాగించాడు.

## మెదక్ కలెక్టర్ కుజైలు శిక్ష నాలుగు వారాల గడువు సంచలనంగా మారిన వైనం

మెదక్ కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించారంటూ మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ కు హైకోర్టు జైలు శిక్ష విధించడం సంచలనంగా మారింది. చేగుంట మండలం బోనాల గ్రామానికి చెందిన లక్ష్మి అనే మహిళ భూమి వివరాల కేసును పరిష్కరించాలని కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇరుపక్షాలకు నోటీసులు జారీ చేసి భూ సమస్యను పరిష్కరించాలని హైకోర్టు కలెక్టర్ రాహుల్ రాజ్ ను ఆదేశించింది. సమస్యను పరిష్కరించకుండా గతంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలను పట్టించుకోలేదంటూ లక్ష్మి కోర్ట్ ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ పై విచారించిన హైకోర్టు ఉద్దేశపూర్వకంగా కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించారని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ కు ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ. 2వేల జరిమానా విదిస్తూ హైకోర్టు తీర్పు వెలువరించింది. తరువాత తీర్పు అమలును నాలుగు వారాలపాటు నిలిపివేసింది.

# జిల్లాలోని గనుల నిర్వహణపై దృష్టి సారించాలి: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి




కడప, ఫిబ్రవరి 18(భారత శక్తి) : జిల్లా ఆర్థిక అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న గనుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మైనింగ్ అధికారులను ఆదేశించారు.

రాష్ట్ర సచివాలయం నుండి రాష్ట్రంలోని వివిధ రకాల ఖనిజ వనరుల లభ్యత, గనుల నిర్వహణ సంబంధిత అంశాలపై.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సంబంధిత కార్యదర్శులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్టేట్ లెవెల్ కో ఆర్డినేషన్ కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తోపాటు జిల్లా అటవీ శాఖ అధికారి వినీత్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్.. ప్రస్తుతం జిల్లాలో నిర్వహణలో ఉన్న ప్రధాన ఖనిజ నిక్షేపాలు, గనుల స్థితి గురించి రాష్ట్ర సీఎస్ వారికి వివరించారు.

సిఎస్ వీసీ ముగిసిన అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి సూచనల మేరకు జిల్లాలో జిల్లాలో ఖనిజ వనరులు, మైన్స్ నిర్వహణ బ్లాకుల్లో జరిగిన, జరుగుతున్న అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు.

జిల్లాలో అపారమైన ఖనిజ నిక్షేపాలు ఉన్నాయని, వాటిని జిల్లా ఆర్థిక వనరుగా సద్వినియోగం చేసుకోవడంలో ప్రత్యేక దృష్టి సారించాల్సిన బాధ్యత మైనింగ్ అధికారులపై ఉందన్నారు.

జిల్లాలోని ప్రధాన ఖనిజ వనరు అయిన యురేనియం బ్లాక్స్ లోని తుమ్మలపల్లె (1 & 2), కనంపల్లి లతో పాటు ఇనుప ఖనిజం బ్లాక్ లోని మిన్నయ్యగారిపల్లె (జూ) మైన్స్ కు సంబంధించి విస్తరణలో భాగంగా.. రెవెన్యూ మరియు అటవీ భూముల రికార్డుల మధ్య వ్యత్యాసం గురించి మాట్లాడుతూ రెవెన్యూ, అటవీ భూమి రికార్డుల ప్రకారం మైన్స్ కేటాయింపు స్థలాలు యొక్క విస్తీర్ణం చట్టబద్ధంగా కొనసాగేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ విషయంలో రెవెన్యూ, అటవీ శాఖల సమన్వయం, సహకారంతో ఆవశ్యకమైన భూ రికార్డు ధృవపత్రాల జారీకి చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తమదృష్టికి తీసుకురావాలన్నారు.

ఈ కార్యక్రమంలో మైన్స్ డిడి సుబ్రమణ్యం, మైన్స్ విజిలెన్స్ ఇన్స్పెక్టర్ కృష్ణ మూర్తి, పరిశ్రమల శాఖ జీఎం చాంద్ బాషా, రాయల్టీ ఇన్స్పెక్టర్ లు ఫారెస్ట్, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మాతా శిశు మరణాల నివారణ కు చర్యలు: జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి




వై ఎస్ ఆర్ కడప,ఫిబ్రవరి 18(భారత శక్తి):

జిల్లా లో మాతా శిశు మరణాల నివారణ కు గైనకాలజిస్ట్ డాక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు..బుధవారం జిల్లా సచివాలయం లోని పి జి ఆర్ ఎస్ హాల్ నందు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి మెటర్నల్ డెత్ సర్వేలెన్స్ అండ్ రెస్పాన్స్ కమిటీ సమీక్షా సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ జిల్లా లో మాతా శిశు మరణాల నివారణ కు గైనకాలజిస్ట్ డాక్టర్లు లు ప్రత్యేక శ్రద్ధ పెట్టి పని చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గర్భిణీ ల ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని,అంగన్వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం అందించడం ద్వారా సుఖ ప్రసవాలను ప్రోత్సహిస్తున్నదని తెలిపారు.అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో మరియుప్రైవేట్ఆసుపత్రులలో సుఖ ప్రసవాలను ప్రోత్సహించాలన్నారు. ఇందుకుగాను జిల్లాలోని గైనకాలజిస్టు డాక్టర్స్ అందరికీ ఒకరోజు అవగాహన సదస్సు ను నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని డిఎం అండ్ హెచ్ ఓ ను జిల్లా కలెక్టర్ ఆదేశించారు..మెటర్నల్ డెత్ విషయంలో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టడం జరుగుతుందని, బాధ్యులైన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.ప్రైవేటు ఆసుపత్రులలో సుఖప్రసవాల కంటే సిజేరియన్ల ఆపరేషన్లు ఎక్కువగా జరుగుతోందని అందుగల కారణాలను సమావేశంలో సమీక్షించారు.జిల్లాలో మెటర్నల్ డెత్ శాతం తగ్గుతోందని ,2025 మార్చి నుండి ఇప్పటివరకు ఎనిమిది డెత్ లు జరిగాయని, ఈ డెత్ లకు గల కారణాలను కేసుల వారీగా సంబంధిత డాక్టర్లు సిబ్బందితో కలిసి కమిటీ సమీక్షించింది. ఈ సమావేశంలో డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ నాగరాజు, డి ఐ ఓ డా.ఉమామహేశ్వర కుమార్,జి జి హెచ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లరావు,కమిటీ సభ్యులు డి సి హెచ్ ఎస్ డా. హిమదేవి,డా.కే లక్ష్మీ సుశీల డాక్టర్ సునీల్, డాక్టర్ యాదవేంద్ర రెడ్డి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణలో ప్రమాణ స్వీకారం చేసిన మున్నూరుకాపు సోదరి,సోదరులకు శుభాకాంక్షలు



ఖమ్మం బ్యూరో, భారత శక్తి, ఫిబ్రవరి 18:

ఖమ్మం జిల్లా ఖమ్మం పట్టణ రాపర్తి నగర్ జిల్లా కాంగ్రెస్ నాయకులు, తెలంగాణ మున్నూరుకాపు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శెట్టి రంగారావు మాట్లాడుతూ ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో ఏడు కార్పొరేషన్లకు, 116 మున్సిపాలిటీలకు జరిగిన ఎన్నికలలో మున్నూరు కాపు కుల బాంధవులు సోదరీ, సోదరులుగా గెలుపొందిన అభ్యర్థులు మేయర్లు,డిప్యూటీ మేయర్లు ,కార్పొరేటర్లు, మున్సిపల్ చైర్మన్లు ,వైస్ చైర్మన్లు , కౌన్సిలర్లు గా ప్రమాణ స్వీకారం చేసిన వారందరికీ పేరుపేరునా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసిన శెట్టి రంగారావు.

మేయర్లుగా :

1)కరీంనగర్ - కొలగాని శ్రీనివాస్

2)మంచిర్యాల - ధర్ని మధుకర్

చైర్మన్లుగా :

1)గజ్వేల్ - గంగిశెట్టి చందన రవీందర్.

2)బెల్లంపల్లి - దావ స్వాతి రమేష్.

3)జగిత్యాల - సమింద్ల వాణి శ్రీనివాస్.

4)భైంసా -తుమ్మెల్ల దత్తాత్రి.

5)నిర్మల్-అప్పాల కావ్య గణేష్.

6)మెదక్- కానుగ రాధిక.

7)నాగర్ కర్నూల్- తీగల సునీంద్ర.

8)చెన్నూరు- పెద్దింటి పద్మ శ్రీనివాస్.

9)బాన్సువాడ- కాసుల విజయ బాలరాజు.

10ములుగు- చింతనిప్పుల చంద్రకళ.

11)వేములవాడ- పుల్కాం రాజు.

12)పెద్దపల్లి -నుగిళ్ళ మల్లన్న.

13)ఆదిలాబాద్- బండారి అనూష సతీష్.

14)కోస్గి - నాగులపల్లి నరేందర్.

15)తాండూర్ - పట్లోళ్ల నీరజ.

16)భీంగల్ - బోదిరే నాగమణి.

పైన ఉన్న మన మున్నూరు కాపు కులస్తులు మరియు ఇంకా మిగిలిన నాలుగు ఐదు కొన్ని పెండింగ్లో ప్రమాణ స్వీకారం ఉన్నా కార్పొరేషన్ చైర్మన్లు గా మరియు మున్సిపల్ చైర్మన్ లు గా ఎన్నుకోబడేది ఉన్న వారందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను అని ఈ సందర్భంగా శెట్టి రంగారావు సంతోషం వ్యక్తం చేశారు.

# ములుగు జిల్లాలో కాంగ్రెస్ కలకలం మొదలైంది. మాజీ సర్పంచ్ బండారు హరినాథం సస్పెన్షన్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాజీనామా





ములుగు జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 18(భారత శక్తి): ములుగుమున్సిపాలిటీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచే కాంగ్రెస్ పార్టీలో కలకలం మొదలై అంతర్గత విభేదాలు తీవ్రరూపం దాల్చాయి. ముఖ్యంగా మున్సిపల్ చైర్మన్ పదవి బీసీ మహిళకు రిజర్వ్ కావడంతో, ఆ పదవిని లక్ష్యంగా చేసుకున్న నాయకులు, వారి కుటుంబాలు, అనుచరుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. వార్డు అభ్యర్థుల ఎంపిక దశ నుంచే చైర్మన్ పీఠంపై రాజకీయ సమీకరణాలు మొదలై, ఎన్నికల వరకు కొనసాగినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ వార్డు అభ్యర్థులను ఖరారు చేసే దశలోనే చైర్మన్ రేసులో ఉన్న వర్గాల మధ్య పోటీ తీవ్రతరమైంది. బీసీ మహిళా అభ్యర్థుల పేర్లు తెరపైకి రావడంతో వారి అనుచరులు, ఆర్థికంగా బలమైన వర్గాలు తమ తమ మద్దతు సమీకరణాలను కుదుర్చుకున్నాయి. ఒకే పార్టీలో ఉండి ప్రత్యర్థి వర్గానికి చెందిన అభ్యర్థులు గెలవకుండా అడ్డుకునేందుకు ప్రయత్నాలు జరిగాయన్న తీవ్ర ఆరోపణలు వినిపించాయి. కొన్ని వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులే ప్రత్యర్థి పార్టీలకు పరోక్షంగా సహకరించారన్న పలు విషయాలపై పార్టీ అంతర్గతంగా చర్చ చెలరేగింది. మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం కాంగ్రెస్ పార్టీ అంతర్గతంగా సమీక్ష కొనసాగిస్తోంది. పార్టీకి నష్టం జరిగిన ప్రాంతాలు, ప్రత్యర్థి వర్గాలకు సహకరించిన నేతలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మరికొన్ని క్రమశిక్షణ చర్యలు తీసుకునే అవకాశమున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ములుగు మున్సిపాలిటీ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీలోని అంతర్గత విభేదాలను బహిర్గతం చేయగా, పార్టీ క్రమశిక్షణను కట్టుదిట్టం చేసే దిశగా నాయకత్వం కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నట్లు తాజా పరిణామాలు స్పష్టంచేసాయి.

మాజీ సర్పంచ్ బండారు హరినాథం సస్పెన్షన్, మల్లంపల్లి మాజీ సర్పంచ్ గోల్కొండ రవి, రాజీనామా

ఈ పరిణామాల నేపథ్యంలో ములుగు పట్టణానికి చెందిన మాజీ సర్పంచ్ బండారు హరినాథంను కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ చేస్తూ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్ ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించిన ఎవరినైనా ఉపేక్షించబోమని ఆయన స్పష్టం చేశారు. పార్టీని దెబ్బతీయడం అంటే కుటుంబాన్ని దెబ్బతీయడమేనని, క్రమశిక్షణ విషయంలో రాజీపడబోమని, కాంగ్రెస్ పార్టీలో సిద్ధాంతాలు, నియమ నిబంధనలు ఉంటాయని వాటికి కట్టుబడి ఉన్నవారే వాటిలో కొనసాగుతారని ఆయన అన్నారు.

# ప్రపంచ పెట్టుబడుల కేంద్రంగా మారిన హైదరాబాద్: టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి




సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 18:

మంగళవారం హెచ్ఐసిసి లో నిర్వహించిన "బయో ఏషియా 2026" ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు, టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ 23 సంవత్సరాల క్రితం బయోఏషియా ప్రారంభమైనప్పుడు, హైదరాబాద్ అంటే చార్మినార్, బిర్యానీ, ఔషధ తయారీ ,సాఫ్ట్వేర్ నగరం అన్న గుర్తింపు ఉండేదన్నారు.


ఈ రోజు, హైదరాబాద్ ప్రపంచ వ్యాక్సిన్ తయారీ కేంద్రంగా నిలిచిందని వివరించారు.

దూరదృష్టి గల నాయకత్వం, స్పష్టమైన విధానాలు, నైపుణ్యంతో కూడిన మానవ వనరులు, ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలు --- ఈ బలాల ఆధారంగా హైదరాబాద్ గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లకు, పరిశోధన, డిజైన్లో విశిష్టతకు ప్రపంచ కేంద్రంగా ఎదిగింది.

గత రెండు సంవత్సరాల్లోనే, జీవవిజ్ఞాన రంగంలో ?73,000 కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయన్నారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ

"ఫార్మా రాజధానిగా పేరొందిన హైదరాబాద్ ను "ల్యాబొరేటరీ ఆఫ్ ది ఫ్యూచర్" గా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. 2030 నాటికి లైఫ్ సైన్సెస్ రంగంలో 25 బిలియన్ డాలర్ల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకొచ్చి... కొత్తగా 5 లక్షల మంది యువతకు ఉపాధి అవకాశాలను కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ బయో ఏషియా 2026 వంటి సదస్సు లు హైదరాబాద్ కేంద్రంగా జరగడం మనకు గర్వ కారణమన్నారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ల సమిష్టి కృషి తో ప్రపంచ పెట్టుబడుల కేంద్రంగా హైదరాబాద్ మారిందన్నారు. ప్రపంచ స్థాయి నగరంగా హైదరాబాద్ నిలిచేందుకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

# ఉపాధి హామీ పనులను పరిశీలించిన జిల్లా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) ఫిబ్రవరి 18: సదాశివ నగర్ మండలం తిర్మన్ పల్లి పరిధిలో భూగర్భ జలాల సంరక్షణ లక్ష్యంగా ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న కాంటూరు కందకాల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ బుధవారం ప్రత్యక్షంగా పరిశీలించారు.గ్రామ శివారులో సాగుతున్న కాంటూరు కందకాల తవ్వకాలు భూగర్భ జలాల నిల్వలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. పనుల నాణ్యత, కొలతలు, సాంకేతిక ప్రమాణాల అమలు వంటి అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. నిర్దేశిత ప్రమాణాల ప్రకారం పనులు పూర్తిచేయాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్న కార్మికులకు తాగునీరు, నీడ, ప్రాథమిక వైద్య సదుపాయాలు తదితర వసతులపై ఆరా తీశారు. కార్మికులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలనే దిశగా అధికారులకు సూచనలు ఇచ్చారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులు గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరుల అభివృద్ధికి తోడ్పడటమే కాకుండా, స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. అధికారులు సమన్వయంతో పనిచేసి పనులను వేగవంతంగా, నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిఆర్ డిఓ సురేందర్, ప్రత్యేక అధికారి సతీష్, డిఎల్ పీఓ, మండల స్థాయి అధికారులు, సాంకేతిక సిబ్బంది గ్రామ సర్పంచ్ లాల్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులను పరిశీలించిన జిల్లా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) ఫిబ్రవరి 18: సదాశివ నగర్ మండలం తిర్మన్ పల్లి పరిధిలో భూగర్భ జలాల సంరక్షణ లక్ష్యంగా ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న కాంటూరు కందకాల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ బుధవారం ప్రత్యక్షంగా పరిశీలించారు.గ్రామ శివారులో సాగుతున్న కాంటూరు కందకాల తవ్వకాలు భూగర్భ జలాల నిల్వలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. పనుల నాణ్యత, కొలతలు, సాంకేతిక ప్రమాణాల అమలు వంటి అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. నిర్దేశిత ప్రమాణాల ప్రకారం పనులు పూర్తిచేయాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్న కార్మికులకు తాగునీరు, నీడ, ప్రాథమిక వైద్య సదుపాయాలు తదితర వసతులపై ఆరా తీశారు. కార్మికులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలనే దిశగా అధికారులకు సూచనలు ఇచ్చారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులు గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరుల అభివృద్ధికి తోడ్పడటమే కాకుండా, స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. అధికారులు సమన్వయంతో పనిచేసి పనులను వేగవంతంగా, నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ డిఆర్ఓ సురేందర్, ప్రత్యేక అధికారి సతీష్, డిఎల్ పీఓ, మండల స్థాయి అధికారులు, సాంకేతిక సిబ్బంది గ్రామ సర్పంచ్ లాల్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

# తిర్మన్ పల్లి గ్రామంలోని చౌక ధరల దుకాణాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) ఫిబ్రవరి 18: సదాశివ నగర్ మండలం తిర్మన్ పల్లి గ్రామంలోని చౌక ధరల దుకాణాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా రేషన్ దుకాణంలో బియ్యం నిల్వలు, పంపిణీ విధానం, స్టాక్ రిజిస్టర్ , విక్రయ రికార్డులను పరిశీలించారు.

వంపిణీ ప్రక్రియలో పారదర్శకత పాటించాలని, బియ్యం కొరత లేకుండా సమయానికి అందుబాటులో ఉంచాలని,ప్రజలకు అందుతున్న పౌర సరఫరా సేవలు సమర్థవంతంగా అమలవ్వాలని, ఎటువంటి నిర్లక్ష్యం వహించరాదని కలెక్టర్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో డిఎమ్ శ్రీకాంత్, సంబంధిత శాఖ అధికారులు, మండల సిబ్బంది పాల్గొన్నారు.


# భళా.!ఇనుగుర్తి హై స్కూల్..

## సీఎం కప్ రాష్ట్ర స్థాయికి ఆరుగురు ఎంపిక




మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి,ఫిబ్రవరి 18 (భారత శక్తి):ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సీఎం కప్ క్రీడా పోటీలలో మహబూబాబాద్ జిల్లా ఇనుకుర్తి మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ స్టూడెంట్స్ సత్తా చాటారు. జిల్లా స్థాయి పోటీలలో అసాధారణ ప్రతిభ కనపరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఆరుగురు ఎంపికయ్యారు.వాలీబాల్ క్రీడలో చిదిరాల వివేక్ అద్భుతమైన ప్రతిభ కనబరచి స్టేట్ లెవల్ కు సెలెక్టయ్యాడు. సాఫ్ట్ బాల్ పోటీలో గర్ల్స్ విభాగం నంగునూరు భార్గవి,బి.నిహారిక,బొల్లు సహస్ర. బాలుర విభాగంలో జాటోతు అజయ్,గుగులోతు రాము ఉత్తమ క్రీడా ప్రతిభను కనబరిచి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారు.ఇనుగుర్తి మండలం నుంచి ఆరుగు రు సెలెక్ట్ కావడం పట్ల మండలంలో పలువురు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎంపీడీవో బండారు పార్థసారథి, ఎంఈఓ జంగారూపారాణి సంబంధిత క్రీడాకారులను అభినందిస్తూ రాష్ట్రస్థాయిలో సైతం రాణించాలని ఆకాంక్షించారు. సీఎం క్రీడా పోటీలలో అసాధారణ ప్రతిభ కనపరచడానికి కారణమైన ఇనుగుర్తి జడ్పీహెచ్ఎస్ ఫిజికల్ డైరెక్టర్ తాళ్ల ప్రణయ్ ను ప్రశంసించారు. నిరంతరం క్రీడాకారులను పలు ఆటలలో ప్రేరేపిస్తూ,శిక్షణ ఇస్తూ, ప్రోత్సహిస్తూ సూచనలిస్తూ ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్న ప్రణయ్ కృషి అభినందనీయమని కితాబిచ్చారు. ఈ సందర్భంగా టిడిపి మాట్లాడుతూ విద్యార్థుల పట్టుదల,హెచ్ఎం ఉపాధ్యాయ బృందం, పేరెంట్స్ ప్రోత్సాహంతో తాను నిరంతరం స్టూడెంట్స్ క్రీడా భవితకు పాటుపడుతున్నట్లు తెలిపారు.

# ఎస్.ఐ.ఆర్ అమలులో స్పష్టమైన పురోగతి సాధించాలి: జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య



సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 18:

ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్) ప్రక్రియను ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో సమర్థవంతంగా అమలు చేసి, స్పష్టమైన పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ వీసీ హాల్ నుండి ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, బీఎల్ఓ సూపర్వైజర్లతో ప్రి--ఎస్.ఐ.ఆర్ పురోగతిపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రం వారీగా పురోగతిని పరిశీలించిన కలెక్టర్, పనితీరులో వెనుకబడి ఉన్న ఆయా ఏఈఆర్ఓ లను కారణాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 51.96 శాతం మాత్రమే ఓటర్ మ్యాపింగ్ పూర్తయిందని,ప్రత్యేకంగా అర్బన్ సెగ్మెంట్లో పురోగతి తక్కువగా ఉన్నందున డోర్ టు డోర్ సందర్శనల ద్వారా ఓటర్ మ్యాపింగ్ వేగవంతం చేసి, పది రోజుల్లో కనీసం 85 శాతం పురోగతి సాధించాలని ఆదేశించారు. ఈ విషయంలో ఈఆర్ఓలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

తక్కువ పురోగతి ఉన్న బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్వైజర్లతో చర్చించి సమస్యను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ఏఈఆర్ఓలు వారం రోజుల పాటు ప్రతిరోజూ మూడు ప్రాంతాల్లో ఆకస్మిక క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించి, రోజువారీ సమీక్ష చేయాలని స్పష్టం చేశారు.పనితీరు సంతృప్తికరంగా లేని బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్వైజర్లపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓటర్ మ్యాపింగ్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, కొత్తగా విలీనం అయిన ప్రాంతాలు, కాలనీలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. డెమోగ్రాఫిక్ సిమిలర్ ఎంట్రీస్కు సంబంధించిన పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్లు మాధురి, పాండు, ఆర్డీఓ రాజేందర్, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, బీఎల్ఓ సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆకాంక్షలను నెరవేర్చండి: మున్సిపల్ కాంట్రాక్టర్ అబేద్ పాషా



సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 18:

సంగారెడ్డి మున్సిపల్ నూతనంగా ఎన్నికైన మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ షఫీ, కౌన్సిలర్ నవాజ్,మహేష్,వంశీ పాలకవర్గ సభ్యులను కాంట్రాక్టర్ రియల్ ఎస్టేట్ వ్యాపారి మహమ్మద్ అబేద్ పాషా ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సాయంత్రం ఆయన నివాసంలో జరిగిన కార్యక్రమంలో అబేద్ పాషా మాట్లాడుతూ... అందరి సహకారంతో మున్సిపాలిటీని అభివృద్ధిలోకి తీసుకెళ్లేలా పాలకవర్గ సభ్యులు కృషి చేయాలన్నారు. ప్రజల ఆకాంక్షల మేరకు పరిపాలన సాగించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలని కోరారు. వార్డులలో మౌలిక వసతుల అభివృద్ధికి అంకిత భావంతో పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి నాయకత్వంలో పట్టణ అభివృద్ధికి అన్నివేళలా అండగా ఉంటామని పాలకవర్గ సభ్యులు పేర్కొన్నారు. నమ్మకంతో గెలిపించిన ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ పట్టణ అభివృద్ధికి పాటుపడతామన్నారు. త్రాగునీరు డ్రైనేజీ వీధి దీపాలు రోడ్లు తదితర అంశాలకు సంబంధించి సత్వర చర్యలు తీసుకునేలా ముందుకెళ్తామన్నారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

# టెన్త్ లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళిక అమలు చేయాలి

## -విద్యార్థులందరిని సమీప ప్రభుత్వ జూనియర్ కళాశాలతో అనుసంధానం చేయాలి: కలెక్టర్ జితేష్ వి. పాటిల్



భద్రాద్రి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 18 (భారతశక్తి): జిల్లా వ్యాప్తంగా ఉన్న టెన్త్ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికను అమలు చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. పదో తరగతి ఉత్తీర్ణత శాతం పెంపు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాల పెంపు, పాఠశాలల్లో త్రాగునీటి, మరుగుదొడ్ల సౌకర్యాల మెరుగుదల తదితర అంశాలపై బుధవారం ఐడీఓసీ కార్యాలయంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి అదనపు కలెక్టరు డి వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మితో కలిసి ఎంఈఓలు, ఏపీఎంలు, సంబంధిత శాఖల అధికారులతో జూమ్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత విద్యా సంవత్సరపు ఫలితాల విశ్లేషణలో గణితం, సైన్స్, తెలుగు విషయాలలో విద్యార్థులు వెనుకబడినట్టు గమనించామని తెలిపారు. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ప్రీ-ఫైనల్ పరీక్షల ఫలితాల ఆధారంగా చదువులో వెనుకబడిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు రెండు రోజుల్లో గుర్తించి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. గ్రామ స్థాయిలో మహిళా సమాఖ్య సభ్యులు కూడా విద్యార్థుల విజయంలో భాగస్వాములు కావాలని, అవసరమైతే వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించాలని తెలిపారు. సాయంత్రం నిర్వహించే స్టడీ అవర్స్ను వీఓఏ లు పర్యవేక్షించాలని సూచించారు. ఆకాంక్షిత విద్యార్థుల కోసం ప్రత్యేక ప్రశ్నాపత్రాలు, పాఠ్యసామగ్రిని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సిద్ధం చేసి అందించాలని తెలిపారు. బాలికలతో పోలిస్తే బాలుర ఉత్తీర్ణత శాతం తక్కువగా ఉన్న నేపథ్యంలో వారి హాజరు శాతం పెంపునకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రతి పదో తరగతి విద్యార్థిని సమీప ప్రభుత్వ జూనియర్ కళాశాలతో అనుసంధానం చేయాలని, అందుబాటులో ఉన్న కోర్సులు, సౌకర్యాల వివరాలతో కరపత్రాలు పంపిణీ చేయాలని సూచించారు. పేద కుటుంబాల విద్యార్థులు ప్రైవేట్ కళాశాలల్లో చేరి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనకుండా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనే ప్రవేశాలు పొందేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో త్రాగునీటి సౌకర్యాలు సమృద్ధిగా ఉండేలా చూడాలని, మిషన్ భగీరథ అధికారులతో సమన్వయం చేసుకొని అవసరమైన మరమ్మత్తులు తక్షణమే పూర్తి చేయాలన్నారు. బాలికల మరుగుదొడ్లు లేని పాఠశాలలు ఏవీ ఉండకూడదని స్పష్టం చేస్తూ త్రాగునీటి, మరుగుదొడ్ల మరమ్మత్తులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 30 సంవత్సరాల లోపు పదో తరగతి, ఇంటర్, ఐటీఐ ఉత్తీర్ణుల వివరాలు, వారు ప్రస్తుతం నిర్వహిస్తున్న ఉపాధి/వృత్తి సమాచారంతో వీఓఏ లు సమగ్ర నివేదిక రూపొందించి సమర్పించాలని సూచించారు. నిరుద్యోగ యువతను గుర్తించి వారికి నైపుణ్య శిక్షణ కల్పించి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా చర్యలు చేపడతామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్, విద్యాశాఖ కోఆర్డినేటర్ సతీష్ సంబంధిత శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పూరి గుడిసెలో అగ్ని ప్రమాదం

తిరువూరుతిరువూరు పట్టణం బైపాస్ రోడ్ పశువుల సంత లో గ్యాస్ లీకై పూరి గుడిసె హోటల్ పూర్తి గా దగ్ధం అయింది. కొంత నగదు, చిన్నపాటి వస్తువులు అగ్ని ఆహుతి కి కాలి బూడిదైయ్యాయి. తిరువూరు పశువుల సంత లో నెక్కడుపు విజయ కుమారి చిన్నపాటి హోటల్ ఏర్పాటు చేసుకొని గత 30 ఏళ్లుగా టిఫిన్ సదుపాయాన్ని కల్పిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం టిఫిన్ ఏర్పాటు సమయంలో గ్యాస్ లీక్ అవడంతో మంటలు అంటుకోవడంతో పాక అంటుకుపోయింది

# దుండిగల్ జిహెచ్ఎంసి సర్కిల్ కార్యాలయంలో ఏసిబి దాడులు

మేడ్చల్కుత్బుల్లాపూర్ దుండిగల్ జిహెచ్ఎంసి సర్కిల్ కార్యాలయంలో ఏసిబి రైడ్స్ నిర్వహించింది. డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ ఛాంబర్ లో ఏసీబీ అధికారులు తనిఖీలు చేస్తున్నారు.

# సినిమా

## అవమానించారు

టాలీవుడ్‌లో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా మొదలై, ఇప్పుడు మినిమం గ్యారెంటీ హీరోగా ఎదిగిన నటుడు సుహాస్. ప్రజంట్ 'హే బల్వంత్' మూవీతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. శివాని నాగారం హీరోయిన్ గా నటిస్తున్న ఈ మూవీ ఫిబ్రవరి 20వ తేదీన థియేటర్లలో రిలీజ్ కాబోతోంది. కామెడీ నేపథ్యంలో వస్తున్న ఈ సినిమాపై అంచనాలు భారీగానే ఉన్నాయి. అయితే తాజాగా ఈ మూవీ ఈవెంట్ లో తన కెరీర్ మొదట్లో ఎదురైన ఒక చేదు అనుభవాన్ని గుర్తుచేసుకున్నాడు. కెరీర్ తొలినాళ్లలో అవకాశాల కోసం తిరుగుతున్నప్పుడు, ఒక పెద్ద సినిమాలో హీరోయిన్‌కు క్లోజ్‌గా ఉండే క్యారెక్టర్ ఉందని పిలిచారు. తీరా అక్కడికి వెళ్ళాక ఆ పాత్ర గురించి వివరించిన తీరు, నను చూసిన విధానం చాలా అవమానకరంగా అనిపించింది. ఆ క్షణం బాధ అనిపించినా, నా కష్టంపై నమ్మకంతో ముందడుగు వేశా. కానీ కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు అన్నట్టుగా.. ఒకప్పుడు హీరోయిన్ పక్కన చిన్న రోల్ కోసం పిలిచి అవమానించిన ఇండస్ట్రీలో, ఇప్పుడు అదే స్టార్ హీరోయిన్ పక్కన సమానమైన గుర్తింపు ఉన్న పాత్రలో నటించా అని చెప్పాడు. ఈ పరిణామం సుహాస్ అభిమానులకు ఎంతో స్ఫూర్తినిచ్చింది.





## నేను అందంగా లేను



రొమాంటిక్ కామెడీ దో దివానే షహర్ మే ప్రమోషన్ సందర్భంగా నటి మృణాల్ ఠాకూర్ తన మనసులోని భావాలను పంచుకుంది. సినిమాలో తన పాత్ర "నేను అందంగా లేను" అని చెప్పే డైలాగ్ తన జీవితానికి చాలా దగ్గరగా అనిపించిందని తెలిపారు. చిన్ననాటి నుంచి పోలికలు, తక్కువచూపు కారణంగా చాలామంది అమ్మాయిలే కాదు అబ్బాయిలూ ఆత్మవిశ్వాసం కోల్పోతారని, అదే అనుభూతి తనకూ ఉందని చెప్పారు. ఈ కారణంగానే సినిమాకు వెంటనే అంగీకరించానని వెల్లడించింది. ఆ డైలాగ్‌ను అభిమానులు 'జోక్'గా చూస్తున్నారన్న వ్యాఖ్యలకు స్పందిస్తూ, "వాళ్లు నన్ను ఎలా చూస్తారో అది వేరు, నేను నన్ను ఎలా చూస్తానో అది వేరు" అంటూ నవ్వారు. 2025 వరకూ తన రూపంపై పూర్తి నమ్మకం లేదని, అప్పటి బ్యూటీ ప్రమాణాలకు తాను సరిపోనన్న భావన వెంటాడిందని చెప్పింది. కాలంతో పాటు అందం నిర్వచనం మారిందని వ్యాఖ్యానించారు. తాను నటుడు ధనుష్ తో డేటింగ్ లో ఉన్నానని, పెళ్లి కూడా చేసుకోబోతున్నట్టు వచ్చిన వార్తలు ఆమె ఖండించింది. తాను ఎలాంటి వ్యాఖ్యలు చేయకపోయినా తన పేరుతో మాటలు అంటగట్టారని, అది భయంగా అనిపించిందన్నారు. ఇద్దరూ కలిసి కనిపించడంతో డేటింగ్ రూమర్లు వినిపిస్తున్నా, ఈ విషయంలో అధికారిక ప్రకటన ఏదీ లేదని స్పష్టం చేశారు.

## మార్చి 6న 'సాంప్రదాయిని సుప్పినీ సుద్దపూసని'




ఒకప్పుడు తమ నటనతో తెలుగు ప్రేక్షకులను ఎంతగానో అలరించిన నటుడు శివాజీ, లయల జోడీ చాలా కాలం తర్వాత మళ్లీ వెండితెరపై సందడి చేయబోతోంది. వీరిద్దరూ ప్రధాన పాత్రలలో నటిస్తున్న కొత్త చిత్రం 'సాంప్రదాయిని సుప్పినీ సుద్దపూసని'. ఈ సినిమా మార్చి 6న థియేటర్లలో విడుదల కానున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ట్రైలర్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. కుటుంబం, పరిస్థితులు, నేరం, ఇన్వెస్టిగేషన్ అనే అంశాలతో సినిమా గ్రిప్పింగ్‌గా సాగుతుందని మేకర్స్ తెలిపారు. ఆద్యంతం వినోదంతో పాటు ఉత్కంఠను కూడా పంచేలా ఈ చిత్రం ఉండబోతోందని స్పష్టమవుతోంది. ఈ సినిమాకు మరో ప్రత్యేకత ఏమిటంటే, నటుడు శివాజీనే స్వయంగా నిర్మాతగా వ్యవహరించడం. శ్రీ శివాజీ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఆయనే ఈ చిత్రాన్ని నిర్మించారు. సుధీర్ శ్రీరామ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో అలీ, ధన్‌రాజ్, ప్రిన్స్, జబర్దస్త్ ఇమ్మాన్యుయేల్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. రంజిన్ రాజ్ సంగీతం అందిస్తున్నారు. చాలా ఏళ్ల తర్వాత శివాజీలయల కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి.

## ఇంకెంత కాలం!



భాగ్యశ్రీ బోర్సే.. ప్రస్తుతం టాలీవుడ్ లో బాగా వినిపిస్తున్న పేరు ఇది. ఈ అమ్మడి సినిమాలు అంతగా ఆడకపోయినా.. వరుసగా ఆఫర్స్ అందుకుంటోంది. ఇక 'మిస్టర్ బచ్చన్' తో లాంచ్ అయిన ఈ ముంబై బ్యూటీ కెరీర్ లో ఇంత వరకూ కమర్షియల్ గా ఒక్క హిట్ కూడా పడలేదు. అయినా టాలెంట్ సహా అందం, అభినయంతోనే అవకాశాలు అందుకుంటుంది. మిస్టర్ బచ్చన్, కింగ్‌డమ్, ఆంధ్రాకింగ్ తాలూకా ఇలా వరుసగా మూడు ఫ్లాపులతో హ్యాట్రిక్ నమోదు చేసింది. 'కాంత'తో కోలీవుడ్ డెబ్యూ అయినా అక్కడా నిరాశ తప్పలేదు. ప్రస్తుతం భాగ్యశ్రీ బోర్సే చేతిలో ఉన్నది ఒకే ఒక్క చిత్రం. అదే అక్కినేని అఖిల్ హీరోగా నటిస్తోన్న 'లెనిన్'. ఇప్పటికే రిలీజ్ అయిన ప్రచార చిత్రాలతో మంచి హైప్‌క్రియేట్ అయ్యింది. అఖిల్ కి కూడా ఇంత వరకూ సరైన హిట్ లేదు. 'లెనిన్' తో మంచి హిట్ అందుకుంటాడనే అంచనాలు బలంగా ఉన్నాయి. ఈ మూవీ సక్సెస్ అయితే ఇద్దరి కెరీర్ కలిసొస్తుంది. ముఖ్యంగా భాగ్యశ్రీ ఆశలన్నీ 'లెనిన్'పైనే పెట్టుకుంది. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి విజయం సాధిస్తేనే భాగ్యశ్రీకి మరిన్ని కొత్త చాన్స్‌లు వస్తాయని సినీ సర్కిల్స్‌లో వినిపిస్తోంది.

## గ్లోబల్ స్టార్ కాబోతున్న ప్రియమణి!



టాలీవుడ్ నుంచి బాలీవుడ్ కు వెళ్లిన ప్రియమణి... పలు వెబ్ సిరీస్ లలో కూడా నటిస్తూ బిజీగా ఉంటోంది. ఇప్పుడు హాలీవుడ్ మూవీలో నటించేందుకు సిద్ధమవుతోంది. ఇండోఅమెరికన్ చిత్రంలో ప్రియమణి ప్రధాన పాత్రకు ఎంపికయింది. బాలీవుడ్ నటుడు మోహిత్ రైనాతో కలిసి ఆమె ఈ అంతర్జాతీయ చిత్రంలో నటించబోతోంది. హర్ష్ మహదేశ్వర్ దర్శకత్వం వహించనున్న ఈ సినిమాను అమెరికాకు చెందిన రెడ్ బైసన్ ప్రొడక్షన్స్, ముంబైలోని అజూర్ ఎంటర్టైన్మెంట్ సంయుక్తంగా నిర్మించనున్నాయి. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా నిర్మాణ సంస్థలు అధికారికంగా ప్రకటించాయి. భారతీయ, అమెరికా సంస్కృతుల కలయికతో, ఒక వలస కుటుంబం ఎదుర్కొనే భావోద్వేగపూరిత ప్రయాణమే ఈ సినిమా కథాంశం. హాలీవుడ్ సూపర్ హిట్ సినిమాలకు పనిచేసిన అగ్రశ్రేణి సాంకేతిక నిపుణులు ఈ ప్రాజెక్ట్ కోసం పనిచేస్తుండటం గమనార్హం. ఈ సినిమా షూటింగ్ ఏప్రిల్ లో ప్రారంభం కానుంది.

## రజనీకాంత్ 'కొచ్చాడయాన్'కు ఏఐ హంగులు

సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా నటించిన మూవీ కొచ్చాడయాన్. 2014లో విడుదలైన ఈ యాక్షన్ అడ్వెంచర్ మూవీ బాక్సాఫీస్ వద్ద అభిమానులను ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోయింది. బాలీవుడ్ భామ దీపికా పదుకొణె ఇందులో హీరోయిన్‌గా కనిపించింది. మోషన్ క్యాప్చర్ టెక్నాలజీతో తెరకెక్కిన ఈ మూవీ అప్పట్లో విస్తృత చర్చకు దారి తీసింది. విజువల్స్ కార్టూన్ సినిమాను తలపిస్తున్నాయంటూ ప్రేక్షకుల నుంచి విమర్శలు, ట్రోల్స్ కూడా ఎదురయ్యాయి. అయితే తాజాగా ఈ మూవీకి సరికొత్త హంగులతో టీజర్ విడుదలైంది. ఏఐ సాయంతో రూపొందించిన ఈ టీజర్ తలైవా అభిమానులను ఆకట్టుకుంటోంది. అంతేకాదు, మొత్తం సినిమాన్నే ఏఐ టెక్నాలజీతో రీ జనరేట్ చేసే ప్రయత్నాలు సాగుతున్నట్లు సమాచారం. ఈ చిత్రానికి రజినీకాంత్ కూతురు సౌందర్య రజినీకాంత్ దర్శకత్వం వహించిన విషయం విదితమే.

## నిర్మాతగా మారిన నిత్యా మీనన్



దక్షిణాది చిత్ర పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న జాతీయ అవార్డు గ్రహీత, నటి నిత్యా మీనన్ నిర్మాతగా కొత్త ప్రయాణాన్ని ప్రారంభించారు. 'కీయురి ప్రొడక్షన్స్' పేరుతో తన సొంత నిర్మాణ సంస్థను మంగళవారం ప్రకటించారు. ఈ విషయాన్ని తన ఇన్‌స్టాగ్రామ్ పేజీ ద్వారా వెల్లడిస్తూ, ప్రొడక్షన్ హౌస్ లోగో వీడియోను పంచుకున్నారు. సినిమాలు తీయడమంటే కేవలం కథలు చెప్పడం మాత్రమే కాదని, మనుషులను లోతైన స్థాయిలో స్పృశించడం అని ఆమె పేర్కొన్నారు. "నటన ప్రారంభించిన తొలిరోజు నుంచి నా ఉద్దేశం ఇదే. ఇప్పుడు నిర్మాతగా కూడా అదే ఉద్దేశంతో కొనసాగుతాను. నాలోని సృజనాత్మక ప్రక్రియ ద్వారా, చూసేవారిలో ఒక పరివర్తన తీసుకురావడమే నా లక్ష్యం" అని తన పోస్టులో వివరించారు. భూమి గుహల నుంచి పుట్టి, రాతితో చెక్కబడిన, కాంతిని ప్రేమించే రూపం లేనిదే 'కీయురి' అని ఆమె వీడియోలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా తన తొలి తెలుగు చిత్రం 'అలా మొదలైంది' 15 ఏళ్లు పూర్తి చేసుకున్నప్పటి జ్ఞాపకాలను కూడా నిత్యా గుర్తుచేసుకున్నారు. అప్పట్లో తాము తీస్తున్న రొమాంటిక్ కామెడీని ఎవరూ అర్థం చేసుకోలేదని, షూటింగ్ తర్వాత ఇరానీ చాయ్ తాగుతూ సమయం గడిపేవాళ్లమని తెలిపారు. షూటింగ్ సమయంలో దర్శకురాలు నందిని రెడ్డి తనతో, "ఇకపై నువ్వు ఇలా స్వేచ్ఛగా రెస్టారెంట్లోకి వెళ్లలేవు" అన్నారని, ఆ మాటలు తనకు అప్పట్లో వింతగా అనిపించాయని చెప్పారు. చిన్న సినిమాలు చేసుకుంటూ స్వేచ్ఛగా ఉండాలనుకున్న తన జీవితాన్ని 'అలా మొదలైంది' పూర్తిగా మార్చేసిందని, ఇప్పుడు నిర్మాతగా అదే స్ఫూర్తితో ముందుకు వెళుతున్నానని ఆమె తన పోస్టులో పేర్కొన్నారు.

# రంజాన్ వేళ నగరం తళతళలాడాలి: జీహెచ్ఎంసీ కమిషనర్

*** చార్మినార్ జోన్‌లో పారిశుద్ధ్య పనుల క్షేత్రస్థాయి తనిఖీ**

హైదరాబాద్ ఫిబ్రవరి 18 (భారత శక్తి): రంజాన్ మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు పక్కాగా, ప్రభావవంతంగా జరిగేలా చూడాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య నిర్వహణను జోనల్, డిప్యూటీ కమిషనర్లు నిరంతరం పర్యవేక్షించాలని ఆయన స్పష్టం చేశారు. బుధవారం ఆయన అదనపు కమిషనర్ (సానిటేషన్) రవికిరణ్, జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి చార్మినార్ జోన్ పరిధిలోని మక్కా మసీదు, మదీనా, చార్మినార్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. పారిశుద్ధ్య నిర్వహణను క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు.



*** అధికారులకు కమిషనర్ జారీ చేసిన కీలక ఆదేశాలు:**

ప్రత్యేక నిఘా: రంజాన్ సందర్భంగా జనసంచారం విపరీతంగా పెరిగే అవకాశం ఉన్నందున, ప్రధాన రహదారులు, కూడళ్లు, ప్రార్థనా స్థలాల వద్ద ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలి.

* సిబ్బంది మోహరింపు: అవసరమైన చోట అదనపు సిబ్బందిని కేటాయించి, రూట్ మ్యాప్ ప్రకారం పని విభజన జరగాలి.
* రియల్ టైమ్ మానిటరింగ్: పారిశుద్ధ్య పనుల్లో నాణ్యతను పెంచేందుకు రియల్ టైమ్ మానిటరింగ్ వ్యవస్థను పటిష్టం చేయాలి.
* మార్కెట్లలో క్లీనింగ్: వాణిజ్య, మార్కెట్ ప్రాంతాల్లో చెత్త పేరుకుపోకుండా రాత్రిపూట కూడా ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలి.
* డ్రైనేజీల నిర్వహణ: డ్రైన్లు పొంగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి.

**సహకరించండి:**

నగరాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు పౌరులు, వ్యాపారులు పారిశుద్ధ్య సిబ్బందికి పూర్తిస్థాయిలో సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. ఈ పర్యటనలో చార్మినార్ డిప్యూటీ కమిషనర్ సరితతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మేం మళ్లీ అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ నేతలు వడ్డీతో సహా చెల్లించుకోవాల్సి ఉంటుంది: కేటీఆర్

హైదరాబాద్: ఫిబ్రవరి 18 భారతశక్తి : బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేయడంపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇది పూర్తిగా అక్రమ అరెస్ట్ అని, కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న అధికార దుర్వినియోగానికి పరాకాష్ఠ అని ఆయన మండిపడ్డారు. మంచిర్యాల జిల్లాలోని క్యాతన్‌పల్లి మున్సిపాలిటీని అడ్డదారుల్లో కైవసం చేసుకోవాలన్న దుర్మార్గపు ఆలోచనతోనే కాంగ్రెస్ ఈ కుట్రకు తెరలేపిందని కేటీఆర్ తీవ్రంగా ఆరోపించారు. కేవలం రాజకీయ లబ్ధి కోసం ఇంతటి దిగజారుడు రాజకీయాలకు పాల్పడటం సిగ్గుచేటని విమర్శించారు. ప్రజల ఆశీర్వాదంతో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని, అప్పుడు కాంగ్రెస్ పార్టీ నేతలు చేస్తున్న ఈ దుర్మార్గాలన్నింటికీ వడ్డీతో సహా చెల్లించుకోవాల్సి వస్తుందని కేటీఆర్ తీవ్ర స్వరంతో హెచ్చరించారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ నేతలు గుర్తుంచుకుంటే మంచిదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ స్పందిస్తూ... "క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్‌కు స్పష్టమైన మెజారిటీ ఉంది. అయినా సరే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి వివేక్ కలిసి దౌర్జన్యంగా దాన్ని చేజిక్కించుకోవాలని చూస్తున్నారు. ఈ కుట్రలో భాగంగానే సుమన్‌పై



అక్రమ కేసులు బనాయించి, ఇవాళ దుర్మార్గంగా అరెస్ట్ చేయించారు. ప్రభుత్వ అప్రజాస్వామిక చర్యలకు వ్యతిరేకంగా క్యాతన్‌పల్లి ప్రజలు సంపూర్ణ బంద్ పాటించి నిరసన తెలిపినా ఈ ప్రభుత్వానికి బుద్ధి రాలేదు" అని విమర్శించారు. కొందరు పోలీసు అధికారులు అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. వారు తమ వైఖరి మార్చుకోకపోతే భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అక్రమ కేసులో అరెస్ట్ చేసిన బాల్క సుమన్‌ను ప్రభుత్వం తక్షణమే బేషరతుగా విడుదల చేయాలని బీఆర్ఎస్ పార్టీ తరపున ఆయన డిమాండ్ చేశారు.

## పౌర సేవలకు 'మైక్యూర్' భరోసా

*** జీహెచ్ఎంసీ సేవలు ఇక ఒకే వేదికపైకి**

*** పాత యాప్ స్థానంలో కొత్త అప్లికేషన్ ప్రారంభం**

*** ఫిర్యాదుల పరిష్కారంలో పారదర్శకతే లక్ష్యం.**






హైదరాబాద్: ఫిబ్రవరి 18 భారతశక్తి : భాగ్యనగర వాసుల ముంగిటకే పౌర సేవలను చేరవేసే లక్ష్యంతో బృహత్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) మరో ముందడుగు వేసింది. సాంకేతికతను జోడించి పౌర సమస్యల పరిష్కారానికి సరికొత్త వేదికను సిద్ధం చేసింది. ఇప్పటి వరకు అందుబాటులో ఉన్న 'మైజీహెచ్ఎంసీ' యాప్ స్థానంలో మరింత ఆధునిక హంగులతో రూపొందించిన 'మైక్యూర్' (My CURE) అప్లికేషన్‌ను బుధవారం అధికారికంగా ప్రారంభించింది. ఈ మేరకు జీహెచ్ఎంసీ తన సామాజిక మాధ్యమ ఖాతా (X) ద్వారా వివరాలను వెల్లడించింది.

**ఒక్క క్లిక్‌తో సమస్యకు పరిష్కారం**

నగర పాలనలో జవాబుదారీతనాన్ని పెంచుతూ, పౌరులకు ఇబ్బందులు లేకుండా ఫిర్యాదులను స్వీకరించేందుకు ఈ 'వన్ స్టాప్ సొల్యూషన్'ను తీసుకొచ్చారు. సానిటేషన్ నుంచి టౌన్ ప్లానింగ్ వరకు అన్ని రకాల సమస్యలను ఈ యాప్ ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లవచ్చు.

**యాప్ ప్రత్యేకతలు ఇవే:**

* ఏకీకృత ప్లాట్‌ఫారం: రహదారులు, వీధి దీపాలు, డ్రైనేజీ, చెత్త సేకరణ వంటి అన్ని రకాల ఫిర్యాదులకు ఒకే అప్లికేషన్.
* రియల్ టైమ్ ట్రాకింగ్: పౌరులు తాము చేసిన ఫిర్యాదు ఏ దశలో ఉందో, ఏ అధికారి వద్ద పెండింగ్‌లో ఉందో లైవ్‌లో చూసుకోవచ్చు.
* యూజర్ ఫ్రెండ్లీ ఇంటర్‌ఫేస్: సామాన్యులు కూడా సులభంగా వాడేలా యాప్‌ను తీర్చిదిద్దారు.
* కేంద్రీకృత పర్యవేక్షణ: క్షేత్రస్థాయి సిబ్బంది పనితీరును ఉన్నతాధికారులు నిశితంగా గమనించేలా 'సెంట్రలైజ్డ్ డ్యాష్ బోర్డ్' సౌకర్యం కల్పించారు.

"కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా, పౌర సమస్యలను వేగంగా పరిష్కరించడమే మా లక్ష్యం. పారదర్శకతతో కూడిన పాలనకు 'మైక్యూర్' నాంది పలుకుతుంది."

**— జీహెచ్ఎంసీ అధికారులు**

**జాప్యానికి తావులేకుండా..**

గతంలో ఫిర్యాదులు చేసినా వాటి పురోగతి తెలియక పౌరులు ఇబ్బంది పడేవారు. 'మైక్యూర్' యాప్‌లో బ్యాక్ ఎండ్ వ్యవస్థను బలోపేతం చేయడం వల్ల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత విభాగం అధికారికి సమాచారం చేరుతుంది. సమస్య పరిష్కారం కాగానే వినియోగదారుడికి నోటిఫికేషన్ వస్తుంది. దీనివల్ల పౌరులు కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని అధికారులు పేర్కొంటున్నారు. నగర ప్రజలు గూగుల్ ప్లే స్టోర్ లేదా ఆపిల్ యాప్ స్టోర్ నుంచి 'మైక్యూర్' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఈ సరికొత్త డిజిటల్ సేవలను వినియోగించుకుని నగరాభివృద్ధిలో భాగస్వాములు కావాలని జీహెచ్ఎంసీ కోరింది.

# హైదరాబాద్ నుంచి ఒక్కరోజులో తిరిగొచ్చే ఈ టూరిస్ట్ స్పాట్స్ తెలుసా !

**సెలవురోజు, వీకెండ్ వచ్చిందంటే చాలు.. అందమైన పర్యాటకం.. అనురాగాల ప్రయాణం అంటూ.. నగరవాసులు విహార యాత్రలకు జై కొడుతున్నారు. ఉరుకులు..పరుగుల జీవన ప్రయాణంలో ఇల్లూ.. ఆఫీసుల మధ్య పనుల ఒత్తిడితో సతమతమయ్యే ఉద్యోగులు.. కాసేపు ప్రకృతి ఒడిలో ఓలలాడుతున్నారు. మరీ కొత్త ప్రదేశాలకు వెళ్లి ఇబ్బందులు పడకుండా.. కాస్త పరిచయం ఉన్న చోట్లకే టూర్లు వేసుకుంటున్నారు. హైదరాబాద్ నుంచి ఒక్కరోజులో చూడగల పర్యాటక ప్రాంతాలను వీక్షించేందుకు ఆసక్తి చూపుతున్నారు.**





**లక్నవరం సరస్సు..**

నగర పర్యాటకులను ఆకర్షించే ముఖ్యమైన వాటిల్లో లక్నవరం ఒకటి. హైదరాబాద్ నుంచి 220 కిలో మీటర్లు. ఈ ప్రదేశం చుట్టుపక్కల ఉండే ఏటూరునాగారం అభయారణ్య సందర్శకులను కనువిందు చేస్తున్నది. లేక్ క్రాసింగ్, రోప్ కోర్సులు, కయాకింగ్ వంటివి అందుబాటులో ఉంటాయి. దీనికి సమీపంలో బొగత జలపాతం కూడా కనువిందు చేసే పర్యాటక ప్రాంతం.

**శామీర్‌పేట్ లేక్..**

హైదరాబాద్ శివారు ప్రాంతమైన శామీర్‌పేట్ సికింద్రాబాద్‌కు 20 కిలో మీటర్ల దూరంలో ఉంది. ఇక్కడ ఎన్నో విలాసవంతమైన రెస్టారెంట్లు, హోటళ్లు ఉన్నాయి. ఇక్కడ ఉన్న జింకల పార్క్‌లో జింకలతో పాటు నెమళ్లు, అనేక రకాల పక్షులు కనిపిస్తాయి.

**డిండి..**

నల్గొండ జిల్లాలో ఉంది. హైదరాబాద్ నుంచి 108 కిలోమీటర్ల దూరం. సుమారు 2:30 గంటల జర్నీ. ప్రశాంత వాతావరణానికి మారుపేరుగా ఉన్న డిండిలో సుందరమైన దృశ్యాలు అనేకం. ట్రెక్కింగ్, బ్యాక్ వాటర్ ట్రిప్స్‌తో ఎంజాయ్ చేయొచ్చు. శ్రీశైలానికి వెళ్లేదారిలో డిండిని చూసేందుకు పర్యాటకులు ప్రత్యేక ఆసక్తి చూపిస్తారు. నీటి అందాలతో సెల్ఫీలు దిగి సందడి చేస్తారు.

**కొండపోచమ్మ**

నూతనోత్తేజాన్ని నింపే అత్యుత్తమ క్యాంపింగ్ ప్రదేశంగా దీనిని చెప్పవచ్చు. హైదరాబాద్‌కు 50 కిలో మీటర్ల దూరంలో ఉంది. సిద్దిపేట జిల్లాలో ఉన్న ఈ రిజర్వాయర్ అందాలు ప్రత్యేకం. వాతావరణం ఎంతో ప్రశాంతంగా ఉంటుంది. అందుకే ఇక్కడ క్యాంపింగ్ చేసేందుకు అధిక శాతం పర్యాటకులు ఆసక్తి చూపుతారు.

**అనంతగిరి**

ట్రెక్కింగ్ కోరుకునే వారికి అనంతగిరి స్వర్గధామం. వికారాబాద్‌కు కేవలం పది కిలోమీటర్లు.. హైదరాబాద్‌కు వంద కిలోమీటర్ల దూరంలో ఉంది. అనంతగిరి కొండల చుట్టుపక్కల ఉన్న అటవీ ప్రాంతం.. నిర్మలమైన వాతావరణం పర్యాటకులను ఆకర్షిస్తోంది. ప్రాచీనమైన అనంతగిరి పద్మనాభ స్వామి ఆలయాన్ని కూడా దర్శించుకోవచ్చు.

**కీసరపోదాం..**

ఆధ్యాత్మిక ప్రాంతంగా పరిఢవిల్లుతున్న కీసర.. పర్యాటక ప్రాంతంగా ప్రసిద్ధి. పక్షుల కిలకిలరావాలు..'హరితహారం'తో స్వాగతం పలికే చెట్లు..సుందరీకరణతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న చెరువులు.. నలువైపులా వీక్షించేలా కొండపై కొలువుదీరిన వ్యూ పాయింట్స్.. అచ్చు ప్రకృతి సంపదతో నిర్మించినట్టుగా అనుభూతి కలిగించే ఆర్నమెంటల్ ఫెన్సింగ్.. ఆరోగ్యాన్ని పంచే ఔషధ మొక్కల కూడళ్లు.. నలువైపులా పరుచుకున్న పచ్చదనంతో కీసర.. పర్యాటకుల డెస్టినేషన్ లిస్టులో మొదటివరుసలోకి చేరింది. సుమారు 1562 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న అటవీ ప్రాంతంలో విభిన్న రకాల మొక్కలు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.

**రాచకొండ కోట..**

నగరం నుంచి 65 కిలో మీటర్ల దూరం. ఇది 14వ శతాబ్దానికి చెందిన కోట. ట్రెక్కింగ్‌కు అనుకూలం. యాదాద్రి భువనగిరి జిల్లాలో ఉంది. కోట పై నుంచి చూస్తే ఆకుపచ్చని ప్రాంతాల అందాలు కనువిందు చేస్తాయి.

**శ్రీరాం సాగర్..**

హైదరాబాద్ నుంచి 207 కిలోమీటర్ల దూరం. సుమారు 4గంటల జర్నీ. ఉత్తర తెలంగాణ జిల్లాకు వరప్రదాయిని. గోదావరి నది మీద కట్టిన ఈ ప్రాజెక్టును చూసేందుకు సందర్శకులు ఆసక్తి చూపిస్తారు. బడా పహాడ్ దర్గా, ఖిల్లా జైలు, సిర్నాపల్లి గడీ, డిచ్‌పల్లి ఖిల్లా రామాలయం, దేవల్ మసీద్, కందకూర్తి త్రివేణి సంగమం, రామడుగు జలాశయం, అలీసాగర్ తదితర పర్యాటక ప్రాంతాలన్నింటినీ వీక్షించొచ్చు.

**శ్రీశైలం..**

ప్రముఖ పుణ్యక్షేత్రం ఇది. హైదరాబాద్ నుంచి 5 గంటల ప్రయాణం. సుందరమైన దృశ్యాలకు నెలవు. కృష్ణా నదిపై నిర్మించిన శ్రీశైలం ఆనకట్టను వీక్షించొచ్చు. అతిపెద్ద జలవిద్యుత్ ప్రాజెక్టుల్లో ఇది ఒక్కటి. నది ఒడ్డున ఉన్న 12 జ్యోతిర్లింగాల్లో ఒకటైన మల్లికార్జున స్వామి ఆలయాన్ని దర్శించొచ్చు. భ్రమరాంబదేవి , సాక్షి గణపతి దేవాలయాలున్నాయి. ప్రకృతి అందాలను వీక్షించొచ్చు. నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులే కాదు.. నగరానికి చేరువలో అనేక జలపాతాలున్నాయి. అందులో బొగత, నిర్మల్ జిల్లాలో కుంటాల, పొచ్చెర వంటివి ఉన్నాయి.

**నల్లమల అడవులు..**

నగరం నుంచి 219 కిలో మీటర్ల దూరంలో ఉంటుంది. దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో క్యాంపింగ్ చేయడం ఎంతో కిక్కిస్తుంది. ప్రకృతివనంలో ఎంతో ప్రత్యేకంగా ఉంటుంది. చుట్టూ ప్రకృతి అందాలతో నిండిన ఈ ప్రాంతంలో పర్యాటకుల సాహసాలను, ఉత్కంఠభరితమైన కార్యకలాపాలను ఆస్వాదించొచ్చు. సాహస భరిత అనుభూతిని పొందేందుకు సరైన డెస్టినేషన్ ఇది. పర్వతారోహణ, శివాలయం, కంబం సరస్సు అందుబాటులో ఉండే ప్రాంతాలు.

**సిటీ చుట్టూ థీమ్‌లు..**

ఓఆర్ఆర్ నుంచి 25 కిలోమీటర్ల పరిధిలో పదికి పైగా ఉన్న థీమ్ పార్కులు పర్యాటకులకు ఎంతగానో చేరువయ్యాయి. ముఖ్యంగా రంగారెడ్డి జిల్లా రావిర్యాలలోని ఓఆర్ఆర్ ఎగ్జిట్ నెం. 13 వద్ద అందుబాటులో ఉంటే వండర్ లా, శంషాబాద్ ఎయిర్ పోర్టు సమీపంలోని ఎస్కేప్ అడ్వెంచర్ వాటర్ థీమ్ పార్కు, శంకర్‌పల్లిలోని వైల్డ్ వాటర్ అమ్యూజ్‌మెంట్, వికారాబాద్ సమీపంలో ఉండే డ్రీమ్ వ్యాలీ వాటర్ పార్కులు, వికారాబాద్, భువనగిరి గుట్టల సమీపంలో ఉండే ట్రెక్కింగ్ స్పాట్లకు ప్రైవేటు టూర్ ఆపరేటర్లతోపాటు తెలంగాణ టూరిజం శాఖ కూడా టూర్లను ఆపరేట్ చేస్తున్నది. వీటికి సిటీ నుంచి గంటన్నర వ్యవధిలోనే చేరుకునే వీలు ఉండగా.. ఒకప్పుడు సిటీ దాటి వెళ్లేవారు కూడా ఈ ప్రాంతాలను ఒక్కసారైన సందర్శించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

**అబ్బురపరిచే పార్కులు..**

హైదరాబాద్ శివారులోనే ఉన్న కండ్లకోయ ఆక్సిజన్ పార్కును అడవిలాంటి ఉద్యాన వనం అనవచ్చు. అటవీశాఖ 75 ఎకరాల విస్తీర్ణంలో తీర్చిదిద్దిన ఈ పార్కులో 50 వేల పైచిలుకు చెట్లున్నాయి. పెద్దల కోసం యోగా హాల్, వాక్‌వేలు ఉన్నాయి. పిల్లలకు ఆట స్థలాలున్నాయి. ట్రీహౌస్, పక్షులు సీతాకోకచిలుకల పార్కులు ఉన్నాయి. కుటుంబమంతా కలిసి పిక్నిక్ వెళ్లడానికి చక్కని చోటు ఇది. అలాగే కొత్తగూడలో 120 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న బొటానికల్ గార్డెన్స్ ఆహ్లాదాన్ని పంచుతున్నది.







# కాంట్రాక్టు కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలి



* శ్రమదోపిడి అమలుకు నోచుకోని కార్మికచట్టాలు, కనీసవేతనాలు
* బిటిపిఎస్ గేటు ముందు దర్నా నిర్వహించిన సిఐటియు

మణుగూరు, ఫిబ్రవరి 18 (భారతశక్తి): భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు ఆరు నెలల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం ప్రధాన గేట్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు బ్రహ్మచారి మాట్లాడుతూ బిటిపిఎస్ లో కార్మిక చట్టాల ఉల్లంఘన యదేచ్ఛగా సాగుతుందని కనీస వేతనాలు అమలు కావడం లేదని పేర్కొన్నారు. జీవో నెంబర్ 11, 60 అమలు చేయాల్సి ఉండగా వాటికి విరుద్ధంగా వేతనాలు చెల్లింపు జరుగుతుందని విమర్శించారు. కార్మికుల అకౌంట్లో జీతాల నుంచి కోత పెట్టిన ఈఎస్ఐ జమ కావడం లేదని కాంట్రాక్టర్ వాటాను చెల్లించకుండా ఎగ్గొడుతున్నారని సిఐటియు నేతలు పేర్కొన్నారు. అత్యధిక మంది కార్మికులకు పిఎఫ్ అమలు కావటం లేదని బూట్లు హెల్మెట్లు ఇవ్వడం లేదని ఇచ్చిన కొద్దిమందికి నాసిరకం హెల్మెట్లు బూట్లు ఇచ్చారని కార్మికుల భద్రతకు ఎటువంటి ప్రాధాన్యత ఇవ్వటం లేదని జిల్లా అధ్యక్షులు బ్రహ్మచారి తెలిపారు. బ్యాంకు ద్వారా వేతనాలు చెల్లింపు జరగాలని నిబంధనను అమలు చేయడం లేదన్నారు. వేతనాల గురించి ఇతర సమస్యల గురించి ప్రశ్నించే కార్మికుల పట్ల వేధింపులు జరుగుతున్నాయని అక్రమ తొలగింపులు జరుగుతున్నాయని వీటిని అరికట్టాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం చేసే వరకు ధర్నా కొనసాగుతుందని సిఐటియు ప్రకటించిందన్నారు. విషయాన్ని తెలుసుకున్న బి టిపిఎస్ సిఈ బిచ్చన్న ధర్నా వద్దకు అధికారులు పంపించి చర్చలకు ఆహ్వానించారు. సీఈ ఛాంబర్ లో ఏడు డిమాండ్లపై చర్చలు జరిపారని తెలిపారు. పెండింగ్ వేతనాలన్నీ కాంట్రాక్టర్లతో మాట్లాడి సోమవారం లోపు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. పీఎఫ్ ఈఎస్ఐ అమలు విషయంలో ఇప్పటివరకు కార్మికుల వద్ద నుంచి ఎంత డబ్బులు కట్ చేశారు, యాజమాన్యం ఎంత వాటా చెల్లించింది మొత్తం ఎన్ని డబ్బులు అకౌంట్ కు జమాయిని అనే విషయాలను ప్రతి కాంట్రాక్టర్ తన పరిధిలోని కార్మికులకు లిఖితపూర్వకంగా తెలియజేసే విధంగా కాంట్రాక్టర్లకు ఆదేశాలు ఇస్తామని హామీ ఇచ్చారు. కాంట్రాక్ట్ కార్మికులకు ఏ జీవో ప్రాతిపదికన వేతనాలు చెల్లించేది రోజుకి ఎంత వేతనం నెలకు ఎంత వేతనం ప్రతి కాంట్రాక్టర్ తన పరిధిలోని కార్మికులకు సమగ్ర వివరాలు అందించే విధంగా బ్యాంకు ద్వారా జీతాలు చెల్లించే విధంగా ఆదేశాలు ఇస్తామన్నారు. అక్రమ తొలగింపు లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సిఈ ఆదేశాల మేరకు, ఏడిఏమ్ మురళికృష్ణ, యస్ఈ లు ,టి.శ్రీనివాసరావు, రమేష్ బాబు లు ధర్నావద్దకు వచ్చి కార్మికులు వివరించారు. అధికారుల హామీ మేరకు కార్మికులు, సిఐటియు నాయకులు చర్చించుకుని దర్నా విరమించారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే తిరిగి దర్నా చేస్తామని సిఐటియు హెచ్చరించారు. ఈ దర్నాలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గద్దల శ్రీను, మణుగూరు మండల కన్వీనర్ కొడిశాల రాములు, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు సత్రపల్లి సాంబశివరావు, సాయి కృష్ణ, పినపాక మండల కన్వీనర్ సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు సారిక, బిటిపిఎస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎగిడి రవి, బిక్షపతి, నాగరాజు, సూర్య రమేష్, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## డివిజన్ అభివృద్ధిలో ఎంపీ ఈటల పాత్ర కీలకం

* కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి కృతజ్ఞతలు

గడ్డిఅన్నారం, ఫిబ్రవరి 18 (భారత శక్తి) : గడ్డిఅన్నారం డివిజన్ సమగ్ర అభివృద్ధికి మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అందిస్తున్న సహకారం అభినందనీయమని డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి కొనియాడారు. కార్పొరేటర్‌గా తన పదవీకాలం ముగిసిన సందర్భంగా బుధవారం ఉదయం ఆయన ఈటల రాజేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు.

* నిధుల కేటాయింపులో వివక్ష చూపని నాయకుడు:

ఈ సందర్భంగా ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. ఈటల రాజేందర్ ఎంపీగా గెలిచిన తర్వాత డివిజన్‌లో కోట్ల రూపాయల వ్యయంతో నూతన సీసీ రోడ్లు, స్ట్రామ్ వాటర్ నాలా పనులు వేగంగా పూర్తయ్యాయని తెలిపారు. కౌన్సిల్ సమావేశాల్లో కేవలం భాజపా కార్పొరేటర్లకే కాకుండా, అన్ని పార్టీల సభ్యులకు సమానంగా నిధులు కేటాయించాలని ఎంపీ బలంగా వాదించారని గుర్తుచేశారు. డివిజన్ సమస్యలపై అధికారులతో ప్రత్యేకంగా చర్చించి, పనులు పట్టాలెక్కేలా చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారన్నారు.

**పెండింగ్ పనులపై వినతి:**

డివిజన్ పరిధిలోని పలు సమస్యలను ఈ సందర్భంగా ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు.



కమలానగర్ కాలనీ: రోడ్ నెంబర్ 5 వద్ద గత కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సీఆర్ఎంపీ రోడ్ పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు. న్యూ గడ్డిఅన్నారం కాలనీ: ఇక్కడి కమ్యూనిటీ అభివృద్ధికి ఎంపీ నిధుల నుంచి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

**ప్రజల కోసం నిరంతరం కృషి:**

పదవీకాలం ముగిసినా.. గడ్డిఅన్నారం డివిజన్ అభివృద్ధి కోసం ప్రజలతోనే ఉంటానని ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాలు, పారిశుధ్యం వంటి సమస్యల పరిష్కారానికి అధికారులతో సమన్వయం చేసుకుంటూ నిరంతరం శ్రమిస్తానని ఆయన వెల్లడించారు.

## కాంగ్రెస్ హామీలు గాలికి.. వంచనలో సర్కార్ రికార్డు!

* 26 నెలలైనా తీరని మహిళల, వృద్ధుల నిరీక్షణ
* తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగా రెడ్డి ఆగ్రహం

రంగారెడ్డి జిల్లా, ఫిబ్రవరి 18 (భారత శక్తి): ఎన్నికల వేళ అరచేతిలో వైకుంఠం చూపించి, అధికారంలోకి వచ్చాక ప్రజలను విస్మరించడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటుగా మారిందని తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కప్పాటి పాండురంగా రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వం కొలువుదీరి 26 నెలలు గడుస్తున్నా, ప్రధాన హామీల అమలులో దారుణమైన జాప్యం జరుగుతోందని ఆయన విమర్శించారు. బుధవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

**మహాలక్ష్మి ఎక్కడ? వృద్ధుల భరోసా ఏది?**

మహాలక్ష్మి పథకం కింద ప్రతి నెలా మహిళలకు ₹2500 ఆర్థిక సాయం అందిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, రెండేళ్లు



దాటినా ఆ ఊసే ఎత్తకపోవడం మహిళా లోకాన్ని వంచించడమేనని పాండురంగా రెడ్డి మండిపడ్డారు.

**అలాగే:**

పించన్ల పెంపు: వృద్ధాప్య పింఛన్ ₹4000లకు, దివ్యాంగుల పింఛన్ ₹6000లకు పెంచుతామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు.

* అమలుకాని హామీలు: ఆడబిడ్డ వివాహానికి తులం బంగారం,

చదువుకునే విద్యార్థినులకు స్కూటర్ల పంపిణీ వంటి వాగ్దానాలు కాగితాలకే పరిమితమయ్యాయని విమర్శించారు.

* ఉద్యమకారుల ఆత్మగౌరవంపై నిర్లక్ష్యం

తెలంగాణ ఉద్యమకారులకు ఇంటి స్థలాలు, పించన్ల విషయంలో హైకోర్టు ప్రశ్నించే పరిస్థితి రావడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ప్రాణాలకు తెగించి పోరాడిన ఉద్యమకారుల ఆత్మగౌరవాన్ని కాపాడాల్సిన కనీస బాధ్యత కూడా ఈ ప్రభుత్వానికి లేకపోవడం శోచనీయమన్నారు.

* బడ్జెట్‌లో కేటాయింపులు లేకుంటే ఉద్యమమే..

"కుంటి సాకులు మానుకొని, తక్షణమే పెంచిన పింఛన్లు, మహిళలకు నగదు బదిలీని ప్రారంభించాలి. రాబోయే బడ్జెట్‌లో మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు మరియు రైతులకు ఇచ్చిన హామీల కోసం నిధులు కేటాయించాలి" అని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో, రాజకీయ పార్టీగా ఆవిర్భవిస్తున్న తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని పాండురంగా రెడ్డి హెచ్చరించారు.



## యువ "ఆపద మిత్రులతోనే" సమాజానికి భరోసా

* ప్రమాద సమయాల్లో మీరే తొలి స్పందనశీలురు
* 3వ బ్యాచ్ శిక్షణలో హైడ్రా అదనపు డైరెక్టర్ పాపయ్య

హైదరాబాద్, ఫిబ్రవరి 18 : భారత శక్తి, ప్రకృతి వైపరీత్యాలు, ఆకస్మిక ప్రమాదాలు సంభవించినప్పుడు సామాన్య ప్రజలను ఆదుకోవడంలో 'యువ ఆపద మిత్రులు' కీలక పాత్ర పోషించాలని హైడ్రా అదనపు డైరెక్టర్ వర్ల పాపయ్య పిలుపునిచ్చారు. బుధవారం ఫతుల్‌గూడలోని హైడ్రా శిక్షణ కేంద్రంలో ఏర్పాటు చేసిన 'యువ ఆపద మిత్ర' మూడవ బ్యాచ్ శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరదలు, అగ్నిప్రమాదాల వంటి క్లిష్ట పరిస్థితుల్లో స్థానికంగా అందుబాటులో ఉండే వాలంటీర్లు తక్షణ సహాయం అందించే సమర్థ నాయకులుగా ఎదగాలని ఆకాంక్షించారు.

**వారం రోజుల పాటు మెలుకువలు**

ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు వారం రోజుల పాటు సాగే ఈ శిక్షణలో ప్రమాదాల సమయంలో ప్రాణనష్టాన్ని ఎలా తగ్గించాలి, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు ఎలా తరలించాలి అనే అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.

* సమన్వయం: ఇతర శాఖల నుంచి వచ్చే సహాయక బృందాలతో కలిసి ఎలా పనిచేయాలో వాలంటీర్లకు అవగాహన కల్పిస్తారు.
* నాయకత్వం: గందరగోళ పరిస్థితుల్లో ఆత్మస్థైర్యం కోల్పోకుండా నాయకత్వం వహించడంపై శిక్షణ ఉంటుంది.



* విస్తరణ: ఇక్కడ శిక్షణ పొందిన ప్రతి వాలంటీర్ మరో పది మందిని సిద్ధం చేసి, సమాజానికి భరోసా కల్పించాలని సూచించారు.

**105 మంది యువతకు శిక్షణ**

హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల నుంచి ఎంపికైన 105 మంది యువ వాలంటీర్లు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. అగ్నిప్రమాదాలు, వరదలు, భూకంపాల వంటి సమయాల్లో స్పందించే తీరు, ప్రాథమిక చికిత్స (First Aid) అందించే పద్ధతులపై వీరికి నిపుణులు శిక్షణ ఇస్తారు. ఈ కార్యక్రమంలో హైడ్రా ఆర్.ఎఫ్.ఓ జయప్రకాశ్, డి.ఎఫ్.ఓ గౌతమ్, ఎస్.డి.ఎం.ఏ నోడల్ ఆఫీసర్ గౌతం, హైదరాబాద్ జిల్లా యువజన అధికారి ఖుష్బూ, ఏ.డి.ఎఫ్.ఓ మోహనరావు తదితరులు పాల్గొని వాలంటీర్లకు దిశానిర్దేశం చేశారు.

**చెరువుల అభివృద్ధే లక్ష్యం..**

ఈ సందర్భంగా పలు కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులు హైడ్రా కార్యకలాపాలపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. చెరువుల పునరుద్ధరణ, అభివృద్ధి ద్వారా భవిష్యత్తులో వరదలు లేని హైదరాబాద్ నగరాన్ని చూడాలని ఆశిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

## బీసీలు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

: మాస్ వ్యవస్థాపక అధ్యక్షులు కటకం నర్సింగ్ రావు..

నాగోల్ ,ఫిబ్రవరి 18 (భారత శక్తి): మన ఆలోచన సాధన సమితి (మాస్) ప్రధాన కార్యాలయంలో రజక,ముదిరాజ్, విశ్వకర్మ, మేర, కులాలకు సంబంధించిన ప్రతినిధులకు 'మాస్ లీడర్ షిప్ ప్రోగ్రాం నిర్వసించారు 'మాస్ కోశాధికారి శ్రీ పెద్ద వూర బ్రహ్మయ్య అధ్యక్షతన జరిగిన మాస్ లీడర్ షిప్ ట్రైనింగ్ ప్రోగ్రాం కు ముఖ్య అతిథిగా మాస్ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ కటకం నర్సింగ్ రావు, అతిథులుగా, ముదిరాజ్ మహా సభ అధ్యక్షులు పాల్కం లక్ష్మీనారాయణ ముదిరాజ్. అల్లదుర్గం సురేష్ ముదిరాజ్, ప్రముఖ సామాజిక కార్యకర్త శ్రీ చీరాల జేలేంద్ర చారి,తదితరులు పాల్గొన్నారు. అధ్యక్షత వహిస్తున్న పెద్ద వూర బ్రహ్మయ్య రజక మాట్లాడుతూ వ్యవస్థాపక అధ్యక్షులు కటకం నర్సింగ్ రావు గారి ఆలోచన నుండి పుట్టిన మన ఆలోచన సాధన సమితి చేసిన కార్యక్రమాలను వివరించి, బీసీలలో నాయకత్వ లోపం ఉన్న దృష్ట్యా, బీసీ కులాలు అనుచరులుగా కాకుండా నాయకులుగా ఎదగాల్సిన ఆవశ్యకత గుర్తించి మాస్ లీడర్షిప్ ట్రైనింగ్ ప్రోగ్రాం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ యొక్క ట్రైనింగ్ ప్రోగ్రాం కు అతిథులుగా పాల్గొన్నటువంటి వక్తలు బీసీల నాయకత్వ లేమి వలన భూస్వాములు, పెట్టుబడి దారులుగా ఉన్నటువంటి ఆధిపత్య కులాలు వివిధ వ్యాపారాల మాదిరిగానే రాజకీయాలను కూడా మార్చుకుని మన బీసీలను ఓట్లను వేసే యంత్రాలుగా, ఓట్లమ్ముకునే వారిగా, ఓట్లను వేయించే అనుచరులుగా మార్చుకుని మనల్ని పాలిస్తూ ప్రభుత్వ వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకుని రాజకీయ దోపిడీకి పాల్పడుతూ సమాజంలో ఎక్కువగా ఉన్న బీసీ లకు అందాల్సిన ప్రతిఫలాలను కొల్లగొడుతూ అన్యాయం చేస్తున్నారని, ఈ పరిస్థితుల నుండి బయటపడాలంటే మన జాతులు విద్యను, చైతన్యాన్ని ఆయుధంగా మలచుకుని నాయకత్వాన్ని పెంపొందించుకుందామని,



కులాలుగా వేరు వేరు గా ఉన్న మనం బీసీలుగా ఐక్యతను పెంపొందించుకుందామని పిలుపునిచ్చారు. అలాగే కులవృత్తులు, వ్యాపారాలలో ఉన్నటువంటి బీసీ కులాలను ప్రోత్సహించుకుందాం, ఆర్థికంగా ఎదగడానికి ఊతమివ్వడం ద్వారా మనమందరం ఒకటే అనే భావన కలిగిద్దామని తెలిపారు. పూర్వం గ్రామీణ వ్యవస్థలో బీసీ కులాల మధ్యన కుటుంబ సంబంధాలు, చుట్టరికపు అనుబంధాలు కలిగి వరుసలు పెట్టి పిలుచుకునే సంస్కృతి ఉండెడిది. అటువంటి ఐక్యత ఉన్న కులాల మధ్యన రాజకీయ పార్టీలు చొరబడి, కులాల మధ్యన విభజన చేసి పార్టీల కార్యకర్తలుగా మనల్ని మార్చుకుని ఒకొక్క పార్టీ కోసం, ఆయా పార్టీల నాయకుల కోసం బట్టలు చింపుకునే బానిసలుగా తయారు చేసుకుని మందు, విందుకు అలవాటు చేసి ఏ వృత్తి నైపుణ్యత పెంచుకోకుండా తమ వెంట తోకాడించుకుంటూ తిరిగేలా చేసుకుని మనల్ని నాయకులుగా ఎదగాలనే ఆలోచనలు కూడా మనకు రాకుండా ఆధిపత్య వర్గాల చేతుల్లో ఉన్నటువంటి పార్టీలు చేస్తున్నాయని, మనం ఇప్పటికైనా మేల్కొని ఈ పరిస్థితుల నుండి అధిగమించి నాయకులుగా ఎదగాలనే తపనను పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు. వ్యవస్థాపక అధ్యక్షులు కటకం నర్సింగ్ రావు గారు మాట్లాడుతూ మన ఆలోచన సాధన సమితి అనేది ఒక సంస్థ కాదు, ఒక బీజం,ఒక భావజాలం, ఒక ఉద్యమం, ఒక ఉప్పెనలా ప్రభంజనం సృష్టించడానికి బీసీ నాయకుల సైన్యాన్ని తయారు చేస్తుందని, అందులో భాగంగానే బీసీ కులాల లీడర్షిప్ ట్రైనింగ్ ప్రోగ్రాం లు అని వివరించారు. యువత పార్టీల మోజులో, మతం మోజులో, ఇతర వ్యసనాల మోజులో పడి నాయకత్వం వహించడానికి ముందుకు రాకపోవడం వలననే బీసీ ఉద్యమాలు ఎగసిపడడం లేదని, అటువంటి యువతలో చైతన్యం తీసుకుని వచ్చి బీసీ భావజాలం వ్యాప్తి ద్వారా నాయకులుగా తీర్చి దిద్దడమే మన ఆలోచన సాధన సమితి లక్ష్యం అని ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమానికి స్వాగతోపన్యాసం జక్కుల బాలరాజు యాదవ్,ముగింపు సందేశం శ్రీ శ్రీగాది కృష్ణయ్య గారు,ఉపాధ్యక్షులు గూండ్ల ఆంజనేయులు గౌడ్, ప్రధాన కార్యదర్శి బచ్చనబోయిన శ్రీనివాస్ యాదవ్ కన్వీనర్లుగా వ్యవహరించిన ఈ ట్రైనింగ్ ప్రోగ్రాం లో మాస్ అధికార ప్రతినిధి మంగిళిపల్లి శంకర్ గంగపుత్ర, ప్రచార కార్యదర్శి, సోషల్ మీడియా ఇన్చార్జి కైరంకొండ నర్సింగ్ గంగపుత్ర,ప్రచార కార్యదర్శి దువ్వల శ్రీకాంత్ గంగపుత్ర , సుంచు వాసు, నిమ్మల సత్యం రజక, దండెనబోయిన భరద్వాజ్ ముదిరాజ్, సామ పృథ్వీరాజ్ ముదిరాజ్, కార్యదర్శి అమృతం మార్కండేయులు , వివిధ బీసీ కులాల ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## క్యాతనపల్లిలో ఉద్రిక్తత.. బాల్క సుమన్ అరెస్టు

మందమర్రి పట్టణం, ఫిబ్రవరి 18 (భారత శక్తి): : మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీలో ఉద్రిక్తత నెలకొంది. ఛైర్మన్ ఎన్నిక విషయంలో ఉత్కంఠ కొనసాగుతోంది. బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ ఇంటి చుట్టూ భారీగా పోలీసులు మోహరించారు. అనంతరం ఆయనను అరెస్టు చేశారు. పెద్దసంఖ్యలో అక్కడికి చేరుకున్న కార్యకర్తలు అరెస్టును అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులకు, కార్యకర్తలకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అరెస్టు అనంతరం బాల్క సుమన్‌ను శ్రీరాంపూర్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. పోలీసులపై దౌర్జన్యం చేశారని, విధులను అడ్డుకున్నారని మంగళవారం బాల్క సుమన్‌పై కేసు నమోదైంది. ఈ క్రమంలోనే అరెస్టు చేసేందుకు పోలీసులు ఆయన ఇంటికి వచ్చారు. అరెస్టుకు సహకరించాలని కోరారు. అయితే.. కార్యకర్తలు అడ్డుకోవడంతో.. బాల్క సుమన్‌ను బలవంతంగా పోలీసులు అక్కడి నుంచి మోసుకెళ్లారు.

**అరెస్టును ఖండించిన కేటీఆర్..**

బాల్క సుమన్ అరెస్టును ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఖండించారు. వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ముందస్తు నోటీసులు లేకుండా అరెస్టు చేశారని ఆరోపించారు. క్యాతనపల్లి ఛైర్మన్ ఎన్నిక ప్రక్రియను మంత్రి వివేక్ శాసిస్తున్నారని మండిపడ్డారు. బాల్క సుమన్ అరెస్టు.. కాంగ్రెస్ అప్రజాస్వామిక చర్య అని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. క్యాతనపల్లిలో బీఆర్ఎస్‌కు పూర్తి మెజార్టీ వచ్చిందని.. ఛైర్మన్ ఎన్నికలో కాంగ్రెస్ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందన్నారు.

# విశాఖ తీరంలో నౌకాదళ విన్యాసాలు.. ఐఎన్ఎస్ సుమేధపై రాష్ట్రపతి, సీఎం ప్రయాణం

అమరావతి, ఫిబ్రవరి 18 (భారత శక్తి): విశాఖ తీరంలో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్) వేడుకలు అట్టహాసంగా కొనసాగుతున్నాయి. ఈ వేడుకలకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో పాటు ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హాజరయ్యారు. వేడుకల్లో భాగంగా నౌకాదళ సిబ్బంది నుంచి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆమె ఐఎన్ఎస్ సుమేధ యుద్ధ నౌకలో ప్రయాణించారు. రాష్ట్రపతితో పాటు గవర్నర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా పాల్గొన్నారు. సముద్ర అలలపై వరుసగా నిలిచిన యుద్ధ నౌకలను వారు వీక్షించారు.



**71 యుద్ధ నౌకల విన్యాసాలు..**

ఈ ఫ్లీట్ రివ్యూలో భారత నావికాదళ సత్తాతో పాటు ప్రపంచ దేశాల నౌకలు కూడా కదం తొక్కాయి. ఆరు వరుసల్లో మొత్తం 71 యుద్ధ నౌకలు పరేడ్ నిర్వహించాయి. భారత నేవీకి చెందిన 45 నౌకలతో పాటు కోస్ట్‌గార్డ్, మర్చంట్ నేవీ మరియు పరిశోధన నౌకలు ఇందులో పాల్గొన్నాయి. రష్యా, ఆస్ట్రేలియా, యూఏఈ వంటి వివిధ దేశాల నుంచి వచ్చిన 19 విదేశీ నౌకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విశాఖ సముద్ర తీరం యుద్ధ నౌకల గర్జనలు, నావికాదళ విన్యాసాలతో సందడిగా మారింది. దేశ రక్షణలో నౌకాదళం పోషిస్తున్న కీలక పాత్రను ఈ వేడుక ప్రతిబింబించింది.

## క్రైస్తవ సోదరులకు
## శుభాకాంక్షలు తెలిపిన నారా లోకేశ్

అమరావతి, ఫిబ్రవరి 18 (భారత శక్తి): ఆంధ్రప్రదేశ్ మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ క్రైస్తవ సోదర సోదరీమణులకు లెంట్ సీజన్ శుభాకాంక్షలు తెలిపారు. క్రైస్తవులు అత్యంత పవిత్రంగా భావించే 40 రోజుల ఉపవాస దీక్షల ప్రారంభం సందర్భంగా ఆయన తన సందేశాన్ని విడుదల చేశారు. ఈ మేరకు లోకేశ్ స్పందిస్తూ.. "లెంట్ పవిత్ర కాలాన్ని పాటిస్తున్న క్రైస్తవ సోదర సోదరీమణులందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు. యేసు క్రీస్తు జీవితం, త్యాగాలను స్మరించుకుంటూ 40 రోజుల పాటు ఉపవాసం, ప్రార్థన, ధ్యానంతో గడిపే ఈ పవిత్రమైన సమయం ప్రతి ఒక్కరిలో విశ్వాసాన్ని, కరుణను, ఆశను పునరుద్ధరించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని పేర్కొన్నారు. మంత్రి నారా లోకేశ్ తన సందేశాన్ని ఫేస్‌బుక్, ఎక్స్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకున్నారు. ఆయన పోస్ట్‌పై క్రైస్తవ సంఘాల నుంచి సానుకూల స్పందన వ్యక్తమవుతోంది. పలువురు నెటిజన్లు ఆయనకు ధన్యవాదాలు తెలుపుతున్నారు.

## పాకిస్థాన్‌కు 'జల' గండం: రావి నది నీటిని నిలిపివేయనున్న భారత్

ఢిల్లీ, ఫిబ్రవరి 18 (భారత శక్తి): పాకిస్థాన్‌కు దశాబ్దాలుగా వెళ్తున్న రావి నది మిగులు జలాలను పూర్తిగా నిలిపివేసేందుకు భారత్ కీలక చర్యలు చేపట్టింది. పంజాబ్‌జమ్మూ కశ్మీర్ సరిహద్దులో నిర్మిస్తున్న షాపుర్‌కండి బ్యారేజీ నిర్మాణం తుది దశకు చేరుకుందని, మార్చి 31 నాటికి ఇది పూర్తవుతుందని జమ్మూ కశ్మీర్ జలవనరుల శాఖ మంత్రి జావేద్ అహ్మద్ రాణా ప్రకటించారు. ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే రావి నది నుంచి పాకిస్థాన్‌కు వెళ్లే నీరు పూర్తిగా ఆగిపోనుంది. ఈ బ్యారేజీ ద్వారా నిల్వ చేసిన నీటిని జమ్మూ కశ్మీర్‌లోని కరవు పీడిత ప్రాంతాలైన కతువా, సాంబా జిల్లాల్లోని 32,173 హెక్టార్ల వ్యవసాయ భూములకు అందించనున్నారు. దీంతో పాటు పంజాబ్‌లోనూ 5,000 హెక్టార్లకు ప్రయోజనం చేకూరనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా 206 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కూడా జరగనుంది. ఇప్పటివరకు భారత్ వినియోగించుకోని ఈ నీరు వృథాగా పాకిస్థాన్‌కు వెళ్తోందని, ఇకపై దానిని మన రైతుల ప్రయోజనాల కోసం వాడుకుంటామని మంత్రి రాణా స్పష్టం చేశారు. 1960 నాటి సింధు జలాల ఒప్పందం ప్రకారం రావి నదిపై భారత్‌కు పూర్తి హక్కులు ఉన్నాయి. వాస్తవానికి ఈ ప్రాజెక్టుకు 1982లోనే నాటి ప్రధాని ఇందిరా గాంధీ శంకుస్థాపన చేసినా.. పంజాబ్, జమ్మూ కశ్మీర్ మధ్య వివాదాల కారణంగా దశాబ్దాలుగా నిలిచిపోయింది. 2018లో కేంద్రం జోక్యంతో పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్ పట్ల కఠినంగా వ్యవహరించాలనే వ్యూహంలో భాగంగానే భారత్ ఈ ప్రాజెక్టును వేగవంతం చేసినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

## భారత్‌తో గూగుల్ భవిష్యత్ భాగస్వామ్యం గురించి స్పష్టమైన సంకేతాలు ఇచ్చిన సుందర్ పిచాయ్

ఢిల్లీ, ఫిబ్రవరి 18 (భారత శక్తి): గూగుల్, ఆల్ఫాబెట్ సీఈఓ సుందర్ పిచాయ్ భారత్ లో జరుగుతున్న అంతర్జాతీయ ఏఐ సదస్సు సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఏఐ సమ్మిట్ సందర్భంగా మన జాతీయ మీడియాతో ఆయన కాలిఫోర్నియా నుంచి వర్చువల్ గా మాట్లాడుతూ... భారత్ తో గూగుల్ భవిష్యత్ భాగస్వామ్యం గురించి స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు.

*** పిచాయ్ వ్యాఖ్యల్లో కీలక అంశాలు:**

భారత ఏఐ ప్రయాణంలో గూగుల్ భాగస్వామి కావాలనుకుంటోంది. ఏఐ వినియోగంతో మరికొన్నేళ్లలో భారత్ మరింత ముందుకు వెళ్తుందని నేను నమ్ముతున్నాను. అందుకే ఇండియాతో భాగస్వామిగా ఉండాలనే స్పష్టమైన ఆశయంతో ఉన్నాం. భారత్ లో మౌలిక సదుపాయాలు, స్థిరమైన పెట్టుబడులు, డేటా సెంటర్ల ఏర్పాటు, స్థానిక భాగస్వాములతో పరిశోధనలు, యువతకు ఉపాధి అవకాశాలు సృష్టించడంపై గూగుల్ దృష్టి సారిస్తోంది. భారత్ లో క్లౌడ్ రీజియన్ స్థాపన కోసం రిలయన్స్ జియోతో కలిసి పనిచేస్తున్నాం. రాజస్థాన్ లో 150 మెగావాట్ల పునరుత్పాదక ఎనర్జీ ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తున్నాం. అదానీ, క్లీన్‌మాక్స్ వంటి సంస్థల భాగస్వామ్యంతో డేటా సెంటర్ల విస్తరణ జరుగుతోంది. భారత వినియోగదారుల కోసం ఏఐ ఆధారిత ఉత్పత్తుల అభివృద్ధిపై దృష్టి పెడుతున్నాం. భారత మీడియాతో ఈ మేరకు అమెరికా నుంచి వర్చువల్ గా మాట్లాడిన పిచాయ్... నేడు భారత్ కు చేరుకున్నారు. ఏఐ సదస్సు కోసం భారత్ కు రావడం తనకు చాలా సంతోషంగా ఉందని ఆయన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. శుక్రవారం ఏఐ సమ్మిట్ లో ఆయన ప్రసంగించనున్నారు.

# ట్రంప్ కు ఇరాన్ సుప్రీం వార్నింగ్

అమెరికా (భారత శక్తి): అమెరికా ఇరాన్‌ల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇస్లామిక్ రిపబ్లిక్‌ను కూలదోయడంలో అమెరికా ఎప్పటికీ విజయం సాధించలేదని, భవిష్యత్తులోనూ సాధించలేదని స్పష్టం చేశారు. ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన సైన్యం ఉన్నవారికైనా తీవ్ర ఎదురుదెబ్బ తగలవచ్చని హెచ్చరించారు. ఇరాన్‌లో పాలన మార్పు, యుద్ధ నౌకల మోహరింపు అంశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న ప్రకటనల నేపథ్యంలో ఖమేనీ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. అదే సమయంలో జెనీవా వేదికగా ఇరాన్ అమెరికాల మధ్య పరోక్ష అణు చర్చలు కొనసాగుతుండటం ఈ పరిణామానికి మరింత ప్రాధాన్యం తెచ్చింది. ఖమేనీ చేసిన వరుస ట్వీట్లలో .. తమ సైన్యం ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైనదని అమెరికా అధ్యక్షుడు చెబుతున్నారు. కానీ, కొన్ని సందర్భాల్లో అది కోలుకోలేనంత దెబ్బతినే అవకాశమూ ఉంది. ఇరాన్ వైపు యుద్ధ నౌకలను పంపిస్తున్నామని ప్రకటిస్తున్నారు. అవి ప్రమాదకరమైనవే. అయితే, వాటిని సముద్రంలో ముంచేసే సామర్థ్యమున్న ఆయుధం మరింత ప్రమాదకరం. 47 ఏళ్లుగా ఇస్లామిక్ రిపబ్లిక్‌ను ఏమీ చేయలేకపోయామని అమెరికానే అంగీకరిస్తోంది. ఇకముందూ చేయలేరు. అణు చర్చలు జరుపుదామంటారు. కానీ చివరికి మీ దగ్గర అణ్వాయుధాలు ఉండకూడదని ముందే తీర్పు చెబుతారు. చర్చల ఫలితాలను ముందుగానే నిర్ణయించడం మూర్ఖత్వమే అని ఘాటుగా వ్యాఖ్యానించారు. కాగా, జెనీవాలో అమెరికా ఇరాన్ మధ్య జరిగిన అణు చర్చలు సుమారు మూడు గంటల్లో ముగిశాయి. ఈ చర్చలు జరుగుతున్న సమయంలోనే ఇరాన్ హర్మూజ్ జలసంధిలో సైనిక విన్యాసాలు చేపట్టింది. భద్రతా కారణాలతో జలసంధిని కొన్ని గంటల పాటు మూసివేసి, లైవ్ క్షిపణులను ప్రయోగించడం అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. అమెరికా సైనిక మోహరింపులు కొనసాగుతున్న వేళ ఆ ప్రాంతంలో టెహ్రాన్ ఈ చర్యలు చేపట్టింది.



## విశాఖ తీరంలో నౌకాదళ విన్యాసాలు..
## ఐఎన్ఎస్ సుమేధపై రాష్ట్రపతి, సీఎం ప్రయాణం

అమరావతి, ఫిబ్రవరి 18 (భారత శక్తి): విశాఖ తీరంలో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్) వేడుకలు అట్టహాసంగా కొనసాగుతున్నాయి. ఈ వేడుకలకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో పాటు ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హాజరయ్యారు. వేడుకల్లో భాగంగా నౌకాదళ సిబ్బంది నుంచి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆమె ఐఎన్ఎస్ సుమేధ యుద్ధ నౌకలో ప్రయాణించారు. రాష్ట్రపతితో పాటు గవర్నర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా పాల్గొన్నారు. సముద్ర అలలపై వరుసగా నిలిచిన యుద్ధ నౌకలను వారు వీక్షించారు.

**71 యుద్ధ నౌకల విన్యాసాలు..**

ఈ ఫ్లీట్ రివ్యూలో భారత నావికాదళ సత్తాతో పాటు ప్రపంచ దేశాల నౌకలు కూడా కదం తొక్కాయి. ఆరు వరుసల్లో మొత్తం 71 యుద్ధ నౌకలు పరేడ్ నిర్వహించాయి. భారత నేవీకి చెందిన 45 నౌకలతో పాటు కోస్ట్‌గార్డ్, మర్చంట్ నేవీ మరియు పరిశోధన నౌకలు ఇందులో పాల్గొన్నాయి. రష్యా, ఆస్ట్రేలియా, యూఏఈ వంటి వివిధ దేశాల నుంచి వచ్చిన 19 విదేశీ నౌకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విశాఖ సముద్ర తీరం యుద్ధ నౌకల గర్జనలు, నావికాదళ విన్యాసాలతో సందడిగా మారింది. దేశ రక్షణలో నౌకాదళం పోషిస్తున్న కీలక పాత్రను ఈ వేడుక ప్రతిబింబించింది.


## సేవలు అందుబాటులోకి వచ్చాయి..
## సహనంతో ఉన్నందుకు ధన్యవాదాలు




ఢిల్లీ, ఫిబ్రవరి 18 (భారత శక్తి): గూగుల్ యాజమాన్యంలోని వీడియో ప్లాట్‌ఫామ్ యూట్యూబ్ సేవల్లో బుధవారం కొంతసేపు అంతరాయం ఏర్పడిన విషయం తెలిసిందే. లక్షలాది మంది వినియోగదారులకు లాగిన్‌లో ఇబ్బంది, ప్లే కాకపోవడం వంటి సమస్యలు తలెత్తాయి. అయితే ఈ సాంకేతిక సమస్యను పరిష్కరించినట్లు యూట్యూబ్ యాజమాన్యం వెల్లడించింది. స్ట్రీమింగ్‌లో సమస్యలు ఎదురవుతున్నట్లు తమకు ఫిర్యాదులు అందాయని తెలిపింది. రికమెండేషన్ సిస్టంలో సమస్య వల్ల యూట్యూబ్ హోంపేజీ, యాప్, యూట్యూబ్ కిడ్స్, మ్యూజిక్‌లో వీడియోలు రాలేదని తెలిపింది. లాగిన్ కాలేకపోయామని కొందరి నుంచి ఫిర్యాదులు అందాయని తెలిపింది. ఈ విస్తృత సమస్యను పరిష్కరించామని, ప్రస్తుతం అన్ని సేవలు యథావిధిగా అందుబాటులోకి వచ్చాయని తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది వినియోగదారులు అంతరాయంపై ఫిర్యాదు చేయడంతో దానిని పునరుద్ధరించినట్లు యూట్యూబ్ వెల్లడించింది. ఈ సమస్యను అన్నిచోట్ల పరిష్కరించినట్లు తెలిపింది. సాంకేతిక సమస్యను పరిష్కరించేంత వరకు సహనం వహించిన వినియోగదారులకు ధన్యవాదాలు కూడా తెలిపింది. ఈ మేరకు టీమ్ యూట్యూబ్ 'ఎక్స్' వేదికగా పోస్టు చేసింది. కాగా, అవుటేజ్‌ట్రాకింగ్ సైట్ డౌన్‌డిటెక్టర్ యూట్యూబ్‌పై 3,21,958 ఫిర్యాదులు వచ్చినట్లు సూచించింది. భారత్‌లో ఉదయం ఆరు గంటల ప్రాంతంలో 20,000 ఫిర్యాదులు వచ్చినట్లు సూచించింది. ఇందులో ఎక్కువగా యూట్యూబ్ యాప్ వినియోగదారుల నుంచి వచ్చిన ఫిర్యాదుగా తెలిపింది.

## 2034 నాటికి నెట్ జీరో నగరంగా హైదరాబాద్ : సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (భారత శక్తి): తెలంగాణ రాజధాని హైదరాబాద్ నగరాన్ని 2034 నాటికి నెట్ జీరో నగరంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. పట్టణాభివృద్ధిలో భాగంగా తాము కార్బన్ ఫుట్ ప్రింట్ ఆడిట్ చేపట్టనున్న తొలి భారత నగరంగా హైదరాబాద్ నిలవబోతుందని సీఎం పేర్కొన్నారు. వచ్చే ఐదేళ్లలో కోర్ అర్బన్ రీజియన్(క్యూర్)లో దాదాపు పరిశ్రమలు ఉండవని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ వ్యాప్తంగా గ్రీన్ ఎనర్జీకి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. రాష్ట్రంలో 30 లక్షలకు పైగా పంప్‌సెట్‌లు, దాదాపు 50 లక్షల గృహాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. బొగ్గు, సాంప్రదాయ ఇంధన వనరుల నుంచి సోలార్, గ్రీన్ ఎనర్జీ వైపు మార్చడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. కాలుష్య నియంత్రణ, రీసైక్లింగ్, స్థిర శక్తి ఉత్పత్తి పద్ధతులపై నిరంతరం పరిశోధనలు కొనసాగిస్తున్నామని సీఎం పేర్కొన్నారు. మహారాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన 'క్లైమేట్ వీక్' సదస్సులో రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. బాంద్రా కుర్లా జియో కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం ఉదయం జరిగిన ఈ సమావేశంలో దేశంలోని పట్టణాలు, నగరాభివృద్ధి, వాతావరణ మార్పులకు అనుగుణమైన విధానాలపై ముఖ్యమంత్రి తెలంగాణ దృక్పథాన్ని వివరించారు. దేశ పట్టణాభివృద్ధికి సంబంధించిన సదస్సులో మాట్లాడడం తనకు సంతోషంగా ఉందన్నారు. 2047 లక్ష్యాన్ని అర్థం చేసుకోవాలంటే 1947 నుంచి భారత అభివృద్ధి ప్రయాణాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉందని అన్నారు. స్వాతంత్ర్యం అనంతరం తొలి నాలుగు దశాబ్దాల్లో దేశంలో ప్రధాన ప్రాధాన్యతలు విద్యా వ్యవస్థ, నీటిపారుదల రంగాలేనని గుర్తు చేశారు. గ్రామీణ ప్రాథమిక పాఠశాలల నుంచి ఐఐటీ, ఐఐఎం, ఐఐఎస్సీ వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలను ఏర్పాటు చేసుకున్నామని గుర్తు చేశారు. విద్యుత్, సాగునీటికి భారీ ఆనకట్టలను నిర్మించి రైతుల పొలాలను నీటితో అనుసంధానించామని తెలిపారు. 1990 నాటికి భారత్ ఆహార కొరత నుంచి ఆహార భద్రత సాధించిందని చెప్పారు. దీంతో ప్రజల జీవిత కాలం పెరిగిందని ముఖ్యమంత్రి అన్నారు. దేశంలోని ఇంజినీర్లు, వైద్యులు, శాస్త్రవేత్తలు ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమంగా గుర్తింపు పొందే విధంగా అభివృద్ధి సాధించిందని వివరించారు. 1991 నుంచి 2020 వరకు లిబరలైజేషన్, ప్రయివేటైజేషన్, గ్లోబలైజేషన్ సంస్కరణలతో భారత్ సేవా రంగంలో శక్తివంతమైన దేశంగా ఎదిగిందని సీఎం వివరించారు. టెలికాం, సాఫ్ట్‌వేర్ విప్లవంతో పట్టణ మౌలిక సదుపాయాల విస్తరణ సాధ్యమైందని అన్నారు. భారత నిపుణులు సిలికాన్ వ్యాలీ వంటి ప్రపంచ కేంద్రాల్లో విజయాలు సాధించారని తెలిపారు. 1991 తర్వాత గ్లోబల్ సాఫ్ట్‌వేర్, టెక్ సంస్థలు తమ బ్యాక్ ఆఫీస్ కార్యకలాపాలకు భారత్‌ను ఎంచుకున్నాయని అన్నారు. అందుకే ప్రపంచంలో అత్యధిక గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు మన దేశంలో ఉన్నాయన్నారు. అయితే, ఈ టెక్ పురోగతిలో తయారీ రంగం ఎక్కువగా అవకాశాలు కోల్పోయినట్లు అభిప్రాయపడ్డారు.

## నా దుడ్లతోనే మ్యాచ్ చూస్తిని..
### నీవేమైనా ఇచ్చావా జగన్? : నారా లోకేశ్

అమరావతి, ఫిబ్రవరి 18 (భారత శక్తి): కొలంబోలో భారత్ - పాక్ జట్ల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్ కు ఆంధ్రప్రదేశ్ ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ హాజరైన విషయం తెలిసిందే. అయితే, ఈ పర్యటనకు మంత్రి లోకేశ్ ప్రభుత్వ నిధులు వాడారంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఈ ఆరోపణలపై మంత్రి సెటైర్ వేశారు. పుష్ప సినిమా స్టైల్లో జవాబిచ్చారు. భారత్‌పాక్ క్రికెట్ మ్యాచ్‌కు తాను ప్రభుత్వ ఖర్చుతో వెళ్లలేదని, సొంత డబ్బులతోనే వెళ్లానని స్పష్టం చేస్తూ మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు. వైసీపీ అనుకూల మీడియాలో వస్తున్న వార్తలను ఖండిస్తూ లోకేశ్ 'ఎక్స్' వేదికగా ఘాటు రిప్లై ఇచ్చారు. ''ఫ్లైట్ టికెట్టూ నాదే! మ్యాచ్ టికెట్టూ నాదే! నా దుడ్లతో నేను మ్యాచ్ చూస్తిని.. నీ దుడ్లు ఏమైనా ఖర్చు చేస్తినా జగన్?'' అంటూ లోకేశ్ ఎద్దేవా చేశారు. ప్రభుత్వ సొమ్ముతో విదేశీ ప్రయాణాలు చేశానన్న ఆరోపణల్లో ఏమాత్రం వాస్తవం లేదని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు.

## 'రైతు భరోసా'..మరింత ఆలస్యం..!

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (భారత శక్తి): గత రెండు మూడు రోజులుగా ఎప్పుడెప్పుడా అని రైతులు ఎదురుచూస్తున్న రైతు భరోసా మరింత ఆలస్యం కానున్నది. ప్రభుత్వం ఇందుకు సంబంధించి నిర్ణయం తీసుకునేందుకు మరింత సమయం తీసుకోనున్నది. మున్సిపల్ ఎన్నికలు ముగిసిన తర్వాత రైతు భరోసా అందిస్తామంటూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో ఫిబ్రవరి 5న మిర్యాలగూడ మండలంలోని గూడూరు సభలో ప్రకటించిన విషయం తెలిసిందే. 1.46 కోట్ల ఎకరాలకు 9 వేల కోట్ల రూపాయలు అందజేస్తామని చెప్పారు. అయితే, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలపై ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవడంతో రైతు భరోసా అందించే విషయమై సందిగ్ధత నెలకొన్నది.

**మార్చి 31 లోపే నిర్వహించాలని అనుకున్నా**

మున్సిపల్ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన అధికార కాంగ్రెస్ పార్టీ అదే ఊపులో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో కూడా జయకేతనం ఎగరవేయాలంటే ఎక్కువ ఆలస్యం చేయకూడదని రేవంత్ సర్కారు భావిస్తున్నది. పైగా 15వ ఆర్థిక సంఘం గడువు మార్చి 31న ముగుస్తున్నది. ఆలోపు జెడ్పీటీసీ ఎన్నికలు ముగించకపోతే ...కేంద్రం నుంచి రాష్ట్రానికి అందాల్సిన 498 కోట్లు మురిగిపోయే ప్రమాదం ఉన్నది. ఈ నేపథ్యంలో 566 జెడ్పీటీసీ, 5817 ఎంపీటీసీ స్థానాలకు ఆ లోపు ఎన్నికలు ముగించాలని అనుకున్నా..అందుకు పది, ఇంటర్ పరీక్షలు పెద్ద అడ్డంకిగా మారాయి. ఫిబ్రవరి 25 నుంచి మార్చి 17 వరకు ఇంటర్ పరీక్షలు, మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు పది పరీక్షలు ఉండడం ఎన్నికల నిర్వహణకు పెద్ద అడ్డంకిగా మారింది. దీనిపై ఈ నెల 23న జరిగే కేబినెట్ భేటీలో దీనిపై నిర్ణయం తీసుకోనున్నారు. ఒకవేళ ప్రభుత్వం 498 కోట్లను వదిలేసుకోవాలనుకుంటే పరిషత్ ఎన్నికలు మే నెలలో జరిగే అవకాశం ఉంది.

# మూడు కార్పొరేషన్ల ఉద్యోగుల జేఏసి ఏర్పాటు

* బదిలీలు, పదోన్నతులపై విమర్శలు

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (భారత శక్తి): ఓఆర్ఆర్ లోపలి మూడు కొత్త కార్పొరేషన్ల ఏర్పాటు తర్వాత జీహెచ్ఎంసీ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ వివాదాస్పదంగా మారనుంది. ఉద్యోగుల నుంచి కనీస అభిప్రాయం, ఆప్షన్లు ఇవ్వకుండానే ఏకపక్షంగా బదిలీలు చేపట్టడంపై జీహెచ్ఎంసీ ఉద్యోగులు ఆందోళనకు లోనవుతున్నారు. గ్రేటర్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని తొమ్మిది ఉద్యోగ, కార్మిక సంఘాలతో కలిసి జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పడింది. ఈ జేఏసీ మొట్టమొదటి కీలక సమావేశాన్ని ప్రధాన కార్యాలయంలో జరిగింది. పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న సుమారు 284 మంది ఉద్యోగులు అర్హత కలిగి ఉంటే అందులో కేవలం 74 మంది ఉద్యోగులు మాత్రమే పదోన్నతులు పొందారు. ఉద్యోగులకు కనీస సమాచారం, వారి అభిప్రాయాలు లేకుండానే అధికారులు ఇష్టారాజ్యంగా చేసిన బదిలీలను ఈ జేఏసీ విమర్శిస్తుంది. ఈ ప్రక్రియపై జేఏసీ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. 3 కొత్త కార్పొరేషన్ల తర్వాత ఉద్యోగుల సీనియారిటీని ఎలా పరిగణనలోకి తీసుకుంటారనే అంశంపై స్పష్టత లేకపోవడం ప్రధాన విమర్శ. మూడు కార్పొరేషన్లను కలిపి కామన్ సీనియారిటీ ఉంటుందా? లేక విడివిడిగా జాబితాలు రూపొంది స్తారా? అనేది తేలకపోవడంతో తమ కెరీర్ దెబ్బతింటుందని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నట్లు జేఏసీ వెల్లడించింది. పాత జీహెచ్ఎంసీ సిబ్బందికి, విలీనమైన మున్సిపాలిటీల సిబ్బందికి మధ్య సీనియారిటీ విషయంలో ఎలాంటి వివాదాలు తలెత్తకుండా ప్రభుత్వం పారదర్శకమైన మార్గదర్శకాలను వెంటనే విడుదల చేయాలని జేఏసీ డిమాండ్ చేసింది. పునర్వ్యవస్థీకరణ సాకుతో ఏ ఒక్క ఉద్యోగి సీనియారిటీకి గానీ, ప్రమోషన్ అవకాశాలకు గానీ నష్టం కలగకూడదనేదే తమ ప్రధాన సంకల్పమని వారు వెల్లడించారు. మూడు కార్పొరేషన్లలో కామన్ సీనియారిటీ వ్యవస్థను కొనసాగించాలని, సీనియారిటీ, ప్రమోషన్ హక్కులను కాపాడుతూ, తక్షణమే అధికారిక ఉత్తర్వులు జారీ చేయాలని జేఏసీ డిమాండ్ చేసింది. అలాగే




ఉద్యోగులందరికీ ఒకసారి 'ఆప్షన్' ఇచ్చుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేసింది. వీటన్నింటిని పర్యవేక్షించేందుకు పరిపాలన, న్యాయ నిపుణులు, జేఏసీ ప్రతినిధులతో కూడిన 'క్యాడర్ పునర్వ్యవస్థీకరణ, సీనియారిటీ ప్రొటెక్షన్ కమిటీ'ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది. ఈ సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం వెంటనే చర్చలకు పిలవాలని జేఏసీ విజ్ఞప్తి చేసింది. ఉద్యోగుల న్యాయమైన ఆందోళనలను పట్టించుకోకపోతే, తమ హక్కుల రక్షణ కోసం ప్రజాస్వామ్యబద్ధంగా ప్రత్యక్ష పోరాటానికి దిగాల్సి వస్తుందని జేఏసీ హెచ్చరించింది. తెలంగాణ స్టేట్ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ స్టాఫ్, వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ), భాగ్యనగర్ మున్సిపల్ జీహెచ్ఎంసీ ఎంప్లాయీస్ యూనియన్ (బీఎంఎస్), హిందూ మజ్దూర్ సభ (హెచ్ఎం ఎస్), తెలంగాణ స్వచ్ఛ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్ జీహెచ్ఎంఈయూ), తెలంగాణ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ (టీఆర్ఎస్ కేవీ), జీహెచ్ఎంసీ ఆఫీసర్స్, ఎన్జీఓ యూనియన్ యూనియన్లు భాగస్వామ్యం కాగా, తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఎస్సీ, ఎస్టీ), జీహెచ్ఎంసీ రెవెన్యూ ఎంప్లాయీస్ యూనియన్ (రెవెన్యూ) అసోసియేషన్లు జేఏసీలో భాగస్వాములయ్యాయి.




# ప్రజల ఫిర్యాదులు

## స్వీకరించిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల

ఉమ్మడి ఆదిలాబాద్, ఫిబ్రవరి 18 (భారత శక్తి): భైంసా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భైంసా సబ్‌డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన *7* మంది ఆర్జిదారుల ఫిర్యాదులను స్వీకరించి, ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించారు. ఫిర్యాదు దారుల ఎదుటే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, బాధితులకు చట్టపరంగా అవసరమైన సహాయాన్ని వెంటనే అందించాలని సూచించారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కుటుంబ వివాదాల పరిష్కారంలో 'షీ టీం' పాత్ర: ఈ కార్యక్రమంలో వచ్చిన కొన్ని కుటుంబ సమస్యలపై షీటీం సిబ్బంది ఇరు వర్గాలకు కౌన్సిలింగ్ నిర్వహించారు. కౌన్సిలింగ్ ద్వారా కుటుంబాలు తిరిగి కలుసుకోవడం జరిగింది. ప్రజలు నిర్మల్ వరకు రావడం కష్టంగా ఉండగా, భైంసాలోనే కౌన్సిలింగ్ కల్పించడం పై ఎస్పీ గారు చూపిన ఆలోచనను బాధితులు సంతృప్తిని వ్యక్తం చేశారు.

* పెండింగ్ ఫిర్యాదులపై సమీక్ష:

ఈ సందర్భంగా గతంలో గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కార స్థితి, ఇంకా పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని పెండింగ్ లో ఉన్న వాటిని వేగంగా పరిష్కరించాలన్నారు.

# 14 గోల్డ్ మెడల్స్ సాధించిన జీఎన్ఆర్ చైతన్య హై స్కూల్ విద్యార్థులు

ఎల్బీనగర్, ఫిబ్రవరి 18 (భారత శక్తి): చైతన్యపురిలోని జీఎన్ఆర్ చైతన్య హై స్కూల్ మరోసారి తన ప్రతిభను జాతీయ స్థాయిలో ఘనంగా చాటుకుంది. ప్రతిష్టాత్మకమైన (నేషనల్ సైన్స్ ఒలింపిడ్) పరీక్షలో పాఠశాలకు చెందిన 14 మంది విద్యార్థులు గోల్డ్ మెడల్స్ సాధించి విశిష్ట విజయాన్ని నమోదు చేశారు. ఈ సువర్ణ విజయంతో పాఠశాల విద్యా ప్రమాణాలు మరోసారి రుజువయ్యాయి. నాణ్యమైన బోధన, బలమైన పునాది (ఫౌండేషన్ బేసిక్స్), క్రమబద్ధమైన శిక్షణా విధానం, విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ ఈ విజయానికి ప్రధాన కారణాలుగా నిలిచాయి. ఈ సందర్భంగా నిర్వహించిన అభినందన సభ అత్యంత వైభవంగా జరిగింది. పాఠశాల చైర్మన్ జి. నరేందర్ రెడ్డి స్వయంగా విజేతలకు గోల్డ్ మెడల్స్ అందజేసి సత్కరించారు. అనంతరం ప్రసంగిస్తూ, "మన




పాఠశాలలో అందిస్తున్న నాణ్యమైన విద్య, బలమైన పునాది, క్రమశిక్షణతో కూడిన శిక్షణా విధానం వల్లే మన విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో నిరంతరం విజయ పతాకాన్ని ఎగరవేస్తున్నారు. భవిష్యత్తులో కూడా ఇదే పట్టుదలతో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆశిస్తున్నాను" అని ప్రేరణాత్మకంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్, డీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజేతలను అభినందించారు. జీఎన్ఆర్ చైతన్య హై స్కూల్ విద్యార్థుల సమగ్రాభివృద్ధి దిశగా నాణ్యమైన విద్యా సేవలను అందిస్తూ ఎల్లప్పుడూ ముందంజలో కొనసాగుతోంది

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మున్సిపల్ పాలకవర్గం పనిచేయాలి

: నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి, ఫిబ్రవరి 18 (భారత శక్తి): సదాశివపేట మున్సిపల్ చైర్మన్ గా మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ, వైస్ చైర్మన్ రేణుక చిరు ల బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్ లను ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం లో మున్సిపల్ పాలక వర్గం ఎల్లప్పుడూ ముందుడాలని సూచించారు. అభివృద్ధి నిధులను సక్రమంగా వినియోగిస్తూ పట్టణాభివృద్ధి కి పాటుపడాలన్నరు. ఈ కార్యక్రమం లో సిడిసి చైర్మెన్ రామ్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మునిపల్లి సత్యనారాయణ, చిరు, అరుణ్, శరత్ తదితరులు పాల్గొన్నారు.



* అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొన్న నిర్మల జగ్గారెడ్డి

సదాశివపేట మండలం మద్దికుంట, ఏటి గడ్డ సంఘం, తంగెడుపల్లి గ్రామాలలో బుధవారం టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పర్యటించారు. ఏటి గడ్డ సంఘం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం లో పాల్గొన్నారు. అనంతరం మద్ది కుంట గ్రామం లో ఇందిరమ్మ ఇళ్ళ గృహ ప్రవేశాల తో పాటు గ్రామంలోని నూతనంగా నిర్మించబోయే స్కూల్ కాంపౌండ్ నిర్మాణానికి ఆమె భూమి పూజ నిర్వహించారు. అదేవిధంగా తంగేడుపల్లి గ్రామం లో సైతం స్కూల్ కాంపౌండ్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమం లో స్థానిక సర్పంచ్ లు, నాయకులు పాల్గొన్నారు.




# టాలెంట్ టెస్ట్ లో మోడల్ స్టూడెంట్"దీక్షిత్"ఫస్ట్

మహబూబాబాద్ జిల్లా, ఫిబ్రవరి 18 (భారత శక్తి): మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక గౌడ్ హై స్కూల్ లో మండలంలోని వివిధ పాఠశాలలకు బుధవారం నిర్వహించిన సైన్స్ టాలెంట్ టెస్ట్ పోటీలలో మోడల్ స్కూల్ ప్రథమ స్థానంలో నిలిచింది. 9వ,తరగతి స్టూడెంట్ సింగరం దీక్షిత్ టెస్టులో టాలెంట్ కనపరిచి ఫస్ట్ ప్రైజ్ పొందాడు. ఈ సందర్భంగా ఎంఈఓ రాందాసు మాట్లాడుతూ..మేధాశక్తి పెంపొందించుకోవడంలో సైన్స్ పాత్ర కీలకమైనదన్నారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జి.ఉపేందర్ రావు మాట్లాడుతూ ఇటీవల నిర్వహిస్తున్న పలు ప్రతిభాపాటవ పోటీలలో తమ పాఠశాల విద్యార్థినీ,విద్యార్థులు అసాధారణ ప్రతిభ క నపరుస్తున్నారని చెప్పారు. దీనికి కారణం ఉపాధ్యాయుల సమర్థవంతమైన బోధన, ప్రోత్సాహం విద్యార్థుల పట్టుదల అన్నారు. ఈ సందర్భంగా సైన్స్ టీచర్ను,ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. కార్యక్రమంలో హెచ్.ఎం.లు వాణి,జలగం శ్రీను,ఉపాధ్యాయులు జీవన్ కుమార్,ఉపాధ్యాయులు రాంనర్సయ్య, జ్యోతి, తదితరులు ఉన్నారు.

# 4వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ క్రీడలకు సర్వం సిద్ధం

: సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్

సైబరాబాద్, ఫిబ్రవరి 18 (భారత శక్తి): సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ ఆతిథ్యమిస్తున్న "4వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2026" నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ తెలిపారు. నేటి నుంచి జరగనున్న ఈ క్రీడలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను ఆయన స్వయంగా పర్యవేక్షించి, వసతి, భోజనం, రవాణా, భద్రతా ఏర్పాట్లపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 3 కమిషనరేట్లు, 7 పోలీస్ జోన్లు, అలాగే గ్రేహౌండ్స్, ఆక్టోపస్, ఇంటెలిజెన్స్, రైల్వే పోలీస్, టీఎస్ఎస్పీ బెటాలియన్లు తదితర ప్రత్యేక విభాగాల నుంచి మొత్తం **2,532 మంది క్రీడాకారులు** ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. వీరిలో 1,933 మంది పురుషులు, 599 మంది మహిళా సిబ్బంది ఉన్నారు. ఈ రాష్ట్ర స్థాయి క్రీడల్లో మొత్తం 31 రకాల పోటీలు నిర్వహించనున్నారు. ఈ క్రీడల్లో అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, హాకీ, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్, బాక్సింగ్, జుడో, జిమ్నాస్టిక్స్, స్విమ్మింగ్, షూటింగ్, బ్యాడ్మింటన్, టెన్నిస్, టేబుల్ టెన్నిస్, పవర్ లిఫ్టింగ్, బెస్ట్ ఫిజిక్, క్రాస్ కంట్రీ, యోగా, ఆర్చరీ, సెపక్ తక్రా, సైక్లింగ్, ఫెన్సింగ్, మల్లఖాంబ్, పెన్కాక్ సిలాట్, తైక్వాండో, వుషు మరియు ట్రయాథ్లాన్ వంటి మొత్తం 31 రకాల క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీడాకారులకు వసతి, భోజనం, రవాణా, వైద్య సదుపాయాలు పకడ్బందీగా కల్పించామని, ఈ క్రీడలు పోలీసు సిబ్బందిలో ఐక్యతను పెంపొందించడంతో పాటు వృత్తి ఒత్తిడికి ఉపశమనం కలిగిస్తాయని సీపీ పేర్కొన్నారు. క్రీడాకారుల సౌకర్యార్థం తెలంగాణ పోలీస్ అకాడమీ (TGPA)లోని JOM, SOM, SOTC బ్లాకుల్లో 806 పడకలతో వసతి కల్పించారు. అధికారుల హోదాను అనుసరించి ప్రత్యేక వసతి బ్లాకులు కేటాయించడమే కాకుండా పౌష్టికాహారం అందించేలా మెనూను స్వయంగా పర్యవేక్షిస్తున్నామని సీపీ పేర్కొన్నారు. ఫిబ్రవరి 18న సైబరాబాద్ కార్ హెడ్ క్వార్టర్స్ పరేడ్ గ్రౌండ్‌లో ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు గచ్చిబౌలి స్టేడియం, దుర్గం చెరువు, ఎల్‌బీ స్టేడియం, సైబరాబాద్ షూటింగ్ రేంజ్‌లలో వివిధ క్రీడా పోటీలు జరుగనున్నాయి. ఫిబ్రవరి 20న క్రీడాకారులందరితో కలిసి నిర్వహించే 'బడా ఖానా', సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నాయి. క్రీడల నిర్వహణ కోసం నియమించిన నోడల్ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, క్రీడాకారుల రవాణా, భోజనం మరియు వైద్య సదుపాయాల విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని సీపీ ఆదేశించారు. ఈ క్రీడలు పోలీసు సిబ్బందిలో ఐక్యతను బలోపేతం చేయడంతో పాటు వృత్తిపరమైన ఒత్తిడి నుండి ఉపశమనం కలిగిస్తాయని ఆయన తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీ నుంచి పొన్న శంకర్ రెడ్డి సస్పెన్షన్

## విలేకరుల సమావేశంలో ప్రకటించిన పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎం.జార్జ్

సంగారెడ్డి, ఫిబ్రవరి 18 (భారత శక్తి): మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి వ్యతిరేకంగా పనిచేసిన కాంగ్రెస్ నాయకుడి పై వేటుపడింది. ఈ మేరకు బుధవారం సంగారెడ్డి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎం జార్జ్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. 12వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి ప్రవీణ్ కుమార్ కు వ్యతిరేకంగా పనిచేసిన కాంగ్రెస్ నాయకుడు పొన్న శంకర్ రెడ్డిపై అధిష్టానం సూచన మేరకు వేటు వేస్తూ పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. గతంలోనే పొన్నాశంకర్ రెడ్డి పార్టీకి వ్యతిరేకంగా పనిచేసే సస్పెండ్ కు గురైనట్లు గుర్తు చేశారు. కాగా పార్టీకి వ్యతిరేక కార్యకలాపాలు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో



టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత కిషన్ మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ హఫీజ్, సీనియర్ నాయకులు బొంగుల రవి కూన సంతోష్ మహేష్ ముదిరాజ్ కౌన్సిలర్ శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## 9వ వార్డు బోనమ్మ తండాలో ఆంజనేయస్వామి గుడికి భూమి పూజ చేసిన కౌన్సిలర్ విభూది మహేశ్వరి

వనపర్తి జిల్లా , ఫిబ్రవరి 18 (భారత శక్తి): వనపర్తి పట్టణ కేంద్రంలో 9వ వార్డులో బోనమ్మ తండా లో ఆంజనేయ స్వామి గుడికి భూమి పూజ చేశారు. కౌన్సిలర్ విభూది మహేశ్వరి మాట్లాడుతూ ఎన్నికలలో హామీ ఇచ్చిన వనపర్తి శాసనసభ్యులు తుడి మెగా రెడ్డి ఆదేశానుసారం తాండా, కాలనీవాసుల అభీష్టంమేరకు శ్రీ ఆంజనేయ స్వామికి పూజలు చేసి జెసిబి సహాయంతో భూమి చదునుపనులు ప్రారంభించడం జరిగినది త్వరలోనే గుడికి కమ్యూనిటీ హాల్ కింద ఎమ్మెల్యే



నిధులు కేటాయిస్తారనీ వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చీర్ల జనార్ధన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విభూది నారాయణ చీర్ల ఆంజనేయులు చీర్ల పాండు సాగర్ చీర్ల రాములు మాజీ కౌన్సిలర్ భాషా నాయక్ రాంజీ నాయక్ చీర్ల అయ్యన్న గుంటి రాజు చీర్ల సత్యం ఎల్లయ్య రాము నాయక్ తిరుపతి నాయక్ గుంటి మన్యం తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.